నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | గురువారం 14-1-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 140 | పేజీలు: 8 | వెల: రూ.1/-

జంటనగరాల్లో సంక్రాంతి వేడుకలు

భోగిమంటలతో సరదాలు
పోటీపడి ముగ్గులేసిన ఆడపడచులు

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): గ్రామాలకు వెళ్లినవారు వెళ్లగా హైదరాబాద్‌లో ఉన్న వారు పండగ వేడుకల్లో పాల్గొనడంతో జంగనగరాల్లోనూ సందడి కనిపించింది. ఉదయమే పలుకాలనీల్లో రంగవల్లులు, గొబ్బెమ్మలు అందంగా దర్శనమిచ్చాయి. లోగిళ్ల ముందు ముత్యాల ముగ్గులు పలుకరించాయి. పలు కాలనీల్లో భోగిమంటలు వేసి సందడి చేశారు. గేటెడ్ కమ్యూనిటీలతో పాటు కూకట్‌పల్లి, పటాన్‌చెరు, నిజాంపేట, అమీర్ పేట, జూబ్లీహిల్స్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో భోగి మంటల సందడి కనిపించింది. ఇప్పటికే చాలామంది నగరవాసులు సొంతూళ్లలో బంధువులతో కలిసి పండుగ చేసుకునేందుకు పల్లెబాట పట్టారు. ఇక్కడే ఉన్నవారు చుట్టుపక్కల కుటుంబాలతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రెండు మూడు రోజులుగా ప్రతి ఇంటిముంగిటా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ముంగిళ్లలో తీర్చిదిద్దిన రంగవల్లికలు.. ముచ్చటగా కనిపించే గొబ్బెమ్మలతో చాలా ముందుగానే సంక్రాంతి వచ్చిందా అనిపించింది. సంక్రాంతి... పది రోజులు ముందుగానే.. ప్లలెల్లో పండుగ మొదలవుతుంది. ఉదయం, సాయంత్రం.. ఇంటిముందు కళ్లాపి చల్లి... అందమైన ముగ్గులు వేస్తారు. ఆవుపేడతో గొబ్బెమ్మలు చేస్తారు. పూలు, పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. గ్రామాల్లో ఆవులు, గేదెలు ఉంటాయి కాబట్టి పేడకు కొదవ ఉండదు. సిటీలో పేడరంగులాంటి పౌడర్‌తో కల్లాపి చల్లి రంగవల్లులు వేశారు. సంక్రాంతి శుభాకాంక్షల అందులో మెరిశాయి. భోగి మంటలకు పిడకలు, గొబ్బెమ్మలకు కూడా అంతారెడీమేడ్ వ్యవహారాలే నడిచాయి. హరిదాసుల పాటలు. గంగిరెద్దుల ఆటలు.. సంప్రదాయ వస్త్రధారణతో మెరిసిపోతున్న చిన్నారులతో సంక్రాంతి ముందుగానే వచ్చినట్టుంది. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే వారు ఒక్కచోటకు చేరి రంగవల్లికలు తీర్చిదిద్దారు. పిల్లలకు భోగిపండ్లు పోస్తూ సంబరాలు చేసుకున్నారు. పలు పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులు వేడుకల ఏర్పాటు చేసారు. వేషధారణలు, ముత్యాల ముగ్గుల పోటీలు పెడుతున్నారు. సంప్రదాయ పిండివంటలను రుచి చూపుతున్నారు. తెల్లవారుజామునే.. భోగిమంటలు వేసి.. కొత్త సరదాలను ఆస్వాదించారు. ఇక సంప్రదాయ పిండివంటలు చేసి అమ్మే షాపులు కిటకిటలాడాయి. రెడీమేడ్ స్వగృహ షాపుల్లో అరిసెలు, బొబ్బట్లు, కజ్జికాయలు, జంతికలు, గవ్వలు, చెక్కలు, సున్నుండలు, పూతరేకులను ప్రత్యేక ఆఫర్లతో అందిస్తున్నారు.వ్యాపార కార్యకలాపాల్లో మునిగి తేలుతున్నారు.

తెలుగు ప్రజలకు ప్రధాని మోడీ భోగి శుభాకాంక్షలు

తెలుగులో ట్వీట్ చేసిన ప్రధాని

న్యూఢిల్లీ,జనవరి13(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ భోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని తెలుగులో ట్వీట్ చేసి తెలుగు ప్రజల మనసులను దోచేసుకున్నారు. ఈ ప్రత్యేక రోజు అందరి జీవితాల్లోకి భోగభాగ్యాలను, ఆయురారోగ్యాలను తీసుకురావాలని ప్రార్థిస్తున్నాను అని మోదీ ట్వీట్‌లో పేర్కొన్నారు.

మరో ఇద్దరు లోన్ నిర్వాహకుల అరెస్ట్

హైదరాబాద్,జనవరి13(ఆర్ ఎన్ఎ): ఇన్‌స్టంట్ లోన్ యాప్ నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు నిర్వాహకులను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. చైనా దేశస్తుడితో పాటు ముంబైకి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. ముంబైలో లోన్ యాప్ సంస్థ కాల్‌సెంటర్ నిర్వహి స్తోంది. నిందితుల బ్యాంక్ అంకౌంట్‌లో రూ.28 కోట్లు పోలీసులు ఫ్రీజ్ చేశారు. దారుణ యాప్ లోన్లకు ఇటీవల పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో లోన్ వేధింపులు తాళలేక బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఆత్మహత్యలు పెరిగిపోవడంతో పోలీసులు అప్రమత్తమై యాప్ లోన్ నిర్వాహకుల భరతం పడుతున్నారు.

విహార యాత్రలో విషాదం

చెట్టును ఢీకొన్న బైక్: ముగ్గురు మృతి

మెదక్,జనవరి13(ఆర్ఎన్ఎ): విహారం వారి పాలిట విషాదంగా మారింది. ప్రకృతి అందాలను తిలకించి పులకించాలన్నా వారి ఆశలు అడియాసలయ్యాయి. వారి విహారయాత్రలో విషాదం చోటు చేసుకుంది. సరదాగా ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ముగ్గురు మృత్యు ఒడికి చేరారు. ఈ హృదయవిదారకర సంఘటన మెదక్ జిల్లాలో జరిగింది. మెదక్ పట్టణానికి చెందిన యువకులు సోఫిక్, జమీర్, సమీర్ పుల్కల్ మండలంలోని సింగూరు డ్యామ్ చూసేందుకు బయల్దేరారు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా జమీర్, సమీర్ మృతి చెందారు. సోఫిక్‌ను హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరోనా వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

-మంత్రి ఈటెల రాజేందర్ వెల్లడి

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఈ నెల 16 నుంచి తొలి విడుత కరోనా వ్యాక్సినేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రాష్ట్రానికి ఇప్పటివరకు 3.60 లక్షల డోసులు వచ్చాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కరోనా ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు టీకాలు పంపిణీ చేసేందుకు 139 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటిలో 99 ప్రభుత్వ దవాఖానలు, 40 ప్రైవేట్ దవాఖానలు న్నాయి. మొదటి డోసు తీసుకున్న వారికి 28 రోజుల తర్వాత రెండో డోసు ఇస్తారని తెలిపారు. ఇదిలాఉండగా తెలంగాణ వ్యాప్తంగా వ్యాక్సిన్ భద్రత కోసం 800 కోల్డ్ చైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోఠి నుంచి వ్యాక్సిన్‌ను జిల్లా కేంద్రాల్లోని ఇమ్యూనేషన్ కేంద్రాలకు తరలిస్తున్నారు. వ్యాక్సిన్‌ను 2 నుంచి 8 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలో భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిరోజు 13వేల 900 మంది హెల్త్‌వర్కర్లకు వ్యాక్సిన్ వేస్తారు. ఇప్పటికే రాష్ట్రానికి 16 లక్షల సిరెంజ్‌లు చేరాయి. వ్యాక్సిన్ ఇచ్చేందుకు 10 లక్షల మంది ఉద్యోగులను ఆరోగ్యశాఖ సిద్ధం చేసింది.

అంగన్‌వాడీల పునఃప్రారంభానికి మార్గదర్శకాలు

ప్రభుత్వాలను ఆదేశించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ,జనవరి13(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలను తిరిగి ప్రారంభించడంపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. దేశంలోని కంటైన్‌మెంట్ జోన్‌ల వెలుపల అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభంపై జనవరి 31లోగా నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయితే కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాలు విపత్తు నిర్వహణ అధికారులను సంప్రదించి, తర్వాత మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలను తెరువడానికి ఏర్పాట్లు చేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఆహార భద్రత ప్రమాణాల చట్టం షెడ్యూల్ 2 ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు పిల్లలకు, తల్లులకు పోషక సాయం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలతోపాటు తల్లులకు, గర్భిణీలకు ప్రభుత్వం పోషక ఆహారాన్నిఅందిస్తున్నది. అయితే కరోనా కారణంగా గత మార్చిలో ఈ అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో వాటిని తిరిగితిరిచే అంశంపై కోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది.

కరోనాతో స్వీట్,కైట్ ఫెస్టివల్ రద్దు

ఏటా సందడిగా కనిపించే పరేడ్ గ్రౌండ్ ఖాళీ

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్ అట్టహాసంగా నిర్వహించేవారు. ఈ యేడాది కరోనా కారణంగా ఇది నిర్వహించడం లేదు. దీనిపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఏటా పర్యాటక శాఖ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మామిడి హరికృష్ణ తదితరులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చేపట్టేవారు. పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ గాలిపటాలు అందరినీ ఆకట్టుకునేవి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు గాలిపటాలు ఎగురవేసేవారు. స్వీట్ ఫెస్టివల్‌లో దాదాపు వెయ్యి రకాల స్వీట్లు కొలువు దీరేయి. మూడు రోజులపాటు ఈ ఫెస్టివల్ నిర్వహించేవారు. వివిధ దేశాలకు చెందిన నిపుణులు హైదరాబాద్‌లో నిర్వహించే అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు హాజరయ్యేందుకు వచ్చేవారు. అలాగే రాష్ట్ర భాషాసాంస్కృతికశాఖ డప్పుల దరువులు, కోలాటాలు, గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుడకలు వంటి సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించేది. జానపద కూచిపూడి, ఆంధ్రనాట్యం, పేరిణి శివతాండవం, భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య రూపకాలతో ఆకట్టుకునే వారు. గతేడాది వెయ్యికి పైకా మిఠాయిలు ఉత్సవాల్లో ప్రదర్శించారు. కాకినాడ ఖాజా, బందరు లడ్డూలు, పదిరకాల పాయసాలు కొలువుదీరాయి. హైదరాబాద్‌లో స్థిరపడిన గుజరాతీలు, బెంగాళీలు, రాజస్తానీలు, కేరళ, తమిళనాడు, కర్ణాటక అసోసియేషన్స్ మిఠాయిలను ప్రదర్శనకు తీసుకుని వచ్చేవారు. కానీ ఈ యేడు కరోనా వీటిని మింగేసింది. దీంతో ఉత్సవాలను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

ముదిరిన మైహోం భూముల వ్యవహారం

మేళ్లచెరువులో పరస్పర సవాళ్లతో ఉద్రిక్తత

సూర్యాపేట,జనవరి13(ఆర్ఎన్ఎ): సూర్యాపేట జిల్లాలోని మేళ్లచెరువు స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. మైహోమ్ సిమెంట్స్ మైనింగ్ లీజు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో కొన్ని రోజులుగా వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో టీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం నెలకొంది. మైహోమ్ సంస్థకు 'మీరంటే - మీరు అమ్ముడుపోయారు' అంటూ ఇరు పార్టీల నాయకులు సోషల్ మీడియా వేదికగా వాగ్వాదానికి తెర తీశారు. ఈ వివాదం నేపథ్యంలో బీజేపీ నాయకులు ప్రమాణానికి సిద్ధమయ్యారు. అందులో భాగంగా తన నిజాయతీని నిరూపించు కునేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి శివాలయంలో ప్రమాణం చేసేందుకు బుధవారం ఆలయానికి వచ్చారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. వేపలమాధారం, మేళ్లచెరువు గ్రామాల పరిధిలోని 631 ఎకరాల్లో మైనింగ్ విస్తర ణను మైహోం సంస్థ చేపట్టాలని భావించి ంది. దీనిపై ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగుతోంది. దీనిపై దాదాపు 15 రోజులుగా వివాదం ఏర్పడిన విషయం తెలిసిందే. మైనింగ్ విస్తరణతో కాలుష్యం పెరుగుతుందని, పొలాల్లో పంట లు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని స్థానిక ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. మైహోం సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కొత్తకొండ వీరభద్రస్వామికి ఈటెల పూజలు

16నుంచి కరోనా వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు

వరంగల్,జనవరి13(ఆర్ఎన్ఎ): భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ బుధవారం దర్శించుకున్నారు. భోగిని పురస్కరించుకుని ఇక్కడికి వచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు స్వాగతం పలికి తీర్థప్రాసదాలు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కొత్తకొండ వీరభద్రస్వామి కొండపైకి త్వరలో ఘాట్ రోడ్డును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 16 నుండి మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 139 సెంటర్లలో కరోనా ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటివరకు 3,60,000 డోసులు వచ్చాయని మంత్రి ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. భోగి పర్వదినం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఐనవోలు మల్లన్న, కొత్తకొండ వీరన్న, ఆలేటి ఎల్లమ్మ ఆలయాల్లో జాతర సందడి నెలకొంది. ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇవాళ స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యగవచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహనివేదన నీరాజన మంత్ర పుష్పం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

వివిధ రాష్ట్రాలకు కోవాగ్జిన్ వ్యాక్సిన్

హైదరాబాద్ నుంచి ఎయిరిండియా విమానాల్లో తరలింపు

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): దిగ్గజ ఔషధ సంస్థ భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన కొవాగ్జిన్ టీకా తొలి విడత డోసులు బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు 11 విమానాల్లో బయల్దేరాయి. ఇప్పటికే టీకా దిల్లీ, ముంబయి చేరుకుంది. 55 లక్షల కొవాగ్జిన్ డోసులు నేటికల్లా వివిధ రాష్ట్రాలకు చేరనున్నాయి. దిల్లీ, ఆంధ్రప్రదేశ్, అసోం, ఒడిశా, తమిళనాడు, బిహార్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లకు టీకా డోసులు తరలించనున్నారు. ఎయిరిండియా విమానం ఏఐ599 విమానంలో బుధవారం ఉదయం 6.40 గంటలకు రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరిన కొవాగ్జిన్ టీకా డోసులు 9 గంటలకు దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరాయి. ఈ మేరకు విమానాశ్రయ అధికారులు తెలిపారు. అనంతరం టీకాలను భద్రపరచేందుకు రాజీవ్‌గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (ఆర్‌జీఎస్ఎస్‌హెచ్)కు తరలించనున్నారు. వీటిలో 38.5 లక్షల డోసులను కేంద్రం కొనుగోలు చేయగా 16.5 లక్షల డోసులను భారత్ బయోటెక్ ప్రభుత్వానికి ఉచితంగా అందిస్తోంది.

కొవాగ్జిన్ టీకాలు సుమారు ఒంటిగంట ప్రాంతంలో ఆస్పత్రికి చేరనున్నాయి. వచ్చిన టీకాల నుంచి మేము 20వేల డోసులు తీసుకుంటున్నట్లు ప్రభుత్వానికి వెల్లడించామని ఆస్పత్రి డైరక్టర్ బీఎల్ షేర్వాల్ తెలిపారు. మొదటి దశలో భాగంగా 55లక్షల వ్యాక్సిన్‌లను పంపే లక్ష్యంతో ఉన్నామని భారత్ బయోటెక్ తెలిపింది. మంగళవారం ఆర్‌జీఎస్ఎస్‌హెచ్ 2.64 లక్షల కొవిషీల్డ్ టీకాలను సేకరించి, భద్ర పరచింది. సీరం ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చిన 22 బాక్సుల్లో కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను సేకరించామని ఆస్పత్రి అధికార ప్రతినిధి వెల్లడించారు. భారత్‌లో అభివృద్ధి చేసిన కొవిషీల్డ్, కొవాగ్జిన్ టీకాలు అత్యవసర వినియోగ అనుమతిని పొందాయి. వీటి వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఎదురవ్వవని నీతీ ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే పాల్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక సమావేశంలో తెలిపారు. భారత్‌లో కొవిడ్ వ్యాక్సినేషన్ పక్రియను జనవరి 16నుంచి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు కేంద్ర ఆరోగ్య కార్యదర్శి రాజేశ్‌భూషణ్ తెలిపారు.

మహబూబ్‌నగ్‌లో ఎయిర్ షో వేడుకలను తిలకించిన మంత్రి శ్రీనివాసగౌడ్

పాలమూరులో అంతర్జాతీయ ఫెస్ట్ ఆనందదాయకం

ఎయిర్‌షోపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ హర్షం

మహబూబ్‌నగర్,జనవరి13 (ఆర్ ఎన్ఎ): వలస జిల్లాగా పేరొందిన మహబూబ్‌నగర్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్స్ నిర్వహించడం సంతోషంగా ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో ఏరో స్పోర్ట్స్, పారా మోటార్ ఛాంపియన్ షిప్‌ను ప్రారంభిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు రోజులు ఆకాశంలో మోటార్ పైలెట్ల విన్యాసాలు జరుపడం, పది రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఎయిర్ షో, పారామోటార్ చాంపి యన్‌షిప్ పోటీలు నిర్వహించినట్లు పేర్కొ న్నారు. గతేడాది కైట్ ఫెస్టివల్‌కు నిర్వహి ంచినట్లు గుర్తు చేశారు. అన్ని రంగాల్లో పాలమూరు జిల్లా అభివృద్ధి చెందుతుంద న్నారు. త్వరలోనే అతిపెద్ద పరిశ్రమ మహబూబ్‌నగర్ జిల్లాకు రాబోతుందన్నారు. దేశంలోనే తొలి ఏరో స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌ను జిల్లాలో ఏర్పాటు చేస్తామన్నారు. కరివేన-ఉద్దండాపూర్ రిజర్వాయర్ల మధ్య కేటాయిస్తామన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ జనుబడుమహాశ్వేతాదే
వి సిరిగల ఆపుమనము లందు వేసుతులడగన్
ఘన "జ్ఞాన పీఠ" బహుమతి
ఆసుధనుగ వచ్చి చేరి అన్నియు మొందెనే !!

జనవరి 14 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత,రచయిత్రి మహాశ్వేతాదేవి జయంతి..

-రాధశ్రీ
సెల్: 9494481210

బీహార్‌లో మృగాళ్ల రాక్షస క్రీడ

బధిర బాలికపై సామూహిక అత్యాచారం
కళ్లు పొడిచి పైశాచికానందం

పట్నా,జనవరి13(ఆర్ఎన్ఎ): బిహార్ మధుబని జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. 15 ఏళ్ల బధిర బాలికపై గుర్తు తెలియని దుండగులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. అంతే కాకుండా తమను ఎక్కడ గుర్తుపడుతుందేమోననే భయంతో ఆ బాలిక కళ్లను పొడిచి వేశారు. బాలిక పూర్తిగా కంటి చూపును కోల్పోగా.. బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మధుబని జిల్లాలోని హర్లాఖి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని కౌవాహ్ బర్హి గ్రామంలో మంగళవారం బదిర (చెవిటి, మూగ) బాలిక మేకలను మేత కోసం తీసుకెళ్లింది. ఈ క్రమంలో పొరుగున ఉన్న మనోహర్‌పూర్ గ్రామంలోని బంజరు పొలంలో బాలిక అపస్మారక స్థితిలో కనిపించింది. గమనించిన పలువురు బాలిక కుటుంబానికి సమాచారం ఇచ్చారు. వెంటనే బాలికను ఉమ్గావ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మధుబని సదర్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని హర్లాఖి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ ప్రేమ్‌లాల్ పాశ్వాన్ తెలిపారు.

ముగిసిన అఖిలప్రియ పోలీస్ కస్టడీ

పలు అంశాలపై వివరాలు రాబట్టిన పోలీసులు
కిడ్నాప్ డ్రామా తెలియడంతోనే కిడ్నాపర్ల విడుదల

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): బోయినపల్లి కిడ్నాప్ కేసులో మూడోరోజు అఖిలప్రియ కస్టడీ ముగిసింది. ఈ మూడ్రోజుల కస్టడీలో పోలీసులు పలు విషయాలు రాబట్టినట్టు చెబుతున్నారు. 300కి పైగా ప్రశ్నలకు పోలీసులు సమాధానాలు రాబట్టినట్టు సమాచారం. అఖిలప్రియ చెప్పిన సమాచారంతో పలు ఆధారాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎంజీఎం స్కూల్, కూకట్‌పల్లి హోటల్‌లో కొన్ని ఆధారాలు సీజ్ చేశారు. ఎంజీఎం స్కూల్‌లో కిడ్నాపర్లతో భార్గవ్, చంద్రహాస్‌లు భేటీ అయ్యారు. కూకట్ పల్లిలోని హోటల్‌లో మాదాల శ్రీనుతో భార్గవ్ భేటీ అయినట్టు చెబుతున్నారు. స్కూల్ లో సినిమా మాపెట్టి కిడ్నాప్ కు భార్గవ్ స్కెచ్ వేసినట్టు చెబుతున్నారు. కిడ్నాప్ సమయంలో బోయినపల్లి వరకూ కారులోనే వెళ్లిన భార్గవ్ లోపలి మాత్రం వెళ్ళలేదు. అలానే కిడ్నాప్ తర్వాత మొయినాబాద్ ఫామ్‌హౌస్ చేరుకున్న భార్గవ్ సంజయ్, ప్రవీణ్‌లతో సంతకాలు చేయించినట్టు గుర్తించారు. కిడ్నాప్ ప్లాన్ వివరాలన్నీ పోలీసులకు అఖిల వూనగుచ్చినట్టు చెప్పిందని అంటున్నారు. కిడ్నాప్ తర్వాత పోలీసుల వేటతో ప్లాన్ మార్చిన అఖిలప్రియ, కిడ్నాప్ చేసిన వారిని వెంటనే వదిలేయాలంటూ ఆదేశించినట్టు గుర్తించారు. అఖిల ఆదేశాలతోనే ముగ్గురినీ కిడ్నాపర్లు వదిలి పారిపోయినట్టు చెబుతున్నారు. కిడ్నాప్ కేసులో మొత్తం 15 మంది కోసం పోలీసులు గాలిస్తున్నారు. చంద్రహాస్, భార్గవ్, మాదాల శ్రీను దొరికితే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయంటున్నారు పోలీసులు. అలానే కిడ్నాప్ సమయంలో లోథా అపార్ట్‌మెంట్‌లో ఉన్న అఖిలప్రియ భర్త భార్గవ్ రామ్, తమ్ముడు జగత్ విఖ్యాత్ తో మాట్లాడినట్టు తెలుస్తోంది. భార్గవ్‌రామ్, జగత్ విఖ్యాత్ ఇద్దరూ స్పాట్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు, జగత్ విఖ్యాత్‌ను కేసులో నిందితుడిగా చేర్చనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం భార్గవ్, గుంటూరు శ్రీను, జగత్ విఖ్యాత్ కోసం గాలిస్తున్నారు పోలీసులు. కిడ్నాప్ జరిగిన తర్వాత ఒకే వాహనంలో భార్గవ్, జగత్ విఖ్యాత్ వెళ్లినట్టు తెలుస్తోంది.

సైబరాబాద్‌లో అతిపెద్ద డెకాయిట్ గ్యాంగ్‌ను పట్టుకున్న సందర్భంగా మీడియాకు వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సిపి సజ్జన్నార్

రుణ యాప్‌ల కేసులో ప్రధాన సూత్రధారి అరెస్టు

హైదరాబాద్, జనవరి 13: రుణ యాప్‌ల కేసులో ప్రధాన సూత్రధారి అయినటువంటి చైనీయుడిని పోలీసులు అరెస్టు చేశారు. చైనాకు చెందిన ప్రధాన సూత్రధారి హి జియాన్‌తో భారత్‌కు చెందిన వివేక్‌కుమార్(యూపీ)ని పోలీసులు బుధవారం ముంబైలో అరెస్టు చేశారు. కేసు వివరాలను రాచకొండ సీపీ మహేశ్ భగవత్ వెల్లడించారు. నిందితులు ముంబయి కేంద్రంగా రుణ యాప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 4 ల్యాప్‌టాప్‌లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రధాన సూత్రదారి హి జియాన్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో కొన్ని రోజులక్రితం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి విచారించగా దర్యాప్తులో హి జియాన్ ప్రధాన సూత్రధారిగా తేలిందన్నారు. హి జియాంగ్ వ్యాపార వీసాపై 2019లో భారత్ వచ్చాడన్నారు. ముంబయి రుణ యాప్‌లు రూపొందించి సూక్ష్మ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. 24 యాప్‌లు రూపొందించి భారీగా రుణాలు ఇచ్చారన్నారు. రుణాలు ఇచ్చాక 50 శాతం వడ్డీతో వసూలు చేస్తున్నట్లు చెప్పారు. రుణాల వసూలు బాధ్యత కాల్ సెంటర్లకు అప్పగించారు. కాల్ సెంటర్ల వేధింపులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో రుణ వేధింపులకు ఇప్పటి వరకు ఆరుగురు చనిపోయినట్లు తెలిపారు. రుణయాప్ కేసులో తాత్కాలికంగా రూ.28 కోట్లు జప్తు చేసినట్లు చెప్పారు.రుణ యాప్‌లను 90 శాతం చైనా వాళ్లే నడిపిస్తున్నట్లు వెల్లడించారు.

ఆల్‌టైమ్ రికార్డుకు పెట్రో ధరలు

జైపూర్‌లో 92 రూపాయలకు చేరిక

జైపూర్,జనవరి13(ఆర్ఎన్ఎ): గతంలో ఎప్పుడూ లేనంతగా పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా పెరుగుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా రికార్డుల

బాల వికాసం

బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

(ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)



ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండిజాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

21

ఆ గదిలో ఉన్న ఓ మంచం మీద అచేతనంగా పడి ఉన్నాడు మాయ. తెల్లటి లాల్చీలో నడివయస్సులో ఉన్న ఓ ప్రొఫెసర్‌లా అనిపిస్తున్నాడు. అచ్చం మనిషిలాగే కనిపిస్తున్నాడు. ఆ మంచం పక్కన నిలబడి ఉన్నారు ప్రాచీ, ఆమె తల్లి సంఘమిత్ర. బాలవర్ధన్ అడుగుల చప్పుడు వినిపించి, అటువైపు తిరిగి చూశారు. కుడి చేతిలో చిలుకను బిగించి పట్టుకొని వస్తున్న బాలవర్ధన్ కనిపించాడు వాళ్ళకు.

అక్కడికి రాగానే అంత వరకు చలనం లేకుండా బాలవర్ధన్ చేతిలో ఉన్న ఆ చిలుక కీచు మంటూ అరిచి, కదిలే ప్రయత్నం చేసింది. చాలా సేపటి నుండి ప్రాణం లేనట్టుగా పడివున్న మాయ చటుక్కున కళ్ళు తెరిచి, లేచే ప్రయత్నం చేశాడు. కానీ అది సాధ్యం కాకపోవడం వల్ల తల తిప్పి, బాలవర్ధన్ వైపు చూసాడు. విషయం అర్థమైనట్టుగా చిరునవ్వు నవ్వాడు. ఎందుకో ఈ సన్నివేశం వాళ్ళ ముగ్గురికీ మానసికంగా ఏదో తెలియని ఇబ్బందిని కలిగించింది.

బాలవర్ధన్ మాయ ముఖానికి దగ్గరగా ఎదురుగా వెళ్లి నిలబడ్డాడు. "నా పేరు బాలవర్ధన్. పదిహేనేళ్ళ కిందట మీరు తెచ్చి, మీ దగ్గర బంధించి ఉంచిన నాగమణి, కార్యవర్ధన్ నా తల్లిదండ్రులు. వాళ్లను వెతుక్కుంటూ నేను వచ్చాను. ఈ ప్రయత్నంలోనే మీ ప్రయోగశాలను నాశనం చేయాల్సి వచ్చింది. ఆ పని నేను చేయకపోయి

ఉంటే మీ గ్రహంనుంచి వచ్చిన మరొకరు చేసివుండేవారు. మీకు మరింత నష్టం జరిగేది. అప్పుడు మీ పరిశోధనలకు సంబంధించిన రహస్యాలు కూడా మీ గ్రహంలోని మీ శత్రువులకు చేరేవి."

కొద్ది సేపు చెప్పడం ఆపాడు బాలవర్ధన్. మాయ తన మాటలను శ్రద్ధగా వింటున్నాడని గమనించి మళ్ళీ చెప్పడం కొనసాగించాడు.

"మాయ గారూ! మీ అసలు పేరేమిటో మాకు తెలియదు. మిమ్మల్ని అందరూ మాయ అని అంటున్నారు. కనుక నేనూ అలాగే పిలుసున్నాను. మీరు ఓ యంత్రమైనా ఇక్కడికి వచ్చిన తరువాత మా అనుబంధాలు, ప్రేమలు,మా భావోద్వేగాలు కొంతవరకు అర్థం చేసుకోగలుగుతున్నారని ప్రాచీ చెప్పింది. మీలో కూడా అలాంటి ఫీలింగ్స్ మొలకెత్తుతున్నాయని కూడా చెప్పింది. మీరు మంచి వారని మీ శత్రువు కూడా నాతో అన్నాడు. మీకు మీవాళ్ళు అప్పగించిన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి మీరు ఎంతో సిన్సియర్‌గా ప్రయత్నించారు. కానీ పరిస్థితులు మీకు అనుకూలించ లేదు....

మీ సిన్సియారిటీ పట్ల, మీ విచక్షణ పట్ల నాకు గౌరవం ఉంది. ఇక మీరు ఎలాగూ మీ గ్రహానికి వెళ్ళలేరు...

కనుక...దయచేసి మీ దగ్గర ఉన్న మా లోకం వాళ్ళందరినీ క్షేమంగా విడిచి పెట్టండి. వాళ్లను వాళ్ల ఇళ్లకు పంపించే ఏర్పాట్లు చేయండి " ఎంతో కన్విన్సింగా మాట్లాడాడు బాలవర్ధన్.

కొంతసేపు ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉండి, మెల్లగా మాట్లాడడం మొదలు పెట్టాడు మాయ. "చిన్న పిల్లవాడివైనా నీ తల్లిదండ్రుల కోసం నువ్వు ఇంత సాహసం చేయడాన్ని అభినందిస్తున్నాను బాలవర్ధన్! నీ తల్లిదండ్రుల గురించే కాకుండా, నీ గ్రహం వాళ్ళందిరి క్షేమం కోరుకుంటున్నావు. మా గ్రహంలో ఇలాంటి భావాలూ, ఆలోచనలూ ఒకప్పుడు ఉండేవి. ఇప్పుడు అలాంటివేవీ లేవు. ఎమోషన్స్ కూడా వ్యాపార సరకులుగా మార్చేశారు. కేవలం టెక్నాలజీ, ప్రాక్టికాలిటీ, వినాశకరమైన పరిశోధనలు ఇదే అక్కడ జరుగుతున్న అభివృద్ధి. స్వార్థం, ఆధిపత్యం, అరాచకం అక్కడ నిండి పోయాయి. అనంతమైన సంపద కొందరి దగ్గర పోగుపడింది. దుర్భరమైన పేదరికం, అవిద్య,అజ్ఞానం మరోవైపు నిండిపోయింది. క్రమశిక్షణా రాహిత్యం, బాధ్యత లేనితనం అంతటా నిండిపోయింది.

అదంతా సరైంది కాదని నాలో ఉన్న మెదడుకు తెలుసు. కానీ అలాంటి విషయాలకు స్పందించే

ఆ శరీరం ఎప్పుడో మరణించింది. ఆ జీవితం ముగిసిపోయింది. ఆ మెదడు ఒక రోబోలో భాగమై ఇక్కడికి వచ్చింది. ఈ లోకానికి వచ్చిన తరువాతనే నా మెదడులో మళ్ళీ ఆ స్పందనలు కలిగాయి. ప్రాచీ, సంఘమిత్ర, నాగమణి వీళ్ళే నాకు ఇలాంటి విచక్షణను మరోసారి గుర్తుచేశారు. వాళ్ళ మూలంగానే నాలో మళ్లీ ప్రేమ, ఆత్మీయత వంటి భావోద్వేగాలు మెల్లగా మేల్కొన్నాయి. ఐనా నేను నాకు అప్పగించిన పనిని సిన్సియర్‌గా నెరవేర్చడానికి ప్రయత్నించాను. సక్సెస్ కాలేక పోయాను. ఇక నా పాత్ర ముగిసింది."

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత మాయ "ప్రాచీ! ఇలా రామ్మా!" అని ప్రాచీని పిలిచాడు. ఆమె తన దగ్గరకు వచ్చిన తరువాత చెప్పాడు."అమ్మా! నా జేబులో ఓ చిన్న రిమోట్ ఉంటుంది. అది బయటకు తీస్తే దాన్ని ఎలా ఉపయోగించాలో చెప్తాను. దాన్ని ఉపయోగించి రాతి తలుపులు తెరిచి, మీ వాళ్ళందరినీ బయటకు తెచ్చుకోవచ్చు. నలభై మంది ఉన్నారు నేను ఇక్కడికి తెచ్చిన వాళ్ళు ."

"ఏమిటీ! నలభై మందే ఉన్నారా? ఇన్నేళ్లలో మీరు తెచ్చింది నలభై మందినేనా?" నమ్మలేక అడిగాడు బాలవర్ధన్.

"ఆ లెక్కలన్నీ ఇప్పుడు చెప్పలేను బాలవర్ధన్! ఇప్పుడు నా దగ్గర బందీలుగా ఉన్నవాళ్ళు మాత్రం నలభై మందే. నన్ను నమ్మండి! నేను ఎందుకు కొందరినే ఎన్నుకున్నానో, కొన్ని ప్రాంతాల వాళ్ళనే ఎందుకు ఇక్కడికి తెచ్చానో అవన్నీ చెప్పే సమయం లేదు.

ఆ గదిలో రెండు వాహనాలు ఉన్నాయి. అవి మీరు వెళ్లి పోవడానికి సరిపోతాయి. అవి మిమ్మల్ని ఢిల్లీ పరిసరాల్లో విడిచిపెడ్తాయి. తరువాత అవి విశ్వధూళిలో కలిసిపోతాయి. అక్కడ్నుంచి మీ ఇళ్ళకు వెళ్ళిపొండి. అక్కడ్నుంచి వెళ్ళడానికి మీకు అవసరమైన డబ్బులు నా గదిలో ఉన్నాయి. వాటిని తీసుకో సంఘమిత్రా! ఇంకా ఆలస్యం చేయకండి. మరో పదిహేను నిమిషాల్లో ఈ ప్రాంతమంతా గుర్తు పట్టలేనంతగా ధ్వంసమైపోతుంది. మాకు సంబంధించిన ఆనవాళ్లేవీ ఉండవు". మాయ ఆ విషయాలు మాట్లాడుతుండగానే ప్రాచీ అతని జేబులోంచి ఆ రిమోట్ తీసి పట్టుకుంది. దాన్ని ఎలా వాడాలో ప్రాచీకి తెలియజేశాడు మాయ.

"మరో ముఖ్య విషయం. మాకూ, మా గ్రహానికీ సంబంధించినవి, మీకు జరిగిన సంఘటనలూ, విషయాలూ ఏవీ ఇక మీకెవరికీ ఏమాత్రం గుర్తుండవు. అవన్నీ మీ మెదళ్లలోంచి పూర్తిగా తుడిచిపెట్టుకొని పోతాయి. కేవలం నీకూ, ప్రాచీకీ మాత్రమే గుర్తుంటాయి. కానీ మీరు ఎంత ప్రయత్నించినా ఇతరులకు చెప్పలేరు. చెప్పినా ఎవరూ నమ్మరు. ఇక ఆలస్యం చేయకుండా నన్నూ ఈ అనంత విశ్వాంతరాళం లోకి పంపించండి. మీరూ త్వరగా బయల్దేరండి." ఇక మాట్లాడేదేమీ లేదన్నట్టుగా కళ్ళూ మూసుకొని నిశ్శబ్దమైపోయాడు మాయ.

బందీలుగా ఉన్న వాళ్లను విడిపించడానికి ప్రాచీ చకచకా కదిలింది. సంఘమిత్ర నాగమణిని తీసుకొని రావడానికి వెళ్ళింది. బాలవర్ధన్ తన చేతిలోని చిలుకను బూడిద చేసే పనికి ఉపక్రమించాడు. ఐదు నిమిషాల్లో అందరూ వాహనాలున్న గదిలోకి చేరుకున్నారు.

అక్కడ బాలవర్ధన్ నాగమణి, కార్యవర్ధన్ కలుసుకున్న ఆ సంతోషకరమైన సందర్భాన్ని తృప్తిగా అనుభవించే అవకాశం కూడా వాళ్ళకు లేకపోయింది. మరో రెండు నిమిషాల్లో వాళ్ళ వాహనాలు బయలుదేరాయి. అందరి ముఖాల్లో చెప్పలేనంత ఆనందం!

న్యూఢిల్లీనుంచి హైదరాబాద్‌కు ప్రయాణం చేస్తున్నప్పుడు బాలవర్ధన్‌కు ఎందుకో తమ సైన్స్‌సార్ తరగతిలో ఓసారి చెప్పిన విషయాలు గుర్తుకొచ్చాయి...

"ప్రకృతి అన్ని ప్రాణులకు లాగే మనుషులకు కూడా ఇక్కడ పుట్టడానికీ, జీవించడానికీ అవకాశం ఇచ్చింది. కానీ మనిషొక్కడే ఈ ప్రకృతిని ధ్వంసం చేసే ప్రాణిగా మారాడు. సమస్తాన్నీ తన వ్యాపార సరుకుగా మార్చి, తన ఆధిపత్యం లోకి తెచ్చుకోవాలని అనుకుంటున్నాడు. ఆ ప్రయత్నంలో సమస్తప్రాణులకే కాక, అమాయకులూ, నిస్సహాయులూ అయిన మనుషులకు కూడా మరణ శాసనాన్ని రచిస్తున్నాడు. తన బలంతో, తెలివితేటలతో తన ఆధిపత్యానికి ఎదురు ఉండదని అనుకుంటున్నాడు.కానీ ప్రకృతి తనను బ్యాలెన్స్ చేస్తుంది. మనం ప్రకృతికి ఏది ఇస్తే దానినే అనేక రెట్లుగా పెంచి ఇస్తుంది. ఏమాత్రం బాకీ ఉంచుకోదు. దాని ముందు తాను ఒక చిన్న పిపీలికం వంటి వాడేనని మనిషి గుర్తుంచుకోవడం లేదు. కానీ ఆ రోజు తప్పక వస్తుంది."

అప్పుడు కలిగింది సందేహం బాలవర్ధన్‌కు

"నిజంగా ఇదంతా గ్రహాంతరవాసుల పనేనా ? లేక మనుషులే తమ జీవ ఆయుధాల పరిశోధనల్లో రహస్యంగా జరుపుతున్న కార్యక్రమాల్లో ఇదొక భాగమా?..."

సరిగ్గా అదేసమయంలో... ప్రాచీకి కూడా మెల్లగా మొదలైందో అనుమానం

''ఆ ల్యాబ్‌తోబాటే ఆ వైరస్‌కూడా పూర్తిగా నశించి పోయిందా?..లేకపోతే....."

– (అయిపోయింది)



–డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

బాల గేయం

సంక్రాంతి

చేమంతుల చెలువముతో
పూబంతుల పరువముతో
చెలరేగుతు స్వాగతమిడ
చేరవచ్చు సంక్రాంతి!
ముంగిళ్లను బాలికలే
ముగ్గులతో ముంచెత్తగ
గంగిరెద్దులే ఆడగ
హరిదాసులు కీర్తించగ
పరవశించు పల్లెలంత!
పంటలతో తులతూగగ

సాగివచ్చు సంక్రాంతి
సంబరాల సంక్రాంతి!
గగన వీధిలో హాయిగ
గాలిపటాలే ఎగరగ
పిండివంట లారగిస్తు
పిల్లలంత గంతులిడగ
బంధువులతొ ఇంటింటా
సందడియే అగుపించగ
భోగిమంట పొంగలితో
చెంగలించు సంక్రాంతి!

– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

అమ్మా నేను బడికి పోతనే

అమ్మ నేను బడికి పోతనే
నాబడి నన్ను
పిలుస్తున్నట్టనిపిస్తుందమ్మా
చేతులు చాచి నన్ను రమ్మంటుందే
నన్ను బడి అనే గుడికి పంపియ్యమ్మా
బడి మూగ రోదన నాకు వినిపిస్తోందే
నా రాకకై క్లాస్ రూమ్ ఎదురుచూస్తుందమ్మా
రోజు నీళ్లు పోసి పెంచిన
రోజా పూలు
రంగురంగుల
బంతి చామంతులూ
ఉయ్యాలలూగే చింత చెట్టు నన్ను పిలుస్తున్నట్లు అనిపిస్తుంది
తన ఒడిలో ఆడుకునే బడి ప్రాంగణం
నేను వస్తానని ఎదురు
చూస్తునీదమ్మా
అమ్మ బడికి ఏమైందమ్మా ఒక్కసారి బడిని పలకరిస్తనే
నా నేస్తాలను నే వదిలి ఉండలేను
అమ్మ నేను బడికి పోత
నా బడిని చూసి మల్లోత్త

–యాడవరనీ రేవంత్ గౌడ్
9441762105

నానీలు

అంధకారం
కరిగితేనే..
ప్రభాత వెలుగుల
శ్రీ కారం కదా..!

జ్ఞాపకాలు అనాది
ఆశలేమొ పునాది
భవిత కళలే
మనాది..!

మానవదేహం
నిత్యం సందేహం..!
అహం తగ్గితే
ఆనందో బ్రహ్మం..!

పేలముద్దలు
పిప్పరమెట్లు
పల్లిబఠాణీలన్ని
బాల్యపు ముద్రలు..!

నిత్యకృషీవల
నీవేనోయి...!
పరిశ్రమ కాంతులే
ప్రపంచమేనోయ్...!

కాగితమే
నిను ప్రశ్నిస్తుంది..!
సిరా మరకలో
సిరులున్నాయని...!

గ్రంథాలయమే
ప్రపంచ సందడి...!
అనంత విశ్వపు
ఆలోచన సరళి..!

వృత్తిపట్ల ప్రేముంది
ఎందుకంటే?
ధనారాధనలోనే
వాస్తు సూత్రం....!

–డా.పాండాల మహేశ్వర్
9912180054

దీపావళి

మనసున్న మనిషికి
సంఘర్షన సత్యం
జరుగుతుంది నిత్యం

లోలోని నరకులకు
అనునిత్యం చతుర్దశి
జరిపితే సంస్కారపు
దీపావళి సంబవించు
ఈ భువిపై

పాపాలను పటాకులుగా
పుణ్యాలను జ్యోతులుగా
మార్చుకుంటే దీపావళి

అడ్డు గోడల దుమ్ముదులిపి
ఆత్మీయతల రంగులేసి
అనురాగపు నోములునోస్తే
దీపావళి.

కాలుశ్యపు కార్చిచ్చులు
మాలిన్యపు మతాబులు
మానితేనే దీపావళి.

–గోవర్ధన్ రెడ్డి కొమ్మిడి
9701841186

ఏమిటో ఈ సృష్టిరహస్యం?

పంజరంలోని పక్షికి
వేళకింత తిండి
దొరుకుతుంది అది
ఏ ప్రాణభయం
ఏ శత్రుభయం లేకుండా
కంటినిండ నిద్రపోతుంది
కాని అది స్వేచ్ఛలేని బ్రతుకు...

ఆకాశంలో ఎగిరేపక్షి
తిండికోసం ఎక్కడెక్కడో
తిరగాలి ఎంతో దూరమెళ్లాలి
తిరిగి గూడు చేరేవరకు
అడుగడుగునా గండాలే
అర్థంకాని సుడిగుండాలే.....

ప్రతిక్షణం ప్రాణభయమే
ఎవరు వల విసురుతారోనని
ఎక్కడ ప్రాణం తీస్తారోనని
కాని దాని స్వేచ్ఛ ఆకాశమంత...

చిన్న ఆక్వేరియంలోని చేపకు
వేళకింత మేతదొరుకుతుంది అది
ఏభయంలేక సుఖంగా ఉంటుంది
కాని అది స్వేచ్ఛలేని బ్రతుకు....

సముద్రంలో వున్న చేపకు
క్షణక్షణం ప్రాణభయమే
ఏ తిమింగలం మింగేస్తుందోనని
ఏ వలలో చిక్కుకొని, గిలగిలా
కొట్టుకోవలసి వస్తుందోనని

ఏ గాలానికో తగులుకొని
విలవిలలాడాల్సి వస్తుందోనని
కాని దాని స్వేచ్ఛ సముద్రమంత...

కానీ అర్థం కానిదొక్కటే
స్వేచ్ఛవున్న చోట సుఖంలేదు
సుఖమున్న చోట స్వేచ్ఛలేదు
ఏమిటో ఈ సృష్టి రహస్యం?

–పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

కొత్త వేకువ కోసం

మార్పు కోరే మనసుకి
మార్పే తన లక్ష్యంగా ప్రయాణిస్తున్న కాలశకటం
నూతన ఉత్తేజాన్ని మోసుకుని
చిరునవ్వులను అద్దుకుని
వేకువై పలకరిస్తుంటే...

మనసుకు ఏ బాధ గాయం చేసిందో గాని ..
కొత్త వేకువ కోసం ఎదురు చూసే జ్ఞానేంద్రియాలకు
మారని శృతితో పలకరిస్తున్నట్టుంది..
పాత కప్పులో కొత్త పానియంలా..
తూరుపున ఉదయించే కిరణాల స్పర్శా గానం....

ఘడియలు రోజులౌతున్నాయి
రోజులు వత్సరాల మూటలై

కాలగర్భంలో చరిత్రలై మూలకూర్చుంటున్నాయి..
మారని రాతలకు సాక్ష్యాలుగా..

కాని వేచి చూసే నయనాలకు
ఆశ చావటం లేదు..
ఎందుకంటే మనోసంద్రంలో రగిలిపోతున్న బడబాగ్ని
కోరిక...జీవితాన్ని సంపూర్ణం చేయటానికి పడే
నిస్వార్థ తపన కనుక..

–శ్రీదేవి సురేష్ కుసుమంచి
7032760484

నిత్యస్మరణీయులు

–దోరవేటి
సెల్:9866251679

కవిత్రయం

భారత మీ జగతికి మద
మారగ నందించినారు, టంద్రమ్మున వి
స్తారముగా మువ్వురలం
కారము లై రట్టి కవులు ఘన-చారిత్రుల్ !

రాజనరేంద్ర కాలమున రమ్యత నక్షరమై పెలుంగ, నీ
రాజనపై కథకలిత ప్రాజ్ఞులు మెచ్చెడి సూక్తిధార ల
వ్యాజముగా తెలుంగునను భారతగాథకు పూనుకొన్న కా
వ్యాజయె నన్నయార్యుడు శుభంబును గూర్చెను తెల్గుజాతికిన్

చక్కని శిల్పమునన్, నటన, త్రవ్వకపు శబ్దపు పోహళింపుతో
నక్కున మీర భారతము నంతయు నంధ్ర మొనర్చినాడు, వే
రొక్కడు సేయలేని పని నోపికతో పదునైదు పర్వముల్
తిక్కన సోమయాజి గణుతింప రచించె రసార్ద్రశీతనన్.

శేషపు భారతమ్మును విశేషముగా పరిపూర్తిజేసి సం
తోషము గల్గజేసెను యథోచిత రీతిగ తెల్గుభారతీ
యోషకు, భారతీయతకు యోగ్యత మీరగ; రూపుమాయగా
దోషములన్ని యెట్టిన నతత్కవనగాను కవిత్రయంబు నన్-

గాయాల నెత్తురు

తొలి పొద్దు పొడిచింది
ఆకాశం ఎర్రగా వెలిగింది
అది నింగికి తూర్పు చేసిన
గాయం కాదు
నిన్నటిరేయిలో
నా దేశ స్త్రీ మానానికి
నరకీచకులు చేసిన
గాయాల నెత్తురు.

– కవిశ్రీ
9493785596.

సాహితీ మధురిమలు

మంచి పుస్తకము
బతుకు మార్చును
మంచి నేస్తము
దారిని చూపును.
మాటల మాధుర్యం
ఆప్యాయత పెంచును
చేతల ఔదార్యం
మనిషి విలువ పెంచును.
రాబడి పెరిగితే
బంధుగణం ముసురు
అప్పులు పెరిగి తే
ఆనందం చెదురు.
హాళికుల కష్టం
అందరికిఅన్నం
గురువుల బోధనం
విశ్వానికి జ్ఞానం.

–తాటిపాముల రమేష్
7981566031

దిగులు గుండె మీద

ఎడతెరపక కురిసే మేఘాల్లోంచి
ధారలు ధారలు గా దుమికే నీళ్లు
మట్టిని తడి తడిగా చిత్తడి చేస్తుంటాయి .

కంటి రెప్పల్లో మొలిచిన చిగురులు
వీచే పంట పొలాలు రెపరెపలాడుతుంటాయి .
ఉక్రోశం ఆపుకోలేని వాన ఉరుములతో కురిసే వాన
కోపాగ్నితో ఉరకలేస్తుంది .

మొలకలూ, వరిచేలు మునిగి పోయాయి .
ఆకు పచ్చని కలలు కరిగి పోయాయి .
ఈదురు గాలులకు ఈదలేక వడదెబ్బలకి తాళలేక
మడిలోనో చెరువులోనో
దేహం తెప్పలా వేలాడుతుంది .

ఇప్పటి దృశ్యం భూమి పుత్రులది
అనాదిగా వేలాడుతూనేవుంది
ఉరిపోసుకుంటుంది
అభయ హస్తాలు ఈ చేతుల్ని తాకని నైరాశ్యం లో
దిగులు గుండె మీద
ఊపిరి సెగ ఆగిపోతుంది .

ఆకలి తీర్చే చేయి అదృశ్యమవుతుంది
దుఃఖం ఒడ్డున
నాగలీ జోడెద్దులు ఏడుస్తుంటాయి .

ప్రాణం తడుస్తూ మునుగుతూ
జీవం లేని శరీరం
ఒక అనేక దేహాలు గా తేలుతుంది .

–గవిడి శ్రీనివాస్
08886174458

రైతు కష్టం

బక్కచిక్కిన తేలికైన దేహాలతో
ఆరుగాలం రెక్కల కష్టాన్ని నమ్మి.
గింజలు కోసం తాళి తాకట్టు పెట్టి
రేపటి కోరకు నల్ల రేగడి దుక్కి దున్ని.
చంటి పాపల సాగు చేసి విత్తు వేసి
పాతాళమున దాగిన నీటి జాడకై
ఆకలి మంటలతో ఎదురుచూసే రైతన్న.
అన్నమో రామచంద్రయని అరుపులు
నిత్యం కనిపించే ఆకలి కేకల మంటలు.
పేద ప్రజల మంట కూల్చడానికి
అందరాని ఆకాశం వైపే నీ చూపు.
ఉగ్రరూపాన్ని తలపించే ఆకాశ మెరుపులు
ఆకాల వర్షాలతో కానవచ్చే కరువులు.
పంట పండక నేలరాలిన రైతులెందరో
మద్దతు ధర లేక మాడిపోయిన కడుపు లెన్నోః

–కమ్మరి శ్రీనివాస్ చారి
9177324124

వారెవా..!

నా అక్షరం
ఆయుధం
కానక్కర్లేదు..
అలారమైతే చాలు..!

నిద్రలేచినోడు
యుద్ధం
చేయకుండా ఉంటాడా..?

– సంగెవేని రవీంద్ర
సెల్ : 99871 45310

అమ్మాయి మనసు?

పుట్టగనే చినబోయిన మాట అమ్మాయా
నాకు తెలీదు కదా మగాడిలా పుట్టాలనీ
మీకైన తెలుసా ఇంటికి నేనే ఆది శక్తిని!!!

నా ఏడుపు మంచిది కాదంటా
నా కన్నీటికి కారణమే మీరంటా
నాలోని బెంకుకు తొలిమెట్టే
ఆడపిల్లవి అని చెప్పే మీ జాగ్రత్తనే!!!

సీతకోకంటి జీవితం నాదంటా
ఆ సీతకోక మనసు ఎవరికి ఎరుకంటా
తాననుకోదా స్వేచ్ఛగా విహరించాలనీ
ఏ ముప్పు కలగకుండా
పరువే పరుగెత్తకుండా!!!

అమ్మకూచి నాన్నకూచినే
పద్దతుల కుచ్చులకు బలైన
మనసున కోరికలు కుచ్చుకోని
అమ్మ నాన్న మనసు కుచ్చని
పదునైన మొగ్గ కొనను
పదునుబోయిన సూది మొనను!!!

చదువెందుకు ఆడపిల్లకు
చదువుల తల్లి సరస్వతికీ
ఆటేందుకు పాటేందుకు
మహిల పడే ఈ మహిళకీ
కళలెనున్న కలలె కంటుంటా
కనులే జలపాతమయ్యేలా!!!

వయసొచ్చిన వన్య కన్యను
వరుసైన పోతులకు బలినయ్యే
ఊపిరాడని కసాయి మేకను

నా వయసే గుండెకు నిర్జీవం
నేనే నేనే నావాళ్ల భుజాలకు
మోపడయ్యే తెగదింపుల బంధం!!!

మనసే కోరదా మమతే చేరదా
తనువే చలించిన మనసే మరవదులే
పొరబడితే గాయపడే మగువననీ
చిరిగే పత్రంలా చెరిగే జీవితం నాదనీ!!!

తనువైన జీవితమైన జీవమైన
చెలికాడికే అని ఊహలు కంటున్నా
నా ఊహాలు గుసగుసలై
కలలుగా కలతగా మిగిలాయి!!!

ఆశలెన్నో నాలో ఆశయాలే
బంధాలకు కనులే ఎర్రగాయాలే
పశువుకు ముక్కు కుదుదురు
మాకు తాళి కదుదురు
తాళి ఆనే పవిత్ర బంధానికే
జీవిత ఖైదీలా జీవితమే అంకితం!!!

మనిషే తెలీదు పేరే తెలీదు
కళలు కన్న జీవితంలోకీ
పాలపుంతలా చేరి
పాలంటి నా జీవితంలో
తన కోసమే తన వెంటా
నా పయనాన్ని మలుచుకొని
తన పయనం వెనుకే పయనించే
మదిలో మలినమే లేని లక్ష్మీనీ!!!

–మల్లే రంజిత్ కుమార్
7032650908

అలిగిన కలం

పెన్నెందుకో చిన్నబోయింది.....
అది హుషారైన పెన్ను....
దానిది విశాలమైన వెన్ను....
నిటారుగా
నిర్భీతిగా
నిక్కచ్చిగా
నిజాయితీగా
పిల్లల తల రాతలు రాసే పెన్ను....
పదో తరగతి 'స్పాట్ 'కు బయలుదేరేటప్పుడు
కళ్ళింతలు చేసి ముస్తాబయ్యేది...
అసలే 'ఎర్రరంగుది' కదా.....!
దానికి షోకులెక్కువ.....
దాని బలగమంతటినీ కలుపుకుని
నా హ్యాండ్ బ్యాగ్ లో బలే ఫోజుకొడుతుండేది....
ఎర్ర కిరీటం పెట్టుకొని ఎగిరెగిరి పడేది...
తస్సాదియ్యా.....!
'ఆన్సర్ షీట్' చూస్తే ఆగక పోయ్యేది....
అలుపెరగని శివతాండవమే...
వేగం దాని ఇజం
త్యాగం దాని నైజం

దాని రక్తం ఇంకిపోయినకొద్దీ రెచ్చిపోయేది....
బార్డర్ లో సైనికునికున్నంత బాధ్యత దానిది

తప్పును చూస్తే కసితీరా కొట్టేసేది...
లక్ష్యం నెరవేరే దాకా సాగిపోవడమే దానికి తెలుసు...
కంటి చూపును బట్టి కదలిపోతదది
కరెంటుకున్నంత పవర్ దానిది....

మార్కులు లెక్కించేటప్పుడు సూదాలే దానిసంబురం
'మిత్తిరివిండె' ఎగిరినట్టే.....
ఎన్ని పేపర్లు ఎదురుగా ఉన్నా
పెన్నుకొక కన్ను గీటితె చాలు
అదే చూసుకునేది...
బడి పిల్లల నోట్సుల్లో
సంతకం పెట్టెటప్పుడు
ఆ కాపీలల్ల 'కథాకళి' ఆడేది...

ఆరు నెలలుగా
మూగబోయిన నా 'ఎర్ర పెన్ను'
నిన్న పలకరిద్దామని దగ్గరికెళ్తే
కసురుకుంది.... కన్నెర్ర చేసింది....
ఎంత బతిమాలినా
దాని మనసైతే కరగలే....
కరోనా కష్టం
నా ఎర్రపెన్నుకూ తప్పలే...

–డా.మడత భాస్కర్
8919328582

రాత - గీత

లొసుగులు

వ్యవస్థలో..
సలసల కాగే
అవస్థల ఆవిరులు..
జలజలరాలే
నా అశ్రువులు.

సోషలిస్టు

క్యాప్టలిస్టూ
కమ్యూనిస్టూ
హిప్నాటిజంలో
ఈక్వలిస్టే.

రాత–శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత–వర్చస్వి

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 14-1-2021 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

నమ్మలేని నిజాలు

బాధల బంధం
చూపు ఆశ్రమదారి
చితిచింతన.

పెండపురుగు
జనంమెచ్చని రాజు
మేలెండ మావి.

అతివృష్టికి
శశి నల్లబడ్డాడు
బాధలో రైతు.

స్వేచ్ఛకు జబ్బు
రాగమూగ గగనం
రెక్కలు తెగి.

కోళ్లకు బ్లడ్ ఫ్లూ
కాంతిలేని సంక్రాంతి
పబ్బం ఉష్కాకి.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

దేశమంత రగులుతుంది
చిచ్చువెట్ట పంటల్లో !
సంక్రాంతికి రైతులంత
మునిగె భోగి మంటల్లో !

ఆకలైతె మెక్కుకుంటు
అన్నమురా అన్నము !
తిన్నింటికి వేయుదేంది ?
కన్నమురా కన్నము !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

జీవన తరంగాలను స్పృశించే - రంగ తరంగాలు



దాదాపు వంద సంవత్సరాల క్రితం ప్రారంభమైన నాటికలను తన కథావస్తువుగా ఎంచుకుని నూతన అధ్యాయానికి తెర తీశారు ప్రముఖ కవి విమర్శకులు, సినీ రచయిత, దర్శకులు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ . రచన అంటే ఎక్కడ లేని తృష్ణ వడ్డేపల్లి కృష్ణ.. 1976 లోనే తెలంగాణ మాండలికాన్ని "వెలుగు వచ్చింది" అనే సాంఘిక నాటకం ద్వారా వెలిగించి ఆ తర్వాత అందరికీ నచ్చేలా సామాజిక ప్రయోజనాలతో అనేక నాటికలని వ్యవహారికంగా రచించి, రాణించిన వడ్డేపల్లి కృష్ణ నాటికలు ఎందరో వర్ధమాన రచయితలకు స్ఫూర్తి దాయకంగా నిలువగలవని అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు .1920 సంవత్సరం నుండి ఆంగ్ల సాహిత్య ప్రభావంతో– తెలుగు సాహిత్యంలో నాటిక ప్రక్రియ ప్రారంభం అయినది.. తొలి దశలో ప్రభుత్వ పథకాల ప్రచారంలో, పాఠశాలల్లో జరిగే ఉత్సవాల సందర్భాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో చిన్న నాటికలను ప్రదర్శించేవారు. 1930ల నుండి సాహిత్యంలో ఒక ప్రక్రియగా నాటిక నిలదొక్కుకున్నది 1930లో పి.వి. రాజమన్నార్ 'తప్పెవరిది' నాటికతో తెలుగు నాటికా సాహిత్యంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. కచటతప', ' నీత అగ్నిప్రవేశం', అనార్కలి, అశోకం, టీ కప్పులో తుఫాను', శర్మిష్ఠ, తుదిపలుకు, 'కలంపోటు, 'స్వయంవరం,ఖూని ',కొత్తగడ్డ మొదలైన నాటికలు తెలుగు నాటికా సాహిత్యానికి దిశానిర్దేశం చేశాయి.

నాటకం కంటే నాటిక చిన్నది. నాటిక– రెండు మొదలు ఐదు రంగాలుగా, గంట కాలానికి తక్కువ కాకుండా ప్రదర్శితమవుతుంది. ఏక నాయకుడు, ఏక వస్తువుతో కూడి ఉంటుంది. స్థల, కాలైక్యం విధిగా పాటించనక్కరలేదు. సమకాలీన సమాజంలోని పరిస్థితులను వైవిధ్యంగా పాఠకులకు అందించే ప్రయత్నంలో నాటికలను రచయితలు రాశారు.నాటికలను దృశ్య రూప నాటికలు, శ్రవ్య రూప నాటికలని రెండు రకాలుగా విభజిం చవచ్చు. వస్తుపరంగా నాటికలను సామాజిక, రాజకీయ, పౌరాణిక తదితరాలుగా విభజిం చవచ్చు.

సమకాలీన సమాజంలో జరిగే పరిణామాల గురించి, ప్రజలకు అవసరమైన అంశాల గురించి అందరికీ అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా నాటికలు ఒక సామాజిక అవసరం అయింది. అది దృష్టిలో పెట్టుకునే రచయిత రంగ తరంగాలు అనే రంగస్థల సాంఘిక నాటికలను వెలువరించారు. రంగ తరంగాలు పుస్తకంలో ఏకాంకికలు కూడా ఉన్నాయి. ఏకాంకికను ఆంగ్లంలో 'వన్ యాక్ట ప్లే' అంటారు. ఒక రంగంతో ఇరవై నుండి నలభై అయిదు నిమిషాలలోపు ప్రదర్శితమవుతుంది. ఏక నాయక, ఏక వస్తువు, స్థల కాలైక్యాలతో కూడి ఉంటుంది. సంక్షిప్తత ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. 1960 సంవత్సరంలో ఆరో తరగతి విద్యార్థిగా రచయిత ఉండగా తెలుగు టీచర్ సినారె గారి శిష్యులైన కనపర్తి గారు .వారు రచయిత చేత సినారె రాసిన ఏకైక ఏకాంకిక "సినీకవి" లో సినీ కథకుడు అయిన తారాపతి పాత్ర వేయించారు. కరీంనగర్‌లో జరిగిన ఆనాటి జిల్లాస్థాయి నాటికల్లో కృష్ణ గారు పెద్దల అభినందనలు అందుకున్నాడు ఇలా చిన్ననాటి నుంచే సినారె గారితో చాలా చక్కటి అనుబంధం రచయితకు ఉంది. ఆనాటి మారుమూల పల్లెల్లో దొరతనం చెలరేగుతూ వెట్టి చాకిరీ అట్టుడుగుతుంటే గ్రహించి "వెలుగచ్చింది" పేరుతో తొలి తెలంగాణ మాండలిక నాటిక 1976లో రచించి దర్శకత్వం వహించి రాజేశ్వరి టాకీస్ లో ప్రదర్శింప చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. పౌతిక సంవత్సరాల కిందట నాటికల్లో అయినా ప్రస్తుత సమకాలీన అంశాలు కూడా దగ్గరగా రచయిత రచనా సామర్థ్యం వల్ల చదవాలనే ఆసక్తిని నాటికలు నిండుగా కనబర్చాయి.

ఈ నాటికలను మరి కొన్ని మార్పులతో కూడా నేటి అనుగుణంగా రచయిత వ్రాయవచ్చు.ఆనాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకునే

అవకాశం నేటితరం వారికి అందించాలన్న తపనే ఈ "రంగ తరంగాలు" అనే రంగస్థలం సాంఘీక నాటికల సంపుటి.

అక్కినేని నాటక కళా పరిషత్ అధ్యక్షులు అయిన కొండలరావు సారిపల్లి వారికి ఈ ''రంగ తరంగాలు"పుస్తకాన్ని రచయిత అంకితం ఇచ్చారు. పరుచూరి వెంకటేశ్వరరావు ఈ పుస్తకానికి ఆముఖం రాస్తూ మనసును హత్తుకునే పదిమందికి ఆలోచింపజేసే నాటకాలు కూడా రాయగల బహుముఖ ప్రజ్ఞాశాలి కృష్ణ అని చెప్పారు. డాక్టర్ కోట్ల హనుమంతరావు తెలంగాణ ప్రాంతంలో దొరల పెత్తనం నాటి గ్రామీణ పరిస్థితులను అందరూ తెలుసుకోవాలని ఆకాంక్షిస్తూ రాసిన ఈ రంగస్థలం సాంఘిక నాటికలు ఈనాటి సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు

లలిత సినీ గీత రచయితగా ప్రామాణిక పరిశోధకునిగానే కాక అనేక టీవీ ధారావాహికలకు రచనతో పాటు ప్రతిభావంతంగా దర్శకత్వం నిర్వహించిన డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ గారు సిరిసిల్లలో 30:7:1949 లో జన్మించారు. మొదట బాలనటుడిగా సినారె గారి ఏకైక ఏకాంకిక సినీకవి లో నటించి తర్వాత సినీకవి గా రాణించడం కాకతాళీయం కమనీయం .విద్యార్థి దశలో అనేక నాటకాల్లో ప్రధాన పాత్రల్లో నటించడం గణనీయం . ఇంతవరకు 26 కావ్యాలను 60 ఆడియో ఆల్బమ్ ను వెలువరించారు అనేక సంగీత నృత్య రూపకాలు నిర్వహించారు సామాజిక ఇతివృత్తాలతో చైతన్య భావాలతో పదికిపైగా నాటికల్ని ,నాటకాల్ని రచించడమే కాక కొన్నింటికి దర్శకత్వం వహించారు ఆ తర్వాత ప్రభుత్వ సంది అవార్డు కమిటీ చైర్మన్ గా వ్యవహరించారు. 2005లో సెన్సార్ బోర్డు సభ్యునిగా 2003లో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవానికి 2010లో బాలల సంది నాటకాలకు న్యాయనిర్ణేతగా నిష్పక్షపాతంగా తీర్పునిచ్చారు. 2006 మరియు 2009 లో సంది అవార్డు కమిటీలకు చైర్మన్ గా వ్యవరించారు. 60 ఏళ్ల తెలంగాణ సంఘర్షణ సాధనను 60 నిమిషాల నిడివి గల జయ జయహే తెలంగాణ సంగీత నృత్య రూపకం రచించారు .ఇది అన్ని జిల్లాల్లో ప్రదర్శించబడి పలువురి చేత మెప్పు పొందింది. రంగ తరంగాలు పుస్తకం మొత్తం రంగస్థలం మీద ఎక్కు పెట్టిన ఓ ఇంద్రధనస్సు .ఇంద్రధనస్సులో ఏడు రంగుల్లా ఇందులో ఏడు నాటికలు ఉన్నాయి.ఈ ఏడు నాటికలు విభిన్న కథాంశాల విశిష్ట వేదికలు.

రంగ తరంగాలు పుస్తకంలో మొదటి నాటిక "వెలుగచ్చింది".. 1976 నాటి సాంఘిక పరిస్థితులను ఆనాటి దొరతనపు అహంకారాన్ని, నిరంకుశ త్వాన్ని కళ్ళకు కట్టినట్టుగా రచయిత తెలిపారు.

వెలుగచ్చింది నాటికలో నరసింహారావు అనే దొర గ్రామంలోని బడుగు జనాల మీద తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ ఉంటాడు. మల్లి భార్యకు 5వ కాన్పులో బాలింత రోగం వచ్చి చావుబతుకుల మధ్యలో ఉంటే దొర దగ్గరికి నూరు రూపాయల బాకీ కొరకు వస్తాడు. తల్లికి ప్రాణాల మీదికి వచ్చింది అని చెప్పడానికి వచ్చిన మల్లిగాడి కొడుకు కిట్టి గాడిని చూసి వానిని పనిలో పెట్టి 100 రూపాయలు తీసుకొమ్మని చెప్తాడు. మల్లిగాడు తన కొడుకు మంచిగా చదువుతాడు పనికి పెట్టను అని అంటాడు..దొర మాటకి ఒగ్గి చివరికి విధిలేని పరిస్థితిలో దొర దగ్గర కిట్టిగాన్ని వదిలి నూరు రూపాయలు తీసుకుని వెళ్తాడు. భార్యను బతికించుకుంటాడు.

మంచిగా చదివేటి కిట్టుగాడి చదువు ఆగిపోకూడదు అని భావించిన ఉపాధ్యాయుడు సత్యమూర్తి దొర దగ్గరికి వచ్చి కిట్టుగాడిని చదువు కొరకు పంపమని అడుగుతాడు. తనకు ఎదురుతిరిగిన సత్యమూర్తి పంతులు మీద కోపంతో పట్నంలో ఉన్న ఎమ్మెల్యే బామ్మర్ది దగ్గరికి సత్యమూర్తి ఉద్యోగం తీయించడానికి బయలుదేరాలని తలచి

పాలేరు వీరిగాడిని పిలిచి సాకలి సాయి గాని పట్నం వెళ్ళడానికి బండి కట్టమని చెప్పమంటాడు. నిలబడి బండి తోలే స్థితి లో లేడని వాని ఆరోగ్యం బాలేదు అని చెప్పినా వినకుండా బండి కట్టాల్సిందే అని పట్టుపడతాడు.. ఇవన్నీ అక్కడే ఉండి కిట్టిగాడు భయం భయంగా చూస్తూ ఉంటాడు. ఎందుకయినా మంచిదని దొర కిట్టి గాన్ని కూడా బండి వెనక రమ్మంటాడు. దొర పట్నం వెళ్లి తిరిగి వస్తాడు.కిట్టి గాడు పణుకుతూ వస్తాడు. దొర వీరిగానికి చెప్తాడు. సాయిగాడు దారిలో సచ్చిపోయిండు వాని కొడుక్కి తోవలో ఉన్న పీనుగను తెచ్చుకొమ్మని చెప్పు అని చెప్తాడు. వీరిగాడు మెల్లగా కిట్టు గాన్ని సాయి గాడు ఎలా చచ్చిపోయాడు అని అడుగుతాడు. కూసోనీ బండి తొలుత అని సాయిగాడు అడుక్కున్న దొర కరగలేదు. అట్లే తోలుతుంటే నెత్తురు కక్కి చచ్చిపోయిండు అని ఏడుస్తూ కిట్టిగాడు చెప్తాడు. వీరిగాడు కిట్టిగాని సముదాయించి దొర దగ్గరికి వెళ్తాడు. కిట్టు గాడు చదువుకుంటానని చెప్తే దొర బెత్తంతో కొట్టి భయపెడతాడు. సత్య మూర్తి పంతులు తన దగ్గరికి వచ్చి తన ఉద్యోగం పోయిందని అంగబలం అర్థబలంతో మీరు మనుషులని ఎంత కట్టిపడేసిన వారి మనసుని కట్టిపడేయలేరు. మారుతున్న కాలాన్ని ఆపలేరు.నేటికి కాకున్నా ఆ మార్పు అనేది రేపు అయినా వచ్చి తీరుతుంది. ఎంతటి అమావాస్య రాత్రికైనా తెల్లారక తప్పదు. చీకటి పోయి వెలుగు రాక తప్పదు .అప్పుడు మీలాంటి స్వార్థపరులకు తగిన శాస్తి జరుగుతుందని చెప్పి వెళ్ళిపోతాడు. కిట్టిగాడు దొర వద్ద నుంచి పారిపోయి రైలుబండి ఎక్కుతాడు. సత్యమూర్తి మాస్టారు అదే రైలులో ఉండటంతో కిట్టు గాడిని తనతోపాటు తీసుకెళ్లి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో చేర్పించి కిట్టు గాడు భవిష్యత్తుకు మంచి పునాది వేస్తాడు. ఇక్కడ దొర కిట్టిగాడు బదులు మల్లిగాని పని చేయమని చెప్పి చేయించుకుంటుంటాడు. షావుకారు కొండయ్య తో కలిసి దొర అక్రమంగా అత్యవసర వస్తువులను నిల్వ చేసినందుకు ,ఎక్కువ లాభాలను అమ్ముకోవాలని చూసినందుకు, దొంగతనంగా కంట్రోల్ సరుకును రవాణా చేస్తున్నందుకు ఇన్స్పెక్టర్ సత్యమూర్తి కానిస్టేబుల్ కిష్టయ్య వచ్చి దొర ఆగడాలకు చరమగీతం పడతారు. మల్లి తన కొడుకు కిట్టి గాడిని చూసి చాలా సంతోషపడ్తాడు .తన కొడుకు పోలీస్ అయినందుకు మురిసిపోతాడు.ఆ గ్రామానికి కొత్త వెలుగు వచ్చింది అని జనాలు సంబరపడతారు .దొరను కొండయ్యను జైలుకు తరలిస్తారు. దొరల పాలన ఏనాటికైనా అంతమైపోతుందని ,అంతమైపోవాలని రచయిత ఆకాంక్షించిన తీరు అభినందనీయం. ప్రజల జీవితాల్లో వెలుగులు చైతన్యం రావాలని కాంక్షించి రాసిన ఈ నాటిక నిజంగా వెలుగులు తెచ్చింది.

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను ఏ విధంగా మోసం చేస్తున్నారో, వారి భవిష్యత్తును ఏవిధంగా కాలరాస్తున్నారో తెలియజేయాలని ఉద్దేశంతో రచయిత ఈ ఏకాంకికను రాశారు

"ఉద్యోగ పర్వం" ఏకాంకిక లో గోవిందా చిట్పండ్ పేరుతో వెంకట్రావు ఆఫీసర్ ,

డి ఓజి గుమస్తా సాయంతో ఉద్యోగాల పేరుతో ఇంటర్వ్యూలకు పిలచి నిరుద్యోగ యువతీ యువకులు ఉత్తరం పేరుతో రికమండేషన్‌లను, దక్షిణం పేరుతో లాంఛనంగా లంచాలు తీసుకుంటూ మోసాలకు పాల్పడుతూ ఉంటారు. వీరి మోసాలను అరికట్టడానికి సిఐడి అధికారులు ఇంటర్వ్యూలకు కోటేశ్వరరావు ,లావణ్య నిరుద్యోగులుగా వస్తారు. వీరి వెంబడి ధనుంజయ రావు వస్తాడు. వెంకట్రావు గుమాస్తా వీరిని ఇంటర్వ్యూ చేస్తారు. ధనుంజయరావుకు సీఎం బావమరిదిని ఉద్యోగం ఇస్తాడు. కోటేశ్వర రావు ను తన అల్లుడిగా చేసుకుందామని అనుకుంటాడు. లావణ్య అందానికి ముగ్ధుడై బలాత్కరించపోతాడు. కోటేశ్వరరావు వచ్చి తాను లావణ్య సిఐడి ఆఫీసర్లమని ధనుంజయ రావు కూడా సిఐడి మనిషేనని ఇంతటితో నిరుద్యోగులను మోసగించే మీ ఆటకట్టు అని వారిని అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకునే ఇలాంటి వెనాగాళ్ళకు చివరకు బట్టే గతి జైలే అని నిరూపించారు. నిరుద్యోగులు ఉద్యోగము ఆశతో మోసపోరాదని, జాగ్రత్త కలిగి ఉండాలని రచయిత సమాజానికి సందేశం ఇచ్చారు. నిరుద్యోగులు,అసహాయుల బతుకులతో ఆడుకునేవారికి తగిన శాస్తి జరుగుతుందని, రచయిత తెలియజేశారు.

"ముందుచూపు" ఏకాంకిక లో సురేష్ ఒక మధ్య తరగతి ఉద్యోగి .తాగుడుకి బానిసై ఇల్లు గుల్ల చేసుకుంటూ బాధ్యతారహితంగా ప్రవర్తిస్తూ ఉంటాడు. లాటరీ టికెట్లు కూడా విపరీతంగా కొంటూ శ్రమ పడకుండానే లక్షాధికారి కావాలని కలలు కంటూ ఉంటాడు.

అప్పుడే ఇంటి యజమాని పానకాలు ప్రవేశిస్తాడు. అతని సురేష్ మాటలతో బోల్తా కొట్టించపోతాడు కానీ ప్రయత్నంఫలించదు తక్షణం ఇల్లు ఖాళీ చేయమంటూ వార్నింగ్ ఇస్తాడు.

అదే సమయానికి సురేష్ స్నేహితుడు ప్రకాష్ ప్రవేశించి పానకాలు శాంతపరిచి పంపించి వేస్తాడు. ఆ తర్వాత యాదగిరి అనే కిరాణా కొట్టు వాడు ప్రవేశిస్తాడు తన బాకీ తీర్చమంటూ గొడవ చేస్తాడు. ఆ గొడవ విని సురేష్ తండ్రి బెడ్రూంలోనుంచి జగదీష్ బయటికి వస్తాడు. విషయం తెలిసి బాధపడతాడు. సురేష్ తాగి వచ్చిన మైకంలో అల్లరి చేస్తుంటే మందలించి గుండెపోటుతో మరణిస్తాడు. తన పేరున ఇన్సూరెన్సు డబ్బుతో మనవరాలి బాగోగులు చూడవలసిందిగా కోడలికి చెప్పి మరణిస్తాడు. మందు వ్యామోహంతో ముందు చూపు లేక ప్రవర్తించి నందుకు పశ్చాత్తాప పడి రోదిస్తాడు. పరివర్తన కలిగిన సురేష్ మంచివాడిగా మారిపోతాడు. చేసిన తప్పులకు ఆనక క్షమించమని వేడుకున్నా తండ్రి రాడని తెలిసి పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు.

సురేశ్. బాధ్యతలు ఎరిగి ప్రవర్తించాలని రచయిత సమాజానికి మంచి సందేశాన్ని అందించారు.

1976 లోనే తెలంగాణ మాండలికాన్ని "వెలుగు వచ్చింది" అనే సాంఘిక నాటకం ద్వారా వెలిగించి ఆ తర్వాత అందరికీ నచ్చేలా సామాజిక ప్రయోజనాలతో అనేక నాటికలని వ్యవహారికంగా రచించి, రాణించిన వడ్డేపల్లి కృష్ణ నాటికలు ఎందరో వర్ధమాన రచయితలకు స్ఫూర్తి దాయకంగా నిలువగలవని అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు .

"అతిథి" నాటికలో శ్రీపతి మధ్యతరగతి గుమస్తా. మిత్రుడు ఉమాపతి. అతని భార్య లక్ష్మికి దూరపు బంధువైన అన్నయ్యనంటూ సీతాపతి అతిథిగా వచ్చి వారి ఇంట్లో తిష్ట వేస్తాడు ఎలాగైనా వదిలించుకోవాలని వేములవాడ వెళ్దామని భార్య పిల్లల్ని బయలుదేరిస్తాడు. బిర్లా మందిర్ దర్శనం చేసుకుని తిరిగి ఇల్లు చేరేసరికి సీతాపతి వెనకాలే ఇంట్లోకి వచ్చేస్తాడు వారిని చూసి తిరిగి వచ్చానని చెప్తాడు. ప్రతి ఇంట్లో జరిగిన సంఘటననే. యిది. హాస్యంగా మలచిన ఏకాంకిక ఇది. ప్రతి ఇంటిలోనూ అతిథులు ఎక్కువైతే ఖర్చు ఎక్కువే అని భావించి వారిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు కొంతమంది చేస్తారని రచయిత సహజ పద్ధతిలో ఈ ఏకాంకిక ద్వారా తెలియజేశారు.

"అడ్డు తెరలు" ఏకాంకిక రామమూర్తి ఛాందస మధ్య వయస్కుడి వద్ద నరసింహము వంటవాడిగా చేరుతాడు. రామ్మూర్తి తన కొడుక్కైన కృష్ణమూర్తి సంబంధం ఖాయం చేయడానికి పెళ్లిళ్ల పేరయ్యని పిలిపిస్తాడు .కృష్ణమూర్తి మాధవి అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లాడుతా పోతున్నట్టుగా తెలుపుతాడు. రామ్మూర్తి ఆ అమ్మాయిని కోడలుగా అంగీకరించక ఆగ్రహిస్తాడు. కానీ ఇంట్లో చేరి వంటవాడిగా అతని ఒంట్లోకి ఆహారం అందిస్తున్న నరసింహం మాధవికి స్వయానా అన్నయ్య అంటూ అసలు విషయాన్ని విప్పి చెప్తాడు.. డాక్టర్ వచ్చి యాక్సిడెంట్‌లో అతనికి ఎక్కించిన రక్తం కూడా నరసింహముదేనని ద్రువీకరిస్తాడు. కులమతాలు అనేవి మనం కట్టుకున్న అడ్డు తెరలు మాత్రమే అని చెప్పి అతని మనస్సు మారుస్తారు. ఆధునిక కాలంలో కూడా ఇంకా కులమతాలు అంటూ సమాజంలో వెలివేసే తీరు అమానవీయం అంటూ, కులమతాలు అనే అడ్డుగోడలు తొలగి సమసమాజం రావాలని రచయిత పిలుపునిచ్చారు.

"చదువు బాట" తెలంగాణ మాండలికంలో సాగిన నాటిక .

రాజయ్య చంద్రమ్మ దంపతులు చదువుసంధ్యలు లేని గ్రామీణులు. అల్లుడు అంజయ్య వచ్చి వాళ్ళ కొడుకు కొమురయ్యకు బాగా చదువు చెప్పించడం అత్యవసరం అని చెప్తాడు. పట్నం వెళ్లి కార్డు రాస్తాడు. అది చదవడం రాక పోస్ట్మాన్ బతిమాలగా అతను చదివి వినిపిస్తాడు .అందరూ చదువు బాటలో సాగడమే మేలు అని వివరిస్తాడు. చంద్రయ్య తన కొడుకు కొమురయ్యను మంచిగా చదివించాలని నిర్ణయించుకుంటాడు తెలంగాణ మాండలికంలో సాగిన చిన్న నాటిక ఇది. చదువు నేర్చుకుంటేనే ప్రగతికి బాట అని దేశానికి వెలుగని. అందరూ చదువుకోవాలని రచయిత ఆకాంక్షించారు.

"మంచుతెరలు" నాటికలో

సుబ్బారావు మధ్యతరగతి గుమస్తాగా ఉంటూ సినిమాల్లో వేషాలు వేస్తూ ఉంటాడు అతని భార్య శాంతి సాంప్రదాయ గృహిణిగా పూజలు చేస్తూ అతడితో విభేదిస్తుంది .అతని తోటి నటిమణి ఎవర్నో ప్రేమించి పెళ్లాడుతా పోతున్నట్టుగా అనుమానిస్తుంది ఘర్షణ పడి అన్నయ్యతో పుట్టింటికి వెళ్ళిపోతుంది.కానీ గొడవ పడడం భార్యాభర్తల మధ్య సహజమేనని అంతమాత్రాన విడిపోవాలనేది మూర్ఖత్వమని గ్రహిస్తుంది. తన కోసం వచ్చిన భర్తను ప్రేమగా చూసుకుంటుంది. భార్యాభర్తల మధ్య ఏర్పడే మనస్పర్థలనేవి మంచు తెరలేనని తెలుసుకుంటుంది. చిన్న చిన్న అలకలు ప్రతి కుటుంబములోను సహజమే అని అంత మాత్రాన అవి పెద్దవిగా చేసుకోరాదని రచయిత తెలిపారు. సమాజంలోని అన్ని పరిస్థితులను రచయిత తన నాటికల ద్వారా చాలా చక్కగా తెలియజెప్పారు. వడ్డేపల్లి కృష్ణ గారి నాటికలు ఔత్సాహిక నాటక సమాజాల వారికి ఎంతో ఉపయోగపడతాయి. ఆనాటి సామాజిక పరిస్థితులను నేటి తరాలు అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. వ్యవహారిక భాషలో రచించిన రచయిత నాటికలు నేటి రచయితలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.

–బందారు సునీత
9440671530

ఓ నవ యువకా!

ఓ నవ యువకా మేలుకో..!
ఇకనైనా
నిన్ను నువ్వు తెలుసుకో!

సరికొత్త ఆలోచనలకు
శ్రీకారం చుడితేనే కదా
నీకంటూ
ఓ ప్రత్యేకతను చాటేందుకు
సుగమమవుతుంది మార్గం!

ఆత్మవిశ్వాసమే ఆలంబనగా
చిరునవ్వే.. ఆహార్యంగా
మౌనమే ఆయుధంగా
ఒక్కో మెట్టును ఎక్కుతూ
అధిరోహించాలి
విజయశిఖరం!

బంగారాన్ని గీటురాయి
పరీక్షించినట్టు
మానసిక స్థైర్యాన్ని
ప్రతికూలతలూ
కవ్వించడం సహజం!

సాహసం శ్వాసగా..
నిర్భయత్వమే ధ్యాసగా
నిర్మల మనసు ఆభరణంగా
మలచుకుని
సామాజిక దృక్పథమే
సంకల్పంగా
సాగించు పయనం!

మిత్రమా!
ఆరంకెల జీతమే
జీవిత పరమార్థం కాదు సుమా!
పచ్చదనం కొరవడకుండా
బంధుత్వపు వృక్షానికి కొమ్మవై
సొబగులు పెంచు ప్రతిక్షణం!!

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

మిలన్

ఎన్నాళ్ళకో కలిశాం
రా! జీవితాలను కలబోసుకుందాం
ఇన్నాళ్ల ఒంటరితనాన్ని
కలయికతో నింపుకుందాం
పేరుకపోయిన నిశ్శబ్దాన్ని దులిపి
శబ్దాలుగా మారుద్దాం
స్మృతుల తీరాల్లో విహరిద్దాం
మిగిలిన కన్నీళ్లను వొంపుకుందాం.

రెండు దశాబ్దాల చీకటిలో
వెలుగును రగిలిద్దాం
యుద్ధంలో తప్పిపోయిన సైనికులు
వయసుమల్లి తిరిగొచ్చినప్పుడు
కొడుకులే గుర్తుపట్టని విషాదంలో
కాలాన్ని వెనక్కి ఈడ్చుకొద్దాం.
మళ్లీ విడిపోవద్దు!
చేయి చేయి గట్టిగా పట్టుకుందాం
ఇక్కడి నుంచి దారి కొంత కఠినమే
వడలిపోయిన స్వప్నాలను
రంగులు వేసి అలంకరిద్దాం
గుచ్చుకున్న తీరని కోరికలను పెరికి
గాయాలకు మలాం పూద్దాం.

అడుగుపెట్టిన కొద్దిపాటి దినాలను
భారంగా నడుస్తున్న క్షణాలను
తియ్యటి అనుభూతులను
చేదెక్కిన ఆత్మీయ గీతాలను
మానసిక వైకల్యాలను
శంకలను
దువిధలను
మళ్లీ ఓసారి
చైతన్య జలాలతో అభిషేకిద్దాం.

అవును!
నువ్వు కలిసిన మరుక్షణం నుంచి
మబ్బులు తొలిగి
వాన వెలిసినట్టుంది
దూరాలు దగ్గరైనట్టుంది
బరువులు తగ్గినట్టుంది
ఓనా ప్రియ నేస్తమా!
గతాన్ని వర్తమానంగా పరివర్తన చేద్దాం.
ఏదీ అసాధ్యం కాదు
ఈ ఆనందం అనవద్యం.

–డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

సావిత్రీభాయిపూలే ఈనాటి ఆత్మగౌరవ పతాక..!

మంచు కొండల్లో ఏవో రహస్యాలు
ఆ గొర్రెల కాపరి ఆ కొండ అంచుపైన
ఆ గొర్రె పిల్లను ఎత్తుకు నుంచున్నాడు
చేతిలో కర్రపుల్ల జూసి గొర్రెలు బెదరడం లేదు
కళ్ళలో చూపు చూసి అవి క్రమశిక్షణగా వున్నాయి
ఆ గొర్రెపిల్ల ఆ గొర్రె కడుపు నుండి జారినప్పటి నుండి
అది స్వతంత్రనే ప్రకటిస్తుంది
చిన్న చిన్న పరకలు కొరకడం తానే నేర్చుకొంది
ఆ కాపరి చిట్టిన ముడిబియ్యం అన్నం
ఎర్రంగారపు పచ్చడితో కలిపాడు
పచ్చడి చింతపండులో మాగిందేమో
చాలా రుచిగా వుంది.
కాపరి కొండ నుండి చాలా పాఠాలు నేర్చుకున్నాడు
ఆ గడ్డి పరక సూర్యకిరణాలను
ఎదిరించి నిలబడడం అతనికి స్ఫూర్తి
అవును! ఆ గడ్డి పూలది సహజ సౌందర్యం
నేను వూటీలో పున్నాగపూల సౌందర్యం చూశాను
అవి భూమిని అలంకరించడం చూశాను
అవి గదబస్త్రీకి కిరీటం పెట్టడం చూశాను
నిజానికి స్త్రీలకు పూలు
ఎంతో సౌందర్యాన్ని తీసుకొస్తాయి కదా!
అవును! పూలు నిర్మలంగా నవ్వుతాయి
రంగు రంగులుగా పూస్తాయి
మనసుకు ఊరట కలిగిస్తాయి
నిజమే, రాజ్యాన్ని పాలించేవాడికి
పూలవాసన తెలియడం లేదు
అతడు మొగ్గల్ని తుంచుకొంటు వెళుతున్నాడు
గడ్డిపూలపై ఉక్కుపాదం మోపుతున్నాడు
గొర్రె గొంతును రెండు వేళ్ళతో నొక్కుతున్నాడు
ఆ పూజారి ఆ భక్తురాలిని మానభంగం చేసి
దేవుని సాక్షిగా హతం చేశాడు
గర్భాలయాల్లో ఎన్ని హత్యలు జరిగాయో!
ఎన్ని అనుచిత గర్భాధానాలు జరిగాయో!
అందుకే వీళ్ళు రాళ్ళను ప్రేమిస్తారు.
వాటికి కళ్ళు లేవు
సాక్ష్యాలు చెప్పలేవు.
పాపం, ఎందుకు ఆ దేవుడి ముందే
అరాచకాలు చేస్తున్నారు
ట్రంపు ఓటమిని సహించలేకపోతున్నాడు
తెల్ల భవనంకు రాళ్ళు తొలుస్తున్నాడు
జొబిడెన్‌ను తేరిపార చూడలేకపోతున్నాడు
ఢిల్లీ పోరాటం, పెనుచలిలో మంటలు రేపుతుంది
నిజమే! ఆ పడతి భర్త మరణానికి బాధ్యురాలు కాదు
అందరూ ఆమె ముఖ వర్చస్సును చూడలేకపోతున్నారు
తోడును ఎవరు స్థిరీకరించారు?
కొంతకాలం మంటల్లో కాల్చారు!
కొంతకాలం తలకి గుండు చేశారు
కొంతకాలం అవమానించారు
ఇప్పుడు మొఖం తిప్పుతున్నారు
అవును! ఆమె గట్టిగానే సమాధానం చెపుతోంది
రాజ్యాంగం చేతిలో ధరించింది
సావిత్రీభాయిపూలేని ఆత్మస్థైర్యంలోకి తీసుకొంది.
ఆమె పిల్లల కోసమే ఎందుకు బ్రతకాలి!
తన కోసం తాను బ్రతకకూడదా!
తన్ను తాను పాలించుకొనే హక్కు తనకు లేదంటారా!
గడ్డాలు పెంచితే ఋషులవుతారా!
మంత్రాలు చదివితే పండితులవుతారా!
పూజలు చేస్తే భక్తులవుతారా!
ఆ వెంకన్న హుండీలో నల్లడబ్బు సంగతేమిటి?
అందుకే! అంబేద్కర్ రాజ్యాంగ ప్రతి ఒక్కటే!
స్వేచ్ఛ, సమానత్వాన్ని సమాజానికి ప్రసాదిస్తుంది
ఆ కళ్ళలో నిజమైన సూర్యోదయం వుంది.
మానవతా ధీధితులు ఉన్నాయి
పునరుజ్జీవన చర్యలున్నాయి.
జ్ఞానం వివేచన నుండే జనిస్తుంది..!

– డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

కొన్ని తలపోతలు

జ్ఞాపకం
రంగు వెలుస్తుందా..

జ్ఞాపకం
పరిమళం వడలుతుందా..

జ్ఞాపకం
కుదురు కూలుతుందా..

జ్ఞాపకం
శిరసు వాలుతుందా..

జ్ఞాపకం
అన్ని వేర్లు తెంపుకుపోతుందా..

జ్ఞాపకం
మనసుమట్టి రేణువుల్లో
ఇక మిగలకుందా..

జ్ఞాపకం

తొలి పండుగ!

పండిన పంటకు ధరల్ వచ్చినన్నానాడే తొలి పండుగా
ధాన్యరాసులతొ గాదం నిండగ సంతసమ్మె గద దండిగా. !!పండిన!!
తొలకరి మబ్బులు కురిసిన నాడే
వెలుగు రైతు కనులప్పుడే.
నాగటిచాలున చిక్కిన నేలన నవ్వులు విరిసేదప్పుడే. !!పండిన!!
మొలకెత్తిన కూనలు చూడ వెలుగు చిరునవ్వులే.
కొంటె నవ్వుల కోనంగిల ప్రక్కనుండు కలుపు మొక్కలే. !! పండిన!!
ఆట పాటలతో అలరు కోమలుల నాటు కాలమ్ములే.
ఏపుగ పండిన పంటను జూడ కన్నబిడ్డ వలెనుండులే. !!పండిన!!
ప్రేమగ నిమిరిన పైరుసొగసులే మదిన నిండుగుప్పొంగులే.
ఎంతపండినా పండిన పంటకు ధరయె వచ్చిన సంతసమే. !!పండిన!!
మార్కెట్ డిమాండ్ యెరిగి వేసిన పంటయె
మెరుగని తెలుసుకో
వేసిన పంటకు ధరలు గిట్టుటయె నిక్కముగా నిజమౌనులే!! !!పండిన !!

-యెనిశెట్టి గంగా ప్రసాద్
సెల్: 9866447234

ఆశలసౌధాలు

కనులముందే కూలుతున్న ఆశలసౌధాలు ఎన్నో
సాధింపుల మధ్య ఛీత్కారాల బ్రతుకులెన్నో
బంధాలను తుంచి విడిపడిన బంధాలెన్నో
పచ్చని పందిరిని కూల్చిన తుఫానులెన్నో
కోర్కెల సుడిగుండంలో విలవిలలాడిన ప్రాణాలెన్నో
శిథిలావస్థకు చేరిన జీవితాలు ఎన్నో..

-పి.విశాలాక్షి
9908435805

సంక్రాంతికి స్వాగతం

తెలుగు వెలుగుల పర్వదినం
తెలుగువారి ముంగిట శుభదినం
పాడిపంటల కళకళల పచ్చదనం
రైతు ఇంట ఆశల మూలధనం
వెరసి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం.

అంబరాన్నంటే సంబరాలు
నింగికి ఎగిసే పతంగాలు
కనువిందు చేసే రంగవళ్ళులు
అబ్బురపరిచే గొబ్బిళ్ళలు
వెరసి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం.

మరదళ్ళ గిల్లికజ్జాలు
బావల అల్లరి వేషాలు
బసవన్న గారడీలు
హరిదాసు భక్తి కీర్తనలు
వెరసి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం.

నోరూరించే పిండి వంటలు
చలిని తరిమే భోగిమంటలు
గంగిరెద్దు గణగణ గంటలు
ముచ్చట గొలిపే కొత్తజంటలు
వెరసి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం.

ఈ మకర సంక్రాంతి
తేవాలి నవ క్రాంతి
నిలపాలి ప్రపంచశాంతి

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

లోగిలి గుట్టు

గడప ముందు అల్లిక
ఆహ్లాదకరంగా పూయించిన ఓ మల్లిక
ఇల్లాలి కళాత్మకతకు అది ఒక తార్కాణం
ఇల్లే అగుపించేను శోభాయమానం
ప్రతి రోజూ కొత్తగా వాకిలిలో సాక్షాత్కారం
రోజూ ఒకలా ఉండదని చెప్పేందుకు
లఇది కూడా ఒక విధానం
చేతివేళ్ళ మధ్య జారిపోతున్న ముగ్గు
చేజారిపోతున్న సమయాన్ని గుర్తుచేసేందుకు పడే తాపత్రయం
గట్టిగా బిగిస్తే జారిపోతూనే ఉంటుంది
బంధాలను బిగిస్తే పట్టుతప్పుతాయని
చెబుతూనే ఉంటుంది
సంకల్పసిద్ధి ఉంటే నింగినేలే చుక్కలను
నేలపైకి కూడా రప్పించవచ్చునని
చుక్కలతో పరిచి చెప్పిన వైనం
చుక్కలను కలిపి ఉంచే తీరు
కలిసిఉంటే కలదు సుఖమని చూపించిన చిత్తరువు
చాకచక్యంగా మెలికలు తిరుగుతూ
సుందరంగా రూపుదిద్దుకున్న రంగవల్లిక
జీవిత చదరంగంలో ఎత్తులు పల్లాలు ఉంటాయని
గుట్టుగా చెప్పిన దిక్సూచిక
ఏమరుమాటైతే అంతా అస్తవ్యస్తం
జాగరూకత అవసరమని జనులకి ఉపదేశం
ఎలా వేస్తే రంగవల్లిక అలా అల్లుకుపోతుంది
జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకుంటే
అలా ఉంటుందనే భావనకు నిదర్శనమే అవుతుంది
రంగులతో నింపితే అది
ఇంద్రధనుస్సే ఇంటిముందు
జీవితానికి రంగులు జత చేస్తే
ప్రతిరోజు రంగుల కేరింతల హ్పాలీయే
అని మన సంస్కృతి మనకు ఇచ్చిన
అపూర్వ సందేశమే ఇది

-మంజుల సూర్య
9704022244

రైతు పండుగ సంక్రాంతి

ఈ మకరసంక్రాంతి పర్వదినం
సూర్యుడు ఉత్తర పయనం
ఆరంభించిన శుభతరుణం,
నేటి నుండి ఆరుమసాల కాలం
దేవతలందరు మేలుకొని
యుండే పగటి సమయం,
ఈ మకర సంక్రాంతి పర్వదినం....

రైతుల స్వేదం ఫలితం
పొందే పుణ్యకాలం,
రైతుల పంటలు ఇంటికి
చేర్చే ఫలితకాలం,
రైతుల నిస్వార్థ నేస్తాలైన
పాడి, పశువులకు పూజలు
చేసి పవిత్రకాలం....

కమ్మటి పిండి వంటలతో
కడుపు నింపి రైతు పంట
తృప్తి పొందేకాలం,
ఈ మకర సంక్రాంతి పర్వదినం....

హరిదాసుల భజన కీర్తనలతో,
బసవన్నల నాట్య విన్యాసాలతో,
అందరి మది మురుపించే
కళలు విరాజిల్లే కాలం,
ఈ మకర సంక్రాంతి పర్వదినం....

భుదేవికి పచ్చటి చీర కట్టినట్లున్న
కల్లాపి చల్లిన వాకిట్లో....
తెల్లటి పిండితో
అమ్మచేతివేళ్ళ నుండి
జాలు వారే ముగ్గుల
గీతలు పాల దారాలవలే
భుదేవి నుదుటిపై
పాపడ తీసినట్లున్నాయి,
ముగ్గుల నడుమన పెట్టె
అలంకరించిన గొబ్బెమ్మెలు
భూదేవి నుదుటన
సింధూరం పెట్టినట్లున్నాయి,
భూదేవి బుగ్గపై చొట్ట పడ్డట్టు ఉన్న
బావులను, చెరువులను
నింపమని తన ఎదపై
ఆడే చిన్నారుల పతంగులతో
మేఘాలకు సందేశం పంపే శీతాకాలం,
ఈ మకర సంక్రాంతి పర్వదినం....

-వేల్పుల రాజు.
9701933704

హరిదాసులొస్తూనేవున్నారు

మసక చీకటి మరలకముందే
వేకువ కిరణాలను స్వాగతిస్తూ
హరిదాసులొస్తూనేవున్నారు
ధనుర్మాసమే ధనలక్ష్మిని తెస్తుందన్న
కొత్త ఆశలను మొలకెత్తింప చేసుకుంటూ
వీధి వీధుల్లో విధిగా తిరుగుతూనేవున్నారు
నెత్తినెట్టుకున్న కలశం రోజూ నిండుతుంటే
తమ ఇళ్ళు అక్షయపాత్రకు నెలవవుతాయని
ఆరాటంతో ఆడుతూపాడుతూ
ఊరూరా ఊరేగుతూనేవున్నారు
ఆకలి తీర్చని చేతులకు తగిలించుకున్న
భజన చెక్కల సప్పడిని ఎవరైనా విని
ఆలకిస్తారనే ఆలోచనలతో
కలల నడకను సాగిస్తూనేవున్నారు
భుజాలపైకెక్కిన తంబురా
హృదయలోతుల్లో పెల్లుబికిన
వేదనను బయటకు పొర్లనీయకుండా
సద్భావనాకీర్తనలను వినిపిస్తూనేవున్నారు
పల్లెల్లో గాదెలు నిండిన ఇళ్ళముందు
గొబ్బెమ్మల్లో, ముగ్గుల్లో
అగుపించే కళానైపుణ్యానికి ముగ్ధులవుతూ
కానరాని సామ్యవాదపు దారులను
వెతుక్కుంటూనేవున్నారు
చిరుదీపమెప్పటికైనా
తమ ఇంట వెలిగి
సంక్రాంతి కాంతులు చిందిస్తుందన్న
ఊహల లోకంలో
హరినామ సంకీర్తన చేస్తూ
పయనిస్తూనేవున్నారు

-పొత్తూరి సుబ్బారావు
సెల్:9490751681

పుస్తక సమీక్ష

అక్షరంలో అందంగా ఒదిగిన ప్రకృతి

మనిషి మనుగడకి ప్రకృతి సంపదే మూలం ...మనిషే కాదు సమస్త జంతుజాలాలకి జీవించే హక్కు ఉంది ..ప్రకృతికి మనిషికి విడదీయరాని సంబంధం ఉంది ....ఒక విత్తనం నాటితే తరతరాలు కాపాడుతుంది . నకాలంలో వర్షాలు కురవాలి అన్నా, పంటలు బాగా పండినోటిలో కి అన్నం ముద్ద పోవాలి అన్న పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి అవుతుంది ...అభివృద్ధి పేరుతొ ద్వంసం అవుతున్న ప్రకృతిని కాపాడడం అంటూ ఆచార్య పసుల వెంకట రెడ్డి గారు "ప్రకృతి అడుగుజాడల్లో'' అనే కవితా సంపుటితో మనముందుకొచ్చారు ...జంతు శాస్త్ర ఉపాధ్యాయుడు అవటం మూలానేమో కవితలన్నీ ప్రకృతికి , సృష్టిలో ప్రతి కీటకం దాని ప్రత్యేకత ని వివరించే యత్నం చేశారు ..

కోతి నుంచి మనిషి ఉద్భవించారు అంటారు అలంటి వాటి పై ''జీవనోపాధి'' కవితలో చక్కగా వివరించారు. మనిషికి వానరానికి గల సంబంధం తెలియచేస్తూ **"పరిణామం లో వానర జాతి వంశ పరంపర/ బుద్ధి జీవుల ఆవిర్భావానికి నాంది పలికింది"** అంటారు ...ఏమైనా మనిషి కి వానరానికి అవినాభావ సంబంధం ఉంది ..హరితము సవ్యంగా ఉంటేనే మనిషి మనుగడ ఆనందంగా ఉండేది ..చెట్ల ప్రాముఖ్యాన్ని చెప్తూ "హరిత భాష లో మాట్లాడుకుందాం'' అడవి పెంపకం పై మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందని తెలియచేస్తారు **..."ఈ రోజు నాటిన చెట్లు /రేపు చిగురించి కొమ్మలు గా రెమ్మలుగా/విస్తరించి/అప్యాయంగా పలకరిస్తాయి** ...అందుకే నేటి విత్తనమే రేపటి వృక్షమని అందుకే మన పలకరింపు "హరిత భాష" లోనే సాగితేనే హరితహారం పరమార్థం . (హరిత భాషలో మాట్లాడుకుందాం).గిజిగాడు అల్లిక లో చాలా దిట్ట ...గిజిగూళ్ళు గా ప్రసిద్ధి పొందిన పిచ్చుక గూళ్ళు ఇప్పటికి పాత భావనలో, బావులలో , ఇంకా దట్టంగా అల్లుకున్న అడివిలో చూడొచ్చు **"భూతలం పై వందకు పైగా జాతులతో //నైవిధ్యభరిత ఆకృతులతో గిజి గూళ్ళు"** భిన్న జాతులు అయినా నది తీరాల్లో, చెరువుల్లో, గిజిగూళ్ళు కట్టుకొని నివిసిస్తాయి పక్షికి మనిషికున్నా నిర్మాణ శైలి భిన్నంగ ఉండే స్ఫూర్తినిస్తాయి **.. "అల్లిక విద్య వారసత్వం గా వచ్చింది కాదు ..// మెళుకువల్ని ప్రకృతి ఇచ్చిన వరాల"**అవును మనిషి పరిధి పరిమితం ప్రకృతి ధీ అనంతం కదా...చెట్లు ఏమి చేస్తుంది/ చెట్టు ని ఎందుకు నాటాలి. ఎందుకంటే చెట్టు మనిషి కి మంచి నేస్తం, చెట్టు ఫలాన్నే కాదు భవిషత్ ని కూడా ఇవ్వగలదు ...రోడ్ పక్కల నాటిన చెట్లు ఎంతమందికి సేద తీరుస్తుందో అందరికి తెలుసు.."చెట్ల కింద నడకలో" రోజు తారసపడే చెట్లన్నీ/ **జీవకోటికి ప్రాణదాతలు/బాట సారులు సేద తీర్చే అచ్ఛాదనలు"**నిజమే చెట్లు రోడ్ పక్కన నాటడం వలన ఎంతోమంది బాట సారులకి సేద తీర్చే విశ్రాంతి మందిరం అవుతుంది ..

పరాన్న జీవులు ప్రకృతి లో ఎన్నో ఉంటాయి ...ప్రకృతి లో పరాన్న జీవుల ఆవిర్భావం /జాతి జంతువుల పరిణామ క్రమం లో అంతు పట్టని చిక్కే



అంటూ పరాన్న జీవుల పుట్టుక గురించి ఆసక్తిని రేకెత్తించారు ..ఎన్ని వున్నా చివరికి **"వైవిధ్యం తో చాలా వరకు రోగకారకాలే /కొన్నిటికి బాహ్య శరీరం/ మరికొన్నింటికి అంతర్గత అవయవాలు ఆవాసం"** ...అవును పరాన్న జీవుల ఎక్కడైనా ఉంటాయి ఏకకణ మలేరియా జీవులు, బాక్టీరియా వైరస్ లు, బద్దె పురుగులు, ఇలా కాదేది పరాన్న జీవులకి అనర్హం అంటారు (పరాన్న జీవులు) ..గ్రామాలకి ప్రకృతి కి విడదీయరాని సంబంధం ఉంది...స్వాతంత్ర్యానికి పూర్వం తరువాత గ్రామాల స్థితి ని తెలియచేసే కవిత నే "గ్రామీణ వ్యవస్థ-నాడు నేడు **"మోటబావులు/కుంటల చెరువులు/సశు సంపద/అంతా సాంప్రదాయక సేంద్రీయ వ్యవసాయమే"** ఒక్కప్పటి వ్యవసాయానికి మచ్చు తునక అలాగే ఇప్పటిలా కాకుండా "ఆత్మహత్యలు లేవు/ఆకలి చావు లేవు నిజమే అప్పుడు ప్రకృతి పరంగా చక్కగా అన్ని అమరినాయి అందుకే **ప్రకృతి వనరుల పరిరక్షణ /దేశ ప్రగతికి గ్రామ స్వరాజ్యం నినాదం.** పక్షులని పెంచుకోడం మనకి అలవాటే..అయితే దాన్ని బంధించడం అంటే స్వేచ్ఛ ని హరించడమే...పంజరం లో చిలుక ఎలాగానో మనిషి స్వేచ్ఛ ని హరించి ఒకేచోట బంధించడం కూడా అంతే ...పంజరం లో చిలుక గురించి చెప్తూ **...స్వేచ్ఛావాయువులు పీలుస్తూ/చెట్టు నుండి చెట్టుకు/ కొమ్మ నుండి కొమ్మ కు //రెక్కలు విదిల్చి ఎగురుతూ** ...ఇలా జీవితాన్ని గడిపేస్తున్న **చిలుక స్మృతుల కుంపటి రాజేసి /గాయాలైన స్వప్నాలకు ముద్దులొలికే మాటలతో //లేని మమతలు పెంచుకొని /అస్తిత్వం కోల్పోయిన నేను ఎన్నటికీ ఎగరలేని చిలుకను** అంటుంది ..(పంజరం లో చిలుక) ..

సాలీడు గొప్ప శ్రమైక జీవి ..తన గూడు తానె ఎంతో ఇష్టపడి కష్టం అయినా సరే కట్టుకుంటుంది ."సాలీళ్ల సోయగాలు" కవిత లో ఎంతో అద్భుతంగా చెప్పారు .."సాలీడు గూడు/శ్రామిక జీవన సౌందర్యానికి పరాకాష్ఠ/గూడు చెదిరిన చతికలపడక అకుంఠిత దీక్షతో అదే పనిగా పునర్నిర్మాణానికి పూనుకుంటాయి ...నిజానికి సాలీడు నుంచి మనిషి నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ కవిత చదివాకా తెలుస్తుంది .. అన్వేషణ ఎప్పుడు మనిషికి అవసరమే...ఆ మాటకి వస్తే సృష్టిలో ప్రతి జీవికి అన్వేషణ తప్పదు ఆహారం కోసమో, గూడు కోసమో అన్వేషణ జరుగుతూనే ఉండాలి ...మనిషి విషయానికి వస్తే..."అన్వేషణ " ఎంత ముఖ్యమో ఈ కవిత చదివాకా అర్థం అవుతుంది. "ఎందుకు? అని ప్రశ్నించడం తెలిస్తే సగం జీవితాన్ని వడబోసినట్లే" పరమ సత్యం ఇది ...ఈ విషయము తెలియకనే చాలా మంది భిన్న దారుల్లో నడుస్తారు ..చివరలో కవి అంటారు ..."**సృజనాత్మక జీవితాన్ని చవి చూడాలన్న //నిర్దిష్ట ఆశయాలు మెగ్గతొడగాలి అన్నా/నిరంతర అన్వేషణ ఆవశ్యం/అనివార్యం ...**మరి అలా అన్వేషించాకా "మహనీయులు కలలు కంటారు జీవితం ఎలా గడపాలో తెలుసుకుంటారు .. ప్రశ్నించడం తెలిసిన మనిషి సత్యానికి దగ్గర అవుతాడని గొప్పగా వర్ణించారు .. "కందిరీగల": జీవన వ్యూహం గురించిన కవిత నిజంగా అబ్బురమే..అవి మానవులకి చేసే మేలు ని ఎలా మర్చిపోగలం.."పంటలను నాశనం చేసే ఒక్కొక్క కీటకానికి ధీటుగా ఒక్కొక్క కందిరీగ జాతి వేటాడుతుంది అంటే "ఎన్ని జాతులు మానవాళి కి మేలు చేకూరుస్తున్నాయి చెప్పలేము కదా..వాటి ఇంటి నిర్మాణం నేటి ఇంజినీరులు సైతం అబ్బురపడవాల్సిందే ...అందుకే

"గూడంటే మట్టి తో కట్టిన చిన్న ఆవాసం కాదది
అది తల్లి వాడికి నోచుకొని పిల్లల చల్లని విడిది"

..ఇలా కందీరగ జీవన వ్యూహాన్ని ఎంతో చక్కగా కవిత్వీకరించారు ...ప్రకృతి లో ప్రతి ప్రాణి తనకు అనుగుణమైన ఇంటిని నిర్మాణం చేసుకొని రక్షణ కావిస్తుంది ..తెలుగు భాష ప్రాచీన హోదా సంపాదించుకున్నాక ఏమైనా మార్పులు వచ్చాయా. లేదు ఇంకా పాత రోజులలాగానే ఉన్నాయా అని బేరీజు వేసుకుంటే లేదనే సమాధానమే వస్తుంది ..నేటి తెలుగు స్థితి పట్ల కవి ఆవేదన వ్యక్తం చేస్తారు ..

"నిర్దిష్ట కార్యాచరణ కానరాక//పరిపాలన భాష చేయలేని దుస్థితి"కి నేటి తెలుగు భాష దిగజారిపోయింది ..మరి అన్య భాష కూడా తెలుగు పై ఆధిపత్యం వహించడం మరో కారణమంటారు **.."పాతుకు పోయిన ఆంగ్ల భాష ఊడలు/తెలుగు భాష పునాదులను పెకిలించివేస్తున్నాయి"** వాస్తవమే చెప్పారు ...అయితే ఇప్పుడు తెలుగు భాష ఉద్యమం రాజకీయమైపోయింది ఎన్ని వైరుధ్యాలు ఉన్నా "మాతృ భాష ఒక్కటే హృదయాలను కదిలించేది కలిపేది" అన్న వాక్యం సత్య దూరం కాదు ..(మన తెలుగు భాష)

ఈ సంపుటిలో పైన పేర్కొన్నవి కేవలం కొన్ని మెరుపులు మాత్రమే..ఇంకా అద్భుతమైన కవితలు ఎన్నో వున్నాయి ..ప్రకృతిలో ప్రతి ప్రాణికి సంబదించిన గూడు పరిమాణం, జీవన విధానం అలాగే వృక్షానికి మనిషి కి మధ్య గల సంబంధాన్ని ఎంతో చక్కగా అలతి పదాలతో అందరికి అర్థం అయ్యే విధంగా రచించారు ...ఏవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉన్న నేటి సమాజంలో ప్రజల ఐకమత్యంగా ఉంది వృక్షాలని, జంతుజాలాన్ని రక్షిస్తే అవి మనల్ని కాపాడతాయి అన్న కవి ఉద్దేశం ఎంతో మంచిది. కవికి/ రచయితకి సామాజిక బాధ్యత ఉండటం ముఖ్య విధి ..తనలో ఉన్న సామాజిక స్పృహని అదేమైనా అక్షరాల్లో అమర్చి మనల్ని "ప్రకృతి అడుగుజాడల్లో" నడిపిస్తారు వెంకట రెడ్డిగారు ...బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం మూలాన కావొచ్చు సమాజం పట్ల, ప్రకృతి పరిరక్షణ పట్ల తనకున్న ప్రేమ ప్రతి అక్షరంలో వెల్లడిస్తారు ....ఆలోచింపచేసే పుస్తకాలు కొన్ని మాత్రమే ఉంటాయి అటువంటి కోవలో ఈ కవితా సంపుటి ముందు వరసలో వుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు ...మరిన్ని సామాజిక అంశాలని కవిత్వీకరించి ముందు అడుగులు వేయాలని మనసారా కోరుకుంటున్నాను ..

ప్రతులకు: ప్రొ॥ పసుల వెంకట రెడ్డి
2-7-210, ఎక్సైస్ కాలనీ
సుబేదారి, హనుమకొండ
వరంగల్-506 001
సెల్: 9849695603



-పుష్యమీ సాగర్
9032215609

సంక్రాంతికి పట్టాభిషేకం

సంక్రాంతి సంబరాలలో
ఊరేగుతున్న తలపాగా రైతన్నదే
పైనుండి ఆకాశం చూస్తోంది
ఇక్కడ జరుగుతున్నది
పండగ మాత్రమే కాదు
వైభవోపేతంగా పట్టాభిషేకం
ఒంటి నిండా మంచుముత్యాలతో
ముత్తెదువులా పచ్చదనం
మంగళవాయిద్యాల్లా గుడిలో గంటలు
వీధి వీధినా చలిమంటల తోరణాలు
అదిగో అతడే రాజు, మహారాజు
పేరుకు రైతుగా రెండక్షరాలే కానీ
నిలబడితే నేల, ఆకాశం కలిసిపోతాయి
తాను నీళ్ళల్లోకి ఎప్పుడు తొంగిచూసినా
కనిపించేది తన ముఖం కాదు
మన అందరి ఆకలి
తాను అస్థిపంజరంగా మారినా
నాగలితో ఆకలి మీద యుద్ధానికి
సిద్ధమయ్యే మహావీరుడతడే
మనిషి తినే ప్రతి గింజ మీద
హోమిగా అతని సంతకమే
దేవుడు సైతం రుణపడివున్నాడట
నిత్యం నైవేద్యానికి
ధాన్యం దాత రైతన్నే మరి
రోజూ ఇష్టంగా మట్టిస్నానం చేస్తాడు
అందుకే నడిచే దారినిండా పరిమళం
చాలా రోజులుగా
స్వేదం మాట్లాడే బడి కోసం
సగరాలన్నీ తిరిగాను
చివరకు దొరికింది
పొలాల మధ్య పచ్చదనానికి
పాఠాలు చెప్తూ రైతన్న

దేశానికి వెన్నుముక రైతన్న
ఆ ఎముకే కర్రగా
ఈ దేశం జెండా ఎగురుతోంది మూడురోజులు ముచ్చటగా
జరుగుతున్న పట్టాభిషేకాన్ని
అభిషేకంగా మార్చుకున్న
రైతుకు, రైతు స్వేదానికి
కృతజ్ఞతగా సాష్టాంగ నమస్కారం

-డాక్టర్ కె.జి. వేణు
98480 70084

సంక్రాతి శుభ ఆహ్వానం

మకరరాశిలో సూర్యుని ఆగమనం
సంక్రాతిలక్ష్మికి శుభ ఆహ్వానం.

భోగిమంటలలో వెలిగే సింధూరంతో
భామల భోగిపళ్ళ పేరంటంతో
గోదా కళ్యాణ వైభోగంతో
కొత్తధాన్యం చక్కెర నైవేద్యంతో
సంక్రాతిలక్ష్మికి శుభ ఆహ్వానం.

మగువల మోముపై విరిసే దరహాసంతో
ముంగిట ముగ్గుల్లో మురిసే మందారంతో
ముగ్గుల్లో కన్నె గొబ్బెమ్మల సింగారంతో
ముద్దు గుమ్మల ముచ్చల వయ్యారంతో
సంక్రాతిలక్ష్మికి శుభ ఆహ్వానం.

దూడూ బసవన్న సన్నాయినాదంతో
గంగిరెద్దుల చిందుల రమణీయంతో
హరిదాసుల చిరుతల తాళంతో
వేషధారుల వినూత్న ప్రదర్శనంతో
సంక్రాతిలక్ష్మికి శుభ ఆహ్వానం.

- కందాళం రజనీకృష్ణ
సెల్:9487708043

విశ్వ మానవుడు

ఆకాశంలో
సూర్యోదయం
అందరి
హృదయాలలో
జ్ఞానోదయం.

విశ్వమానవుడు
వివేకానందుని
జన్మదినం, భావిపౌరుల
భాగ్యోదయం.

బలమే జీవితం
బలహీనత యే మరణ
మని

యువతకు
వీరత్వ ప్రేరణ.
సందేశం
లోక కళ్యాణం

- యెల్ది సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067

సంక్రాంతి పండుగ రోజు

సంక్రాంతి పండుగ రోజు
తెలుగు ముంగిల్ల ముందు
కళ్లాపి చల్లిన భూమిని
కాగితంగా చేసుకొని
ముదితలందరు మునివేళ్లని
కుంచెలుగా చేసుకొని...

ముత్యాల ముగ్గులు
ముచ్చటైన ముగ్గులు
సొగసైన ముగ్గులు
సోయగాల ముగ్గులు
రమణీయ ముగ్గులు
రంగురంగుల ముగ్గులు
అందంగా చిత్రిస్తారు
ఆనందం కలిగిస్తారు..

ఒక వాకిలి ముందు
పిండివెన్నెలను తలపించే ముగ్గులు
ఒక లోగిలి ముందు
హరివిల్లు దిగివచ్చినట్టు రంగవళ్లులు
వెరసి..చూసేవారి
కనుదోయికి కనువిందు చేసే ముగ్గులు...

చిత్రించే చిత్రకారీణులు
తెలుగు తరుణీమణులు
ప్రపంచాన లేరు ఇలాంటి చిత్రకారీణులు
వాల్ల కళాసృష్టి కి జేజేలు
వాల్ల ప్రతిభకు ప్రణామాలు

-బూర దేవానందం
9494996143

సంక్రాంతి లక్ష్మీ రావమ్మా

తెలుగువారి సంస్కృతి
ప్రకృతి తో ముడిపడి
వైజ్ఞానికవిలువలు ప్రోది చేసి ఆరోగ్యాలక్షమి సంక్రాంతి
కాలచక్రం లో ఋతువు హేమంత తో
ఉత్తరాయణ పుణ్యకాలం తో ఆధ్యాత్మిక
శోభించే పండుగ
బొమ్మరిల్లు బొబ్బెమ్మలు
రంగవల్లులు హరికథలు
కోడిపందాలు సమాజీవన సౌరభాలు వేదజేల్లి
ఉమ్మడి జీవన క్రతువు
రైతు లు సిరిధాన్యాలతో
ఆనందంగా కొత్తింటి అల్లుల్లా సరదాలు
జీవిత సత్యాన్ని సంస్కృతి తో
కాలచక్ర ధర్మాన్ని బోధించిన బోధి పండుగ
మన తెలుగువారి సంక్రాంతి కరోనా ,
కరోనా స్ట్రైన్ తొలిగి భ్రాంతి నశించి
కాంతి నింపాలి ఆదిశగా
దశ మార్చే సాంక్రాంతి కావాలి.

-ఉమశేషారావు వైద్య
9440408080

సంక్రాంతికి స్వాగతం

ముంగిట్లో రంగు రంగు ముగ్గులు.
బొడ్డెమలతో యింటికి వచ్చెను కొత్త కాంతి
పచ్చని తోరనాలతో అందంగా అలంకరించుకొని
చలిని పారద్రోలే భోగిమంటల కాంతులతో
పసందైన గుమగుమలాడే పిండి వంటలతో
హరి దాసుల ఆట పాటలతో
రక్తం చెమటగా చిందించిన రైతులకు
ధాన్యరాసుల కుప్పలు నింపిన ధైర్యంతో
ఆకాశం నిండా రంగురంగుల
పతంగులు గాలిలో తేలిపోతూ
యింటి నిండా బంధువులు ,స్నేహితులతో
కళ కళాడుతూ
సందడితో మనసునిండా ఆనందాన్ని నింపుతూ
బోసి నవ్వుల పిల్లలకు పోసిన భోగి పళ్ళుతో
చిన్న పిల్లల చిలిపి చేష్టలతో
కొత్త అలుళ్ల అలకలతో
కొత్త కోడళ్ల కోరికలతో
ఆడపడుచుల ఆటపాటలతో
గంగిరెద్దుల విన్యాసాలతోకోడి పందాలతో
మూడురోజుల పర్వదినాల
సంక్రాంతి వచ్చింది ఆనందలెన్నో తెచ్చింది
మన సంస్కృతి సంప్రదాయాలను
ఊపిరి పోస్తుంది

-అనిత దావత్
9394221927

ఎలా?

ముఖ కవళికలకు
ముఖమల్ మేకప్
పెదవి విరుపులకు
పూతగ లిప్‌స్టిక్!

కళ్ళ కదలికలకు
నల్లద్దాల అద్దుతెర
నెరిసిన కురులకు
వయసు నాపే అద్దకపు పొర!

నిజం మరుగుకు
అబద్దాల జలతారు దారాలు
నమ్మించేందుకు
నటనా చమ్కీల హారాలు!

లోపలి కోణాల్నద్దుకునే
వెలుగు జిలుగుల వేషధారణ
బుద్ధిని మభ్యపెట్టే
అద్దెకు తెచ్చిన సరస సంభాషణ!
ఇన్ని తొడుగుల చాటున దాగిన
మనసును తెలుసుకునేదెలా?
ఇన్ని ముసుగుల మాటున నిలిచిన
మనిషిని కలుసుకునేదెలా? ఎలా?

- ఎస్. కాశింబి
సెల్: 9052216044

సుమ సౌరభాల సంక్రాంతి

అందమైన బంధం
అనుబంధాల సుమ గంధం
సంక్రాంతి సౌరభం.

హేమంతపు సాంగత్యం
ఇంతుల ఐక్యతకు నిదర్శనం.

బంతి చామంతుల పరిమళం
నెలాంతం మధురాతి మధురం.

పల్లె వడిలో
సంబరాల నీడలో
సిరి సంపదల ముంగిట్లో
భోగిమంటలు, పిండివంటల నడుమ
నడయాడే సంక్రాంతి పండుగ.

గంగిరెద్దుల చిద్విలాసం
హరిదాసుల చిందులు విహారం
ముగ్గుల గడిలో పూలతో
గొబ్బెమ్మలతో
పల్లె శోభ వికసించింది.

తుషార బిందువుల తమాషాతో
నులివెచ్చని వేళ పల్లె
తల్లి సంక్రాంతిని స్వాగతించింది.

-చివుకుల వాసుదేవ మూర్తి
9849651444

సంక్రాంతి సంబరాలు...!

నింగి తారలు "ఇల" దిగి
ముత్యాల ముగ్గులేసినట్లు...
హేమంత మేఘాలు కరిగి
పూల వర్షం కురిపించినట్లు ...
బోగిమంటలు దివ్య కాంతులై
మానవాళికి వెలుగులద్దినట్లు ...

పసుపు కుంకుమలు గొబ్బిళ్ళు
సిరి దేవికి స్వాగతం పలికినట్లు ...
రైతు స్వేదం పరాల రాశులై
గాదెల్లో మిలమిల మెరిసినట్లు
సంక్రాంతి పర్వదిన వేళా...
ఊరు ఊరంతా ఉల్లాస మేళా
పరమ పవిత్ర భక్తి పూజలు
పిండి వంటల గుమగుమలు
బంధు మిత్రుల శుభాకాంక్షలు
కొత్త జంటల సరస సల్లాపాలు
విందు వినోదాల సంతసంతో
ప్రతీ లోగిలి స్వర్గాల పందిరి
హరిదాసు భక్తి సంకీర్తనలు
బసవన్న సన్నాయి మోతలు
గాలి పటాల గగన విహారాలు
కోళ్ల పందాల పౌరుష హాసాలు
గంగిరెద్దుల ఆటల విన్యాసాలు
జానపద కళా ప్రదర్శనలతో
అంబరాన్ని ఆంటేను సంబరాలు
ఆనందాల హరివిల్లు ఇల విరిసేను
ఈ సంక్రాంతి వేడుక
ఐక్యమై?.ఆత్మీయమై...
అంగరంగ వైభవంగా జరుపుదాం
మన సంస్కృతి,సాంప్రదయ
ప్రాశస్త్యం విశ్వమెల్లా చాటుదాం

-కోడిగూటి తిరుపతి
9573929493

సంకురాతిరి పండగొచ్చింది

ఆకాశానికి ఎగరాలని ఆశ పడింది
మబ్బులతో స్నేహం చేయాలని
విహంగాలతో పోటీ పడాలని
రివ్వు రివ్వున ఎగురుతోంది.
అడ్డమొచ్చిన వాటితో సై అంటూ
పోటీపడి వాటికి ఆధారంలేకుండ
చేసి సాగిపోతుంది.....
ఆ నీలిగాగనాన స్వేచ్ఛగా ఎగురుతోంది.
ఆధారం ఉందనే భరోసాతో
ఎంత దూరమైనా ఎగరాలనే ఆశతో
వినువీధి అంతా నాదే అంటూ
నెలమీది వారికి వినోదాన్ని
పంచుతూ సాగిపోతుంది
గాలి

కన్నీటి విత్తులై

ఆరు ఋతువులకు
తన జీవితాన్ని అంకితమించ్చి
ఎండనక, వాననక, చలికి వణికి
మట్టిని పులుముకుని...
బ్రతుకు పంట పండిస్తున్నాడు.

పగలనక, రేయనక పరుగులు పెడుతూ
కష్టాల ముళ్ళకర్ర వీపుపై గుచ్చుతున్నా
అప్పుల కంచె చేను చుట్టూ బిగుసుకున్నా
ఆకలి వ్యాధి అంతుకు స్వేదాన్ని చిందిస్తూ
అనునిత్యం పసిడి రాశులను రాలుస్తున్నాడు.

ఆశల చూపుల్ని ఆకాశానికి విసిరి
చినుకు చినుకును వడిసి పట్టి
నేల తల్లికి అభిషేకించి...
కరువు కాటకాలను కౌగలించుకొని
వరదనీటిలో కన్నీటి విత్తులై మొలుస్తున్నాడు.

కౌలు కట్టలేక, తాకట్టు విడిపించలేక
ఆఖరికి ఆలి పుస్తెలమ్మి...
పిచికారి చేస్తున్నాడు
మొక్కవోని ధైర్యంతో దుర్భిక్షాన్ని తరిమి
సుభిక్షానికి ప్రాణం పెడుతున్నాడు.

దళారులకు పంటనందిచి
గిట్టుబాటు ధర లేక, చేతులు నలుపుకుంటూ
ప్రభుత్వాల, ప్రతిపక్షాల మధ్య నలుగుతూ
రోడ్డెక్కి పోరు సలపుతున్నాడు

మనసు పొలాన్ని మళ్ళీ మళ్ళీ దున్నుకుంటూ
సత్తువ లేక చతికిలబడి...
విధాత దేహానికి కౌలు రద్దు చేశాడేమో...?
చేను గేట్టుకే ఉరికొయ్యలా వేలాడుతున్నాడు.

-శ్రీతరం బింగి శ్రీకాంత్
7893613015

నా పల్లె

పొలం గట్లపైన నిలబడే విధానాన్ని నేర్పింది
చెట్లు పుట్టలు తిరిగి ఆహారం పొందే పద్ధతి నేర్పింది
చిర్రాగొనే చార్ పత్తా కోతికొమ్మచ్చి గోటిలాట వ్యాయము నేర్పింది
అకాల వర్షాలు వాగులు దాటడం, ప్రమాదాలను ఎదుర్కోవడం నేర్పింది
చింత పండు కొట్టడం,బెల్లం వండేందుకు పొంటేలు కొట్టడం శ్రమ విలువ తెలిపింది
నా పల్లె
ఆవులు కుక్కలు ఎద్దులు కోళ్ల తొలో మైత్రి భాగమైంది
ఇసుక గుళ్ళు .ఒక పింపరమెంట్ కాకి ఎంగిలి చేసుకొని తిన్న ప్రేమను నేర్పింది
తుమ్మ బంక సేకరించి పుస్తకాలు అంటించడం నేర్పింది
అగ్గి పెట్టెలతో టెలిఫోన్ సంభాషణ నేర్పింది
వాయిలు కొమ్మల తో బాణాన్ని తయారు చేసి ఆడుకోవడం నేర్పింది
పుస్తకాల మధ్య సరస్వతి ఆకులు పెట్టి సంతోషా పడడం అబ్బింది
విధి నాటకాలు తబా ల వాయిద్యం జడకొప్పుల ఆట నేర్పింది
ఇత చాపలు చెట్లకు తాడు కట్టి ఉయ్యాల ఊగడం
చెప్పుకోలేనాన్ని సారాధాలు .బతుకు సారం నేర్పిన నా పల్లె
ఇంటర్నెట్ వాట్సాప్ సెల్లుతో తూట్లు పొడిచింది నా పళ్ళెను
అయిన ఉమ్మడి గా ఊరంతా ఒక్కటిగా కష్టానష్టాల్లో కలసి ఉం డే
నా పల్లె ఆధునికత పేరుతోఉన్నది అంత మార్చి పోతుంది
రియల్టర్లు రెక్కల కింద వ్యాపారవేత్తలు చేతుల్లో అమ్ముడు పోయింది

-ఉమశేషారావు వైద్య

పుస్తక సమీక్ష

'క్రాంతి ప్రభాకర్' బాలల సాహసనవల 'ఆపరేషన్ చాకొలెట్'

'చాకొలెట్' అనే ఆంగ్లపదంలో అక్షరాలలో నిక్షిప్తమైన కోడ్‌ని విశ్లేషించి, స్మగ్లింగ్ ముఠాకు సంబంధించిన క్రిమినల్ గ్యాంగ్ ఆట కట్టించిన సాహసిక బాలల కథనం "ఆపరేషన్ చాకొలెట్" బాల బాలికలనే కాదు పెద్దలను ఆకట్టుకుంటుంది రచయిత, యర్రమిల్లి ప్రభాకరరావు (శాంతి ప్రభాకర్) బాల బాలికలను డ్రగ్ ఉచ్చులో దింపి, వాళ్ళ అమాయక నిస్సహాయ జీవితాలలో చిచ్చుపెట్టే నేరస్థుల ముఠాల గుట్టును బాల బాలికల చేన రట్టు చేయించే ఇతివృత్తాన్ని ఒక సాహసిక నవలగా అద్భుతంగా రచించారు. ముందు మాటలో, ప్రముఖ కవి, సామాజిక సేవా తత్పరులు డా॥సమ్మన్న ఈటెల పేర్కొన్నట్టుగా విద్యార్థులలో సామాజిక స్పృహ కలిగించే పరిశీలనాత్మక, పరిశోధనాత్మక దృష్టిని పెంపొందింప చేయటానికి రచయిత సృష్టించిన కల్పనా చమత్కృతి, సత్యషి సఫలీకృతమైంది. నవ్వుతూ, త్రుళ్ళుతూ, కేరింతలు కొడుతూ ఇంటా, స్కూలలో తిరిగే సీతాకోకి చిలుకల్లాంటి అమాయక బాలలు సాధారణంగా చాకొలెట్‌లంటే ఇష్టపడతారు. చాక్‌లెట్స్‌లో వుండే పది అక్షరాలను డకోడ్ చేసి ఒక మొబైల్ నెంబరు నుక్కోవటం, దేవాలయంలో అపురూప విత్రహాలను దోచుకొనే ఒక ముఠా, గూడుపుఠాని బట్టబయలు చేసే సాహస

కృత్యానికి బాలబాలికలు తలపడటం, అసాధారణ నేర పరిశోధనగా చదివింప చేస్తోంది. విద్యాసక్తి, అసాధారణ నేర పరిశోధనగా చదివింప చేస్తోంది.

విద్యసక్తి, అత్యంత ప్రతిభతో ఉత్తీర్ణతతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతలే కాకుండా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాల బాలికలను సాహసవంతమైన, సామాజిక ప్రయోజనం కలిగించే భవిష్యత్తు వైపు నడిపించవలసిన ఆగత్యం ఈ నవల ప్రదర్శిస్తోంది. మొబైల్ ఫోన్‌ల వంటి అధునాతన సాంకేతికత, లేత వయసులోని బాలబాలికలను కూడా ప్రస్తుతం ఆకట్టుకొంటోంది. పోలీస్‌శాఖ ప్రభుత్వపరంగా అధునాతన సాంకేతిక ప్రజ్ఞను సద్వినియోగం చేసుకొని ఎన్నో నేర రహస్యాలను ఛేదించగలుగుతోంది. నవలా రచయితగా యర్రమిల్లి ప్రభాకరరావు, బాలలు ధైర్య సాహసాలు, తెలివి తేటలలో పెద్దవారికి తీసిపోరని నిరూపించే విధంగా ఆసక్తికరంగా కథను, నవలగా నడిపించారు. కథ, నవల, కవిత, వ్యాసాలు వివిధ ప్రక్రియలలో తెలుగు, ఆంగ్ల, హిందీ భాషలలో సాహితీ కృషి చేస్తున్న రచయిత శాంతి ప్రభాకర్ అభినందనీయులు.

ప్రతులకు: యర్రమిల్లి ప్రభాకరరావు
23-9-3, కంభంపాటి వీధి
సజ్జాపురం తణుకు (.గో.గో.జిల్లా).
ఆంప్ర-534 211
సెల్: 91607 64861

-జయసూర్య
సెల్: 9440664610

పక్షి రోగం ?!

తూర్పు
తూర్పారాబట్టినట్లు పేరుకేనా -
సూర్యుడు ఉదయించగలడా
ఝాము ఝాము జాగృతం చేసే
తురాయి కోడి రాజుకే రోగం
బాకా గొంతు పీకల దాక
పడి పోయింది
భానుడికి నిద్ర మబ్బే ?.

జల స్తంభన
జలకాలాటల బాతుకూ బడారోగం
గుంపుల బాతుల పై
గంప గుత్త మృత్యువు !

కాకి సోపతి కటీప్
పితృ దేవతల పిండం
సద్గతులుగా ముట్టేదెవరు ?
కాకులకూ కాని కాలం
శకున పక్షులకే అప శకునం.

మనిషి సహవాసి
పక్షికీ పాడురోగం
"బర్డ్స్ ఫ్లూ" - రెక్కలు తెగిన నింగి

ఆదివారం వంటింట్లోకి
కోడికి ప్రవేశం లేదు --
వంటింటి ముందు పుర్రె గుర్తు
ఫోర్కులూ మూతి ముడుచుడే

స్టార్ హోటల్ మూకుట్లో గోలని
కోడి జన్మ వ్యర్థం

ధర రెక్కలు తెగి పడింది ----
గొంతు జారే చుక్క విందుకు
చికెన్ విరహం ??

కొత్తకొత్త -- పాతపాత రోగాలు
విప్లవంగా తిరగబడుతున్నాయి
పక్షి ముద్దు కాదు
మనిషీ ముద్దు కాదు
కరోనా - బర్డ్స్ ఫ్లూ జుగల్ బందీ !

పదండి !
మన రెక్కలకు
పక్షులను కట్టుకుని
ఆరోగ్య అరణ్యాల్లోకి పోదాం --
మన ఆదిమానవ తాతల వలె
జలపాతాల మందు
హఠంతో పీటం వేసుకుందాం
ప్రకృతితో మమేకమౌదాం
కలుషిత నగరాలు పాడుపడిపోనీ
కొత్తగా అంతం కాని కల్పం మనదే

పక్షి బతకాలి
మనిషి బతుకాలి
మనిషి వేయి రెక్కల బలంతో
భూమిని గ్రహాలను
గుండ్రంగా తిప్పుతూ రాజ్యమేలాలి
సర్వేజనాంపక్షినాం సుఖినోభవంతు

- కందాళై రాఘవాచార్య
8790593638

గోడ

పువ్వులను పలకరించాను
పుడమి పులకరించింది
నవ్వులను వెదజల్లాను
అనుమానం మొలకలేసింది.

గాలిని పలకరించాను
గాఢంగా హత్తుకుంది
మనిషికై చేయి సాచాను
అడ్డుగోడ ఆపేసింది

చెట్టును పలకరించాను
నాలుగు పూలను రాల్చింది
మళ్ళీ మనిషికై వెతికాను
ఈసారి గోడ నాచుట్టూ మొలిచింది.

-సి.యస్.రాంబాబు
8374818961

కొత్త ముగ్గు

కాలంవాకిట్లో
చుక్కలెంత చక్కగ పెట్టినా
లెక్క తప్పుతోంది
చెమట చుక్కలెన్ని చిందినా
కన్నీటి ధారల ముగ్గులుగానే
రూపుకడుతున్నాయి.
బళ్లకెత్తాల్సిన పంట చేను
చట్ట చలికి
మడి చెక్కలోనే ముడుచుకుంది.
దుక్కి దున్నాల్సిన చేతులు
నాగలిని నడిపించాల్సిన కాళ్లు
రోడ్ల మీదికి ప్రవహించి
చలి మంటల ముందు
పోరాటాన్ని
కాపడం పెట్టుకుంటున్నాయి .
ఆకుపచ్చని దేశానికి పట్టిన
చట్టాల చలినొదిలించేందుకు
నడిరోడ్డు మీద రైతులు
నెగళ్లయి రాజుకుంటున్నారు.
దూడూ బసవన్నల
తల ఊపుళ్లు కాదిపుడు
పోడు భూమిని
పంట సాళ్లుగా దున్నేసే
ఎద్దు శౌర్యం.
పంటలను బళ్లకెత్తి పరవశించే
హరిత విప్లవం కాదిప్పుడు
హక్కుల కోసం పిడికిళ్లెత్తి
పంటల్ని పరిరక్షించుకునే
కొత్త ఉద్యమం మొదలైంది.
ఇక చుక్కల లెక్క తేల్చి
రాజ్యం ముంగిట
కొత్త ముగ్గేయాల్సిందే!

- చిత్తలూరి
8247432521

ఓ యువతా..

మంచిని పెంచు...
మంచిని బోధించు..
మంచిని పంచు...
మానవత్వంతో నడుచుకో...
యువకులారా మేల్కొనండి !
సేవాదృక్పథంలో ప్రయనిద్దాం...
సేవాభావంతో మెలుగుదాం...

-డా.తెలుగు తిరుమలేష్
9908910398

సామాజిక చైతన్యం ...అలిశెట్టి కవిత్వం

సమాజ వాస్తవికతను మినీ కవితల ద్వారా కళ్లముందు ఉంచిన కవి అలిశెట్టి ప్రభాకర్. కళ్ళముందున్న ప్రపంచాన్ని కవితా వస్తువులుగా స్వీకరించి తన కవితలతో నేటి సమాజానికి దిక్సూచిగా నిలిచి తన కవిత్వంతో అందరినీ మంత్రముగ్ధులను చేసి ప్రతి అక్షరంలో నూ వాస్తవికత ఉట్టిపడేలా రాసిన ధైర్యశాలి. మరణం దగ్గరకు వస్తున్న లెక్కచేయక మరణం నా చివరి చరణం కాదు అని ఎలుగెత్తి చాటిన గొప్ప కవి. జీవితంలోని అనుభవాలను కవితా వస్తువుగా మలుచుకుని రాసిన కవిత్వం ప్రతి గుండెను తట్టి లేపుతుంది . ప్రక్రియలకు అతీతంగా వ్రాసిన వచన కవిత్వం పాఠకులని కట్టిపడేస్తుంది. అక్షర సాయుదం చేసి అన్యాయాలపై పాట తిరుగుబాటు ధ్వజమెత్తాడు.హింసా రాజకీయాలు నిరసించి ధ్వంసమైపోతున్న విలువలను కాపాడమన్నాడు . అందుకోసమే తన కులాన్ని అస్త్రంగా చేసి మినీకవితల తో ఒక చరిత్ర సృష్టించాడు .అలిశెట్టి ప్రభాకర్ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్లుగా కవితలు రాశారు అందులో 418 కవితలు సిటీ లైఫ్ పేరుతో 1992లో అచ్చువేశారు. ఎంతో క్లిష్టమైన భావాలను సామాజిక దృక్పథంతో రంగరించి అశేష పాఠకులను సంపాదించుకున్న ఆయన కవిత్వం చిరస్మరణీయం . తన కవిత్వాలను వారి మిత్రులు 7 కవితా సంపుటాలను ఒకే పుస్తకంగా వెలువరించారు.ఆ పుస్తకమే "అలిశెట్టి ప్రభాకర్ కవిత" నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ చే ప్రచురించారు.

1)ఎర్రపావురాలు 2)మంటల జెండాలు 3)చురకలు 4) రక్తరేఖ 5)సంక్షోభ గీతం 6)సిటీ లైఫ్ 7)మరణం నా చివరి చరణం కాదు ...

అనే కవితా సంపుటాలు అలిశెట్టి ప్రభాకర్ అంతరంగాన్ని తెలుపుతాయి.

"ఎర్రపావురాలు" సంపుటిలో 46కవితలు ఉన్నాయి. పెయింటింగ్ కవిత " నీ లైఫ్ ను బ్యూటిఫుల్ పెయింటింగ్ గా మార్చుకోవడానికి.. అట్రాక్టివ్ కలర్ రెడ్ కొరకు రక్తం మాత్రం ఎవరిది ఉపయోగించకు. తన జీవితం రంగులమయం చేసుకోవడానికి ఇతరుల జీవితాలతో ఆటలాడుకోవద్దు" అని స్పష్టంగా తెలిపిన సహజకవి. "సౌందర్యం కాలిపోయి మిగిలిపోయిన బూడిద అని తెలిపిన కవి "ఆశ .. విత్తనం లేకుండా పెరిగి మొక్క యొక్క శ్వాస" "నిరాశ .. నాభిలేనీ ఊభిలో దిగ బడక ముందేపొందే ప్రయాస" అని ఆశనిరాశల గురించి రెండు ముక్కల్లో తేటతెల్లం చేసిన కవి . "దేశం కోసం.. ఒక రాత్రి నక్షత్రాలు కళ్లలోకి చూస్తుంటే నేను చూస్తున్నాను నా గుండెల్లో చెబుతున్నాను నా దేశం చిక్కని చీకటి లో ఒక చుక్క 'చుక్కనై మెరవాలని ఉందని" ఇలా అణగారిన బతుకులు,విమర్శలు ఆకలి తెలియజేస్తుంది.

"మంటల జెండాలు" సంపుటిలో 34 కవితలున్నాయి."కుంచె నుంచిప్రవహించే చైతన్యం.. పారితోషికమే జీవనాధారంగా చెప్పిన కవితలు.. గుండె సైన్యం,బిందువు అనంతం,మొక్కల ద్వారా సమాజ పరిస్థితులు తెలియ జెప్పారు . "చీకట్లో జడచుకుంటే ఒక చెట్టే నీ చుట్టూరా అరణ్య మై భయపెడుతుంది" "గుండెంటూ కలిగుంటె నీ వెంట అదే పెద్ద సైన్యమై నిలుస్తుంది"అని తెలిపారు.

"చురకలు" కవితా సంపుటిలో సమాజంలో జరిగే ప్రతి ఒక్క అన్యాయంపై చురకలు సంధించారు. ఇందులో 66 కవిత లున్నాయి "టోపీ ..ఎన్నికల్లో ఓట్లు అడుక్కునే చిప్ప" ఇలా పీనుగలు, చీమ,చందమామ, కవిసమ్మెట,మొదలైనవి రూపొందించారు.

"రక్త రేఖ" కవితా సంపుటిలోన 38 కవిత లున్నాయి. ఇందులోఈతరం క్రీస్తు ,ఆకలి ,అగ్ని,సముద్రం , అరాచకత్వం ,గాయం,సభ అనే కవితలు కాలే కడుపు, రగిలే గుండెకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

"సంక్షోభ గీతం" ఇందులో 14కవితలున్నాయి . "సూర్యుడే నా ముఖచిత్రం.. జ్వలించె అక్షరం" అంటూ దృశ్యం,నాటు తుపాకి,వంటి కవితలు వాస్తవికతకు అద్దం పడుతాయి.

"సిటీ లైఫ్ "కవితా సంపుటిలో 417 కవితలున్నాయి. ధ్వంసమై పోతున్న సమస్త మానవ విలువల్ని కంటికి కట్టినట్లుగా కవితల్లో చూపించారు.

"మరణం నా చివరి చరణం కాదు" సంపుటిలో 36 కవితలు ఉన్నాయి. వేదనాభరితమైన ఈ కవిత అక్షరాలను చదివిన ప్రతి ఒక్కరి గుండె బరువెక్కుతుంది. మరణం అంచుల్లో సైతం విధికి ఎదురొడ్డి తన కవిత్వాన్ని వినిపించగలిగే ధైర్యం కేవలం అలిశెట్టి ప్రభాకర్ ఉంది. చిన్న వయస్సు లోనే ఆయన మరణించి 25 సంవత్సరాలు గడిచినా ఆయన కవిత్వానికి మాత్రం మరణం లేదు. తనదైన పంథాలో హృదయాన్ని తట్టి లేపే శక్తి మాత్రం అలిశెట్టి గారి సొంతం. శ్రీ శ్రీ గారి తర్వాత సామాన్యుడిని తన కవితా వస్తువులుగా స్వీకరించి జనుల మదిలో చెరగని ముద్ర వేసిన నిత్య చైతన్య శీలి అలిశెట్టి ప్రభాకర్ . క్షీణిస్తున్న ఆరోగ్యం సైతం లెక్క చేయక ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా కవిత్వమే పరమావధిగా జీవించిన యోధుడై , అందరికీ మార్గదర్శకుడై అందరి హృదయాల్లో నిలిచాడు. ఏ రోజు అయితే జన్మించారో అదే రోజున మరణించిన గొప్ప అమరజీవి. అలిశెట్టి గారు చనిపోయి మూడు దశాబ్దాలు గడుస్తున్నా మినీకవితలు నిత్య పరిమళాలు వెదజల్లుతూ ఎందరో కవులకు మార్గదర్శకాల అవుతున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.

(జనవరి 12 అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)

-సునీత బందారు
9440671530

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 'అలక' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'అలక' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. - సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, *9441046839*

బంగమూతి

అలక
అనురాగానికి
అనుబంధ దృఢత్వానికి ప్రతీక
లింగ భేదం పరుస భేదం లేదు!!

నాన్నమ్మ అలక
మనవడి బంగమూతి
ప్రియురాలి కినుకలో
అందం ఆనందం!!.

అలకతో
మూతి ముడిచి
దుప్పటి బిగించి
తనకే స్వంతం అనుకున్న
శ్రీ కృష్ణునిపై అలిగిన సత్యభామ
పాదాల చెంత చేరిన ప్రియుడు
పారిజాత వృక్షాన్నే పెకిలించి
తీసుకొచ్చి అలకను తీర్చిన స్థితి
ఆ దేవునికే తప్పని పరిస్థితి!!

అలకలతో వగలు పోయే కళ
చిన్ని కిట్టయ్య యశోదమ్మపై
అలుక ముద్దులతో
చేరదీసిన తల్లి!!

చిన్నారుల అలకతో
బుగ్గల్లో సిగ్గుల మొలకలు
కన్నతల్లికి మురిపాలు!!

వరుని అలక తీర్చిన మామ
వివాహంలో సంబరం
అలకలలో ముసిముసి నవ్వులు!!

ఇరు హృదయాల
సాన్నిహిత్యానికి అలక
ఒక సంజీవని
ఆనందాల వేడుక
ఆప్యాయతకు వారధి
మురిపెం గారాబానికి
చిరునామా!!

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి,
9110347693

అలక ఆయుధం

అమ్మపనిలో ఉండి
బువ్వ ఆలస్యమైతే
పసివాడి అలక
అమ్మప్రేమ కావాలన్నా
అలిగి బుంగమూతి
అమ్మ ఆర్తిగా అక్కున చేర్చుకుంటే
అలకమాని కిలకిలా నవ్వులు
పంతం నెగ్గించుకోటానికే ఈ ఆయుధం.

కొందరు పెద్దలకూ ఇదే అస్త్రం
అలక అతివల ఆయుధం
అంటూ విజ్ఞుల గేలి
మరి ఆ విజ్ఞులే అలుగుతారెందుకో !
గడుసుగా పంతం నెగ్గించుకుని
గర్వంగా ముసిముసిగా నవ్వుకుంటారు
పసివాడి అలక
తల్లి కి మోదం
పెద్దల అలక
మనో దౌర్బల్యానికి నిదర్శనం !

-మోటూరి శాంతకుమారి,
8106790978

అలక

కం. అలకలు వయసును తరుణము
నెలవులతో ఫలములిడును నిజమగు విధమున్
చిలుకల పలుకుల పాపల
కలకలతో వత్సలత్వ గారవమందున్!!

కం. కలలకునలకలుసుఖమై
మొలకలతో పులకలగునుముద్దుల కొలువై
జలకము లాటలు పాటల
కిలకిలమనినవ్వుగల్గు కేరింతలుగా!!

కం. చిరుకోపమునలకలుగా
తిరునాళ్ళను గుర్తుచేయు తేలిక పనులన్
చులకన మాటలు చేష్టలు
మురిపెముతో మూతివిరుపు మోహపుటలకా!!

కం. అల్లుడు,కోడలి యలకలు
చెల్లెలు యనుబంధమందుస్నే నీళ్ళుహపు మొలకల్
తల్లీ పిల్లల చల్లని
యుల్లములోనలకపెంచునుత్సాహమ్మున్!!

-మాడుగుల నారాయణ మూర్తి,
9441139106

అతివకు అందం

చీర కొంగుతో వేళ్లు కోపంగా తిప్పుతూ..
పండ్లనేమో పట పటా నూరుతూ
పెదాలతో పదాల దండకం చదువుతూ
చిలకముక్కు కాస్త రంగుమారి
ముద్దుమోము మరీ.. ఎర్రబారి
అలకతో ఉన్న అతివ అందమే వేరు..

నచ్చిన చీర తెస్తే మురిసిపోతుంది..
మూరెడు మల్లెలతో మెరిసిపోతుంది
అర్థం చేసుకుంటే ప్రేమ పంచుతుంది..
కట్టుకున్న వానికి ప్రాణమిస్తుంది
అలక అతివకు అందం
కరిగిపోవును కదా
ఆమె అలకతో మగవాని డెందం.

-లక్ష్మీ పెండ్యాల,
7893302534

చెలియ అలక

అలక ఏలనే బాల
నాపై ఇంత కోపమేలనే చెలియ
తారసపడలేదే చెలియ
నీవంటి తారామణెక్కడ
నే వినలేదే నీవంటి స్వరం
భూమండలముపై నెక్కడ
అలకమాని చెంత చేరవే
మధుర దరహాసాలతో
మృదు మధుర వచనాలతో
భాషించవే చెలియ
ఓ నా సఖియా
నీతోడిదే లోకమై విహరించాలని
నీ ఆప్యాయత అనురాగాల వర్షంలో
తడిసి ముద్దవ్వాలని
ఉవ్విళ్లూరుచున్నదే నామది
అలకమాని చెంత చేరవే
కలికి చిలుకల కొలకి
వయ్యారీ హంసనడకల భామ
నిను చూడక నీతో మాటాడక
నిమిషమైనా నిలవలేనే
వెచ్చని నీ శ్వాస చాలే చెలీ
నీలో నేను లీనమవ్వడానికి
చెదరని నీ వాలు చూపే చాలే
నన్ను నేను నీలో చూసి తరించడానికి
అలకమాని చెంత చేరవే చెలీ.

-పి.విజయ రాఖి,
9959154032

ప్రేమ గీతం

అలక
ఓ భావం ఓ సందేశం
ప్రేమకు సంకేతం
మనసు మౌనరాగం.

ప్రేమల మధ్య మధురమైన మెలిక
నోరు విప్పని పెదవి వెనుక దాగిన వయ్యారం
అపార్థాల వెనుక అర్థం
అడగాలని వున్నా
అడగలేని అలజడి.

మాటలవెనుక దాగిన మౌనం
వెన్నెలలాంటి మధుర భావం
అలక ముఖంలో అందమైన భావాలు
కుటుంబ అనుబంధ
ఆత్మీయ అనురాగాల ప్రతీక

కావాలన్నదీ ఇవ్వకుంటే
పిల్లలు అలక
మనసు నొప్పిస్తే
పెద్దల కోపానికి ఆల్టర్నేట్ అలక

అలక కోపం రెండూ
ప్రేమలోనే ముడివేసే స్నేహ బంధం
అలకకు విరుగుడు మందు ఆలింగనం.

ప్రేమగా పలకరిస్తే ఆవిరి
చిరునవ్వుతో చూస్తే ఆగే చిరుజల్లు
మెచ్చుకుంటే కరిగిపోయే మంచుగడ్డ

అక్కున చేర్చుకుంటే
తీరం దాటిన అల
ప్రీతిగావుంటే పరిమళాల పారిజాత పుష్పం
భార్యాభర్తల అలక
లేకుండా సాగదు జీవితం

శ్రీకృష్ణుడికే తప్పని అలక గోస
తప్పని పాద సేవనం
అలక మనుషులకు వున్న
మనోభావాల ప్రత్యేక వరం
ఏడుస్తూ సాధించేకంటే
అలిగి ఆస్వాదించు.

- డా. భూంపల్లి కేశవరెడ్డి,
9848473099

అలక ముద్దు

ఆ. వె. అలక ముద్దు గాద అతివల మోమున
భాగ్యమలక దీర్ప భర్తలకును
అలకలేకయున్న అదియెట్టి కాపురం?
మమత బెంచునాలుమగల అలక.

కం. అలకలు బోయెడు చిన్నా
రుల చిరుబుగ్గల నిమిరి మురువంగ నామా
టల జెప్పుచు మురిసెడి వా
రల యమ్మానాన్నలమది రంజనమొందున్.

-సౌదరి మోహన్ గౌడ్,
9440464503

సత్యాకృష్ణుల అలక

అలకేలనే సత్య
అందాల నా చెలియ
కినుకేలనే రమణి
నీ విభుడు ప్రార్థింప ॥అలకేలనే ॥

అందచందము లోన
అరవిందవే నీవు
ఆణిముత్యమె నీవు
అపరాజితవే నీవు
అన్ని లోకములేలె
ఆది పురుషుడ నేను
గోపాలుడ నేను
గోవిందుడనే నేను
నా ప్రియామృతమై
నను పాలింపవే ॥ అలకేలనే ॥

నీ కన్న నా ప్రియము
జగతిలోనే లేరు
నిను మించి వేరేవరు
యోధులే లేరు
నా ప్రాణమే నీవు
నా దేవివే నీవు
నీవాడనే నేను
అలక మానవె సత్య ॥ అలకేలనే ॥

స్వర్గలోకము నుండి
పారిజాతము తెస్తి
నీవు కోరినవన్ని నేతెచ్చి నీకిస్తి
నిన్ను కొరినవాన్ని
మన్నించు నా మాట
అలక మాని
నన్ను మురిపించవె
సఖియా ॥అలకేలనే॥



-ప్రభాకర్ రావు గుండవరం,
9949267638

చిలకల కొలికి

అలిగి తొలగకే ఓ చిలకల కొలికి
మూతి తిప్పకలా
మరువపు మొలక!!

నీ అలకల కులుకుల సోయగాలలో
నీ ముద్దుల మోము చిన్నబోయెనే
వెండి వెన్నెలలు కురిసే
జాబిలి నీలాల మబ్బులో దాగేలాగా
తేనియలొలుకు నీ పెదవి గిన్నెలను
శిరోజాల తెర చాటున దాచకే!!

నీలికలువల
నీ నయనాల రెప్పలను
అలక బుసలతో మూసి వేయకే
తేనె పాత్రను పారవేయకలా
బ్రతుకులో శాంతిని నెట్టివేయకే!!

చిరుచిరు అలకలు అంతై ఇంతై
సత్యభామలా రచ్చకీడ్వకే
ఓ భార్యామణి!!

నేనసలే సామాన్యుడుని
వాసుదేవుడిని కానేకాదు
అలకలు గిలకలు పక్కకు నెట్టి
చల్లని నీ మది వసంతము లోన
స్నానమాడనీ ఓ చెలియా
తరించి పోనీ ఓ చెంగల్వా!!

-కాశినేని గీతాదేవి,
9346866304

తీరే మార్గం?

అలకలు తీరిన కన్నులు ఏమనే ప్రియా...
చక్కని ఆలాపనతో పాతపాట.
జంటకు మాత్రమే తెలిసిన అలక కారణం..
తీరే విధానం కూడా... !

బుజ్జిపాపాయి అలక బొమ్మలతో సరి
బొమ్మగారి అలక భక్తి సినిమాతో..
లేదా మనవళ్ల గారంతో!
మనసు విప్పి చెప్పే మిత్రమా..
నీ స్నేహపప

- ఎం. వి. ఉమాదేవి,
7842368534

రక్షకభట (పోలీసు) శతకం

-హెచ్.ఆర్.చంద్రం
9493248053

పూనుకొంటి నేను 'పోలీసు శతకము'
వెలువరించ నాటవెలదులందు;
అందరికిని నచ్చు నాటవెలది యన్న,
రక్షకభట మిత్రులార, శుభము!

గతమునందు నెవరు శతకము మిము గూర్చి
వ్రాసియున్న దాఖలాలు లేవు;
కాంచలేదు నేను,కలదంచు వినలేదు!
రక్షకభట మిత్రులార, శుభము!

ఇంతవరకు నేల నే కవియును శత
కమ్ము వ్రాయలేదొ మిమ్ము గూర్చి?
పోనిలెండు,నేను పూరింతు నా లోటు!
రక్షకభట మిత్రులార, శుభము!

ప్రజల వాడ్క నున్న పదము 'పోలీ', సాంగ్ల
మైన నేమి,తెలియు నందరికిని;
'రక్షకభటు'లన్న ప్రజలెల్ల నెరుగరు,
రక్షకభట మిత్రులార, శుభము!

మొదటి మెట్టు పీసి, తుది మెట్టు డీజీపి,
ఇరువురికిని నడుమ నింక కొన్ని
కలవు మెట్టు, లన్ని కలసియే'పోలీసు'!
రక్షకభట మిత్రులార, శుభము!
(పీసి=పోలీస్ కాన్ స్టేబుల్;
డీజీపి=డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్)?

వేద కాలముననె ఈ దేశమున నుండె
రక్షణవ్యవస్థ ప్రస్ఫుటముగ;
ప్రజలు బ్రతుక గలరె రక్షణ లేకున్న?
రక్షకభట మిత్రులార, శుభము!

చాల ముఖ్యమైన శాఖ మీది ప్రభుత్వ
మందు, నందు లేదు సందియమ్ము;
సాగు నెట్లు రథము సారథి లేకున్న?
రక్షకభట మిత్రులార, శుభము!

అచ్చు గుద్దినట్టు లగుపించు మీ రూపు
మనసులోన తలచుకొనిన యంత;
టోపి,లాఠి,ఏకరూప దుస్తులు,బెల్టు!
రక్షకభట మిత్రులార, శుభము!

గుర్తు పట్టవచ్చు గుంపులో నున్నను
రక్షకభటుల నెవరైన గాని;
ఏకరూప దుస్తులే మిమ్ము పట్టిచ్చు!
రక్షకభట మిత్రులార, శుభము!

ఏకరూప దుస్తు లెందరి కున్న, పో
లీసు వేషమునకు లేదు సాటి;
లాటి,టోపి,బెల్టు,బూటు ప్రత్యేకాలు!
రక్షకభట మిత్రులార, శుభము!

పొట్టి నిక్క రుండె పోలీసు కొకనాడు,
తొడుగసాగె పిదప పొడుగు ప్యాంటు;
కలుగుగాదె మార్పు కాలక్రమమ్మున!
రక్షకభట మిత్రులార, శుభము!

చేతిలోని లాఠి శిక్షించుటకె కాదు,
న్యాయ మార్గమందు నడుపుటకును;
ఉపకరించు నద్ది ఉభయతారకముగా!
రక్షకభట మిత్రులార, శుభము!

ధైర్య సాహసాలు,దైహిక దార్ఢ్యమ
ర్హతలు రక్షకభటుల కగు గాన,
పనికిరారు పిరికిపందలు,దుర్బలుల్;
రక్షకభట మిత్రులార, శుభము!

రక్షకభటు లన్న ప్రజలకు రక్షకుల్,
ప్రజకు మేలుచేయు వారు మీరు;
అందువలన మీరు వందనీయులు మాకు!
రక్షకభట మిత్రులార, శుభము!

శాంతి భద్రతలకు సంరక్షకులు మీరు,
ప్రజలు సతము మొక్కవలయు మీకు;
మీరు లేనియెడల నేరాలు, ఘోరాలె!
రక్షకభట మిత్రులార, శుభము!

పగలు రేయి అనక,బాధ్యతాయుతముగా
పనులు చేయుచుండు ఘనులు మీరు;
వెరపు తగదు మీకు విధి నిర్వహణమున!-
రక్షకభట మిత్రులార, శుభము!

గుంపు లుండు చోట గొడవ లుత్పన్నమౌ,
సద్దవలయు వాని నాదిలోనె;
అప్రమత్తు లగుచు నట నుండవలె మీరు!
రక్షకభట మిత్రులార, శుభము!

చేయుచున్న పనికి జీతమ్ము గొనుచున్న,
తృప్తి పొందగల్గు వృత్తి మీది;
ప్రజకు మేలుగూర్చు పని ప్రశంసార్హము!
రక్షకభట మిత్రులార, శుభము!

ప్రజల నడుమ కేగ ప్రాణభయము నాయ
కులకు, వారి కాయవలయు మీరు;
వారి కడుగు పడదు మీ రక్షణము లేక!
రక్షకభట మిత్రులార, శుభము!

నాయకులకు కాపు కాయుటయే మీకు
వృత్తియందు ముఖ్య విధిగ మారె;
ప్రజల జూచి భయముపడ నేల ప్రతినిధుల్?
రక్షకభట మిత్రులార, శుభము!

ఆరుబయట తిరుగలే రొక్క క్షణము నా
యకులు, వారి కేలొ అంత భయము?
ఆయుధములు దాల్చి అనుసరింతురు మీరు!
రక్షకభట మిత్రులార, శుభము!

ప్రజల సేవ కన్న,ప్రజ లెన్నుకొన్న నా
యకుల సేవ లధికమాయె మీకు;
వాస్తవమ్ము కాద ప్రజ లాడుకొను మాట?
రక్షకభట మిత్రులార, శుభము!

న్యాయ మెట్టు లున్న, నాయకులకు మీ రొ
సర్చు సేవ ప్రజకు నచ్చకుండె;
పప్పు మెప్పు గొనునె ఉప్పెక్కు వైనచో?
రక్షకభట మిత్రులార, శుభము!

ఈ ప్రపంచమందు నే దేశమైన ర
క్షకభట రహితముగ కానబడదు;
బ్రతుక నవసరమ్ము రక్షణ యెందైన
రక్షకభట మిత్రులార, శుభము!

వ్యక్తిగతములైన శక్తియుక్తుల బట్టి
వృత్తి నైపుణమున నెచ్చు తగ్గు
కానవచ్చు, నవ్వి గణనీయములు కావు!
రక్షకభట మిత్రులార, శుభము!

ప్రజల నడపుచేయ బహిరంగ సభలలో
నుండవలయు మీరు ఖండితముగ;
సక్రమముగ సభలు జరుగునా లేకున్న?
రక్షకభట మిత్రులార, శుభము!

రెచ్చి కార్యకర్తలే ముందుగా సభ
లందు గొడవ చేయుచుండు, రట్టి
వారినెల్ల మీరు వారించవలె గదా!
రక్షకభట మిత్రులార, శుభము!

ఎంత చేయుచున్న నేలనో నాయకుల్
నోరు తెరచి మెచ్చలేరు మిమ్ము;
పక్షపాతు లంచు ప్రతిపక్షు లందురు!
రక్షకభట మిత్రులార, శుభము!

పాలకులకు మీరు పాలేరు లని ప్రతి
పక్ష నేత లనుట పాతపాట;
లక్ష్యపెట్టబోరు ప్రజ లట్టి 'కూతలు'!
రక్షకభట మిత్రులార, శుభము!

పాలకులను తిట్టు ప్రతిపక్ష నేతల
కళ్ల కెపుడు మంచి కానబడదు;
మెచ్చు రెపుడు వారు మిమ్ము,నిందింతురు!
రక్షకభట మిత్రులార, శుభము!

కొంతమంది నాయకులు పని లేకున్న
తిరుగుచుందు రూళ్లు తరచు,నట్టి
వారి తీరువల్ల పని భారమగు మీకు!
రక్షకభట మిత్రులార, శుభము!

అంటురోగ మట్టు లన్ని శాఖలలోను
లంచగొండితనము ప్రబలియుండె;
అందు మీరును మినహాయింపు కాబోరు!
రక్షకభట మిత్రులార, శుభము!

తలచుకొన్న మీరు'ఖలనాయకుల' భర
తమ్ము పట్టలేర? తప్పకుండ
పట్టగలరు, గాని పట్టబో,రదె వింత!
రక్షకభట మిత్రులార, శుభము!

వార్డు సభ్యుడైన వాడు కాజాలడు,
కదనుదొక్కు కార్యకర్త ననుచు;
వాడుగూడ మిము దబాయించ జూచును!
రక్షకభట మిత్రులార, శుభము!

రాజకీయు లిపుడు ప్రతిశాఖ పనిలోను
వేలుపెట్టి కెలుకు విధము గలదు;
సక్రమముగ పనులు జరుగనీయరు వారు!
రక్షకభట మిత్రులార, శుభము!

న్యాయ మార్గమందు నడచు మీపై నొత్తు
డులను తెచ్చి, దారి తొలగజేయు
స్వార్థ కార్యశూర సంపన్ను లెందరో!
రక్షకభట మిత్రులార, శుభము!

ఒకరి మేలుకై మరొకరిని శిక్షించు
పద్ధతులకు స్వస్తి పలుకవలయు;
కాయవలయు మీ రమాయకులను గాద!
రక్షకభట మిత్రులార, శుభము!

సర్వ శాఖలందు సన్మార్గవర్తులు,
దారితప్పి నడచువారు నుందు;
రందు కేదియు మినహాయింపు కాబోదు!
రక్షకభట మిత్రులార, శుభము!

నీతి న్యాయ మనుచు నిలుచు పోలీసుకు
తరచుగ బదిలీలు తగులుచుండు;
న్యాయమును భజి(రి)ంచు నాయకు లెందరు?
రక్షకభట మిత్రులార, శుభము!

తమకు నచ్చువారి స్థానిక నేతలు
వెడలనీయ రూరు విడిచి, వారి
బదిలి నిలుపగలరు పైవారితో చెప్పి!
రక్షకభట మిత్రులార, శుభము!

విర్రవీగుచుందు వీధి రౌడీలకు
కళ్లెములను వేయగలరు మీరు;
కాక,వారి నాపగల్గువా రెవ్వరు?
రక్షకభట మిత్రులార, శుభము!

చాల లొసుగు లుండె పోలీసు శాఖలో,
వాని నెల్ల చక్కబరచ వలయు;
ముందు రాజకీయమును నడ్డుకొనవలె!
రక్షకభట మిత్రులార, శుభము!

లక్ష్యపెట్ట నవసరము లేదు, పోలీసు
వారు రాజకీయ 'బేరగాళ్ల';
ప్రతిఘటించ వలయు వారి జోక్యము నెల్ల!
రక్షకభట మిత్రులార, శుభము!

ఆజ్ఞ సేయ మీకు అధికారు లున్నారు,
వాని నమలుపరచ వలయు గాని,
అడ్డమైన వారికా మీరు బాధ్యులు?
రక్షకభట మిత్రులార, శుభము!

అడ్డమైన వారి కణగి మణగి యుండ
వలెన మీరు శాఖ విలువమరచి?
తెలుపవలయు మీదు విలువ లోకానికి!
రక్షకభట మిత్రులార, శుభము!

సక్రమముగ మీరు సామాన్యజన విష
యములలోన నుండ రనుట కలదు;
అందులోన సత్య మసలు లేదందురా?
రక్షకభట మిత్రులార, శుభము!

వెంట 'పెద్ద'యొకడు వేంచేయకున్న, మొ
రాలకించ రనియు చాలమంది
మిమ్ము నాడుకొనుట మీ చెవి బడదెట్లు?
రక్షకభట మిత్రులార, శుభము!

రక్షకభటు లన్న ప్రత్యక్ష దైవమ్ము
లని తలంచవలయు జనులు, కాని
రక్కసులుగ మిమ్ము లెక్కించుకొన రాదు!
రక్షకభట మిత్రులార, శుభము!

ఆదుకొనగ వలయు నవసరార్థుల మీరు,
ప్రక్క బెట్టి మీ నిబంధనలను;
పొరు లెల్ల మీ నిబంధన లెరుగరు!
రక్షకభట మిత్రులార, శుభము!

చాలమంది కలరు పోలీసులందును
స్వార్థపరులు, నక్రమార్జకులును;
వారు మారితీరవలె నింకనైనను!
రక్షకభట మిత్రులార, శుభము!

దొరకనంత వరకు దొరలె అందరు, 'అని
శా'కు చిక్కెనేని శాస్తి ధ్రువము;
తెలిసి తప్పుచేసి విలపించ నేమౌను?
రక్షకభట మిత్రులార, శుభము!
(అనిశా=అవినీతి నిరోధక శాఖ)

జనులు మిమ్ము జూచి జడుసుకొనుట కాదు,
భయము తొలగి స్థిమితపడగ వలయు;
దైవ దర్శనముగ తలపోయవలె వారు!
రక్షకభట మిత్రులార, శుభము!

పూర్వమట్లు గాక, పోలీసు స్టేషను
గుర్తు చేయవలయు గుడినొ, బడినొ;
ప్రజకు మంచి చేయవలె,చెప్పవలె మంచి!
రక్షకభట మిత్రులార, శుభము!

నేరగాళ్ల బట్టి, నిర్దయగా వారి
తిట్టి, కొట్టి, హింసపెట్టి, రెచ్చి
పోవు హక్కు గలద పోలీసువారికి?
రక్షకభట మిత్రులార, శుభము!

లోగి మీర లే ప్రలోభాలకో, పక్ష
పాత వైఖరులకు పాలుపడిన,
రక్షకులె సమాజ భక్షకు లైనట్లు!
రక్షకభట మిత్రులార, శుభము!

చాలమంది నేరచరితులు నిర్దోష
లుగ సమాజమున తిరుగుచు నుండి;
రట్టి వారి మీరు పట్టించుకొన వద్ద?
రక్షకభట మిత్రులార, శుభము!

తనకు నచ్చనట్టి పనులును విధి నిర్వ
హణమునందు నప్పుడపుడు తగులు;
ఐన,మరవరాదు మానవత్వము గదా!
రక్షకభట మిత్రులార, శుభము!

చావుకైన సరియె జంకక, విధి నిర్వ
హణమునందు నప్పు డపుడు మీరు
సాహసమ్ము జూపు సందర్భములు నుండు!
రక్షకభట మిత్రులార, శుభము!

జడువవలయు నేరచరితులే మిము జూచి,
పట్టుకొందు రెదురుపడిన యనుచు;
స(త్ప)వర్తకులకు జడు పేల మీరన్న?
రక్షకభట మిత్రులార, శుభము!

నగరములను,పట్టణములను'ట్రాఫిక్కు'
పెరిగి పెరిగి యయ్యె పెను సమస్య;
దాని నదపుచేయు దక్షులు మీరలే!
రక్షకభట మిత్రులార, శుభము!

తాగి,వీధులందు తైతక్కలాడి, యి
బ్బంది కలుగజేయు 'మందు మతుల'
బుజ్జగించి పంపు పోలీసు నేర్పరి!
రక్షకభట మిత్రులార, శుభము!

కొంతమంది వాడుకొందురు మిము చాల
అల్ప విషయములకు నైన, గాని
సాహసించలేరు సామాన్య లట్టుల!
రక్షకభట మిత్రులార, శుభము!

ఒత్తు డెక్కువౌను మెత్తగా నున్నచో,
నెదురు తిరుగ తనకు బదిలి యగును;
ఇంక నేమి చేతు రీ స్వార్థ నాయకుల్?
రక్షకభట మిత్రులార, శుభము!

శ్రద్ధ చూపవలయు సామాన్య జనులపై
మీరు,వారు తరలి రారు తరచు;
అరసి కష్ట సుఖము లాదుకోవలె సదా!
రక్షకభట మిత్రులార, శుభము!

ఎవరి కెట్టి కష్ట మేవేళ కలిగిన,
మొదట మీరె మదిని మెదలు వారు;
ఆప్తు లట్లు వచ్చి ఆదుకొందురు కదా!
రక్షకభట మిత్రులార, శుభము!

పూర్వ మట్లు గాక, పోలీసు లిపుడు ప్ర
జలకుచేరు వగుట స్పష్టపడును;
అమలుపరచుచుండి రధికారు లీ తీరు!
రక్షకభట మిత్రులార, శుభము!

ప్రజకు ధైర్య మిడగ,రాత్రులు గస్తీలు
మీరు తిరుగుచుండ,చోర భయము
తగ్గుముఖము పట్టె,తద్దయు శ్లాఘ్యము!
రక్షకభట మిత్రులార, శుభము!

ప్రజల గలసిపోయి పౌరదుస్తుల తోడ,
విధులు నిర్వహించు విధము గలదు;
సంచరించి రిట్లె 'చారులు' పూర్వము!
రక్షకభట మిత్రులార, శుభము!

ప్రజలు బ్రతుకలేరు రక్షకభట శాఖ
కాచుకొనకయున్న, క్షణము గూడ;
అంత ముఖ్యమైన దా శాఖ, తెలియరో!
రక్షకభట మిత్రులార, శుభము!

జను లెరుంగరా? అసాంఘిక శక్తులు
రెచ్చిపోవు మీరు లేని క్షణము;
వాని తొక్కి యుంచవలె నుక్కు పాదాన!
రక్షకభట మిత్రులార, శుభము!

ఏవొ లోటు పాటు లే శాఖలోనైన
నుండు, దిద్దుకొనుచు నుండవచ్చు;
నరుడు చేయు తప్పు సరిదిద్దుకొనలేమ?
రక్షకభట మిత్రులార, శుభము!

పనికిరాదు మెతకతనము మీ విధుల, స
ర్వత్ర కరకుదనము లగ్గ కాదు;
సాగుచుండవలయు సందర్భమును బట్టి!
రక్షకభట మిత్రులార, శుభము!

స్థాన చలనమునకు నేనాడు వెరవక,
నిర్భయముగ వృత్తి నిర్వహించు
సాహసికులు పెద్ద సంఖ్యలో నుందురు!
రక్షకభట మిత్రులార, శుభము!

పిరికివారు,స్వార్థపరు,లసమర్థులు,
నక్రమార్గు లిందు నందు ననక
యెందునైన నుందు; రెన్నాళ్లు? మారరా?
రక్షకభట మిత్రులార, శుభము!

ఏది స్వచ్ఛ శాఖ?యేయొక్క లోపము
లేనియట్టి దొకటి కానబడునె?
కానబడిన ,నమ్మలేని దుస్థితి యుండె!
రక్షకభట మిత్రులార, శుభము!

ప్రోత్సహించుచుండె పోలీసులను ప్రభు
త్వము పతకము లొసగి వార్షికముగ;
సత్కరించ దగును సత్సేవకుల నెంచి!
రక్షకభట మిత్రులార, శుభము!

కొంతమందె అందుకొందురు పతకాలు,
కడమవారు కారు కాని వారు;
పతక మందకున్న పని మానుకొందురా?
రక్షకభట మిత్రులార, శుభము!

పనుల జేతురెట్లు పతకాల నాశించి?
వృత్తి దైవ మనుచు నెంచవలయు;
సక్రమముగ జేయ సంతృప్తి నిడు వృత్తి!
రక్షకభట మిత్రులార, శుభము!

మీకు లంచ మిచ్చి,మీచేత శతృ వ
ర్గమును బెదరగొట్టు ఘనులు గలరు;
అది సమర్థనీయ మౌన మీ వృత్తికి?
రక్షకభట మిత్రులార, శుభము!

నీతి విక్రములుగ నిలుచుండవలె గాని,
మార దగున అక్రమార్జకులుగ?
దారితప్పి నడచి,తల దించుకొన నేల?
రక్షకభట మిత్రులార, శుభము!

ఒత్తుడులకు లొంగియో,మెప్పు లాశించి
యో, ప్రలోభపడియొ ఒరుని బలిమి
బలిపశువుని జేయ పాడియౌనా మీకు?
రక్షకభట మిత్రులార, శుభము!

తప్పు చేసెనేని దండించవచ్చు, అ
మాయకులకు శిక్ష వేయదగదు;
కంచె చేను మేయ,గాయువా రెవరింక?
రక్షకభట మిత్రులార, శుభము!

చెప్పి రెవరొ అనుచు తప్పించుకొనరాదు,
నిలిచి పోరవలయు నీతి కొరకు;
న్యాయ మనుసరించ నధికారి తలదించు!
రక్షకభట మిత్రులార, శుభము!

తప్పు చేయువాడు తల దించుకొనవలె,
ఒప్పు చేయు నతడు మెప్పు గొనును;
తెలిసి తప్పుచేయు ఖలులు శిక్షార్హులు!
రక్షకభట మిత్రులార, శుభము!

చేయి తడుపకున్న చేయరు పను లని
జనులు మిమ్ము నాడుకొనుట వినరె?
అట్టి దూరు తొలగదా మీరు మారిన?
రక్షకభట మిత్రులార, శుభము!

మార్పు తప్పనిసరి, మంచికై మారుట
మెప్పువడయ గలదు తప్పకుండ;
నిలిచి యుండగలవు నీతి నిజాయతి!
రక్షకభట మిత్రులార, శుభము!

మీ నిజాయతీని మీ అధికారులు
మెచ్చుకున్న పోయె, లొచ్చు లేదు;
ఆత్మసాక్షి లేదె? అది యెరుంగును గదా!
రక్షకభట మిత్రులార, శుభము!

'బాసిజమ్ము' కానవచ్చు హెచ్చుగ రక్ష
కభట శాఖలోన, గాస దాని
వలన కొన్ని యెడల ఫలితాలు వికటించు!
రక్షకభట మిత్రులార, శుభము!

'బాసు' విజ్ఞు డైన, పనులు సమర్థవం
తముగ జరుగ గలవు తప్పకుండ;
బాసులందు గొప్ప బాసులు కొందరే!
రక్షకభట మిత్రులార, శుభము!

నేరగాళ్లతోడ నిత్య సంబంధము,
బంతి యాట చావు బతుకు మధ్య;
పూలపాన్పు కాదు పోలీసు కొలు వన్న!
రక్షకభట మిత్రులార, శుభము!

క్షణము క్షణము భయము ,దినదిన గండము,
ఒడలు మనసు నొచ్చు నొత్తుడులకు;
పూలనావ కాదు పోలీసు యానము!
రక్షకభట మిత్రులార, శుభము!

స్వార్థపరులు 'ముడుపు'లలవాటు చేసిరి,
మానరైరి రుచులు మరగి మీరు;
మారి తీరవలయు మారు కాలముతోడ!
రక్షకభట మిత్రులార, శుభము!

ఉండవచ్చుగాక ఉద్యోగ బాధ్యత,
మనసు పెట్టకున్న పనులు కావు;
ప్రజకు నచ్చు నతడె నిజమైన పోలీసు!
రక్షకభట మిత్రులార, శుభము!

కష్ట మెరిగి వచ్చి గడప దగ్గరకు, పూ
ర్తి వివరాలు విని, పరిష్కరింప
పూనుకొందు రెవరు?పోలీసులే కదా!
రక్షకభట మిత్రులార, శుభము!

స్త్రీలు నిర్వహించు పోలీసు స్టేషన్లు
వెలసె నచట నచట, ఫలితములును
కానవచ్చుచుండె వాని వలన కొన్ని!
రక్షకభట మిత్రులార, శుభము!

స్త్రీలు పెక్కు రిపుడు పోలీసులై, సమ
ర్థతను చాటుకొను విధానము గని
మనము మెచ్చవలదె? మహిళామణులకు జై!
రక్షకభట మిత్రులార, శుభము!

అన్ని స్థాయిలందు నున్నారు పోలీసు
లందు మహిళ, లిందు నందు ననక;
వెనుకబడరు వారు విధి నిర్వహణమున!
రక్షకభట మిత్రులార, శుభము!

క్రింది స్థాయి కొలువులే కాదు, 'గృహమంత్రు'
లైన వారు మహిళలందు గలరు;
తెల్లమగును దీన స్త్రీల సామర్థ్యము!
రక్షకభట మిత్రులార, శుభము!

ఆధునికములైన సాధనములు కొన్ని
వాడి, నేరగాళ్ల పట్టుటందు
గాంచినారు ప్రగతి గణనీయముగ మీరు!
రక్షకభట మిత్రులార, శుభము!

చెప్పవలయు నిచట తప్పక 'పోలీసు
కుక్క' సేవ గూర్చి ఒక్క ముక్క,
దాని ఘ్రాణశక్తి మానవాతీతము!
రక్షకభట మిత్రులార, శుభము!

చెప్పవలయు నింక 'సీసీ కెమేరాలు'
మీకు చేయుచున్న మేలు గూర్చి;
వదల వవ్వి కంటబడు వారి నెవరిని!
రక్షకభట మిత్రులార, శుభము!

నిర్వహించనీరు నిష్ఠగా మీ విధు,
లితర జోక్య మిప్పు డెక్కువాయె;
గాన నెంతవారు రాణించకున్నారు!
రక్షకభట మిత్రులార, శుభము!

నిందితులను గావ నేతలే దిగివచ్చి
చేయుచున్న పరువుతీయు పనులు,
నిలువరించలేవి నిస్సహాయత మీది!
రక్షకభట మిత్రులార, శుభము!

పుణ్యతీర్థ మట్లు పోలీసు స్టేషను
ప్రజకు కానిపించవలయు, తమకు
అచట మంచి జరుగు ననిపించవలె నెప్డు!
రక్షకభట మిత్రులార, శుభము!

సగటు మనిషి మిమ్ము సాక్షాత్తు దైవస్వ
రూపు లని తలంచి మ్రొక్కెనేని,
రక్షకభట నామ మక్షర సత్యమౌ!
రక్షకభట మిత్రులార, శుభము!

వంద(100)పిలువగానె స్పందించుటయు, తగు
చర్య గైకొనుటయు జరుగు; మిమ్ము
పొగడవలయు గాదె, పోలీసు హేట్సాఫు!
రక్షకభట మిత్రులార, శుభము!

గౌరవమ్ము గలదు గాన 'పోలీసు' పై
చెప్పియుంటి మంచి చెడుల నిందు!
హెచ్చరించువారు హితులు కాకుందురా?
రక్షకభట మిత్రులార, శుభము!

మీదు మేలు గోరి, మీపైన శతకము
వ్రాసి యిట్లు ప్రకట పరచుచుంటి;
మెచ్చ దగిన వృత్తి మీది ముమ్మాటికి!
రక్షకభట మిత్రులార, శుభము!

చాల గౌరవమ్ము పోలీసు శాఖపై
గలదు నాకు; కవిని గాన నేను
శతకమును రచించి సంతృప్తి గంటిని!
రక్షకభట మిత్రులార, శుభము!

ఎంత చెప్పుకొన్న 'కొంత'యే అనిపించు,
నిక ముగించుచుంటి, నిది 'శతకము';
చదువరులకు స్వస్తి! సంఘమునకు రక్ష!
రక్షకభట మిత్రులార, శుభము!

పుస్తక సమీక్షలు

తెలుగు వర్ణమాల.. అక్షరలయలు



తెలుగు వారికి సాహిత్యాకాంక్ష, మిగతా దక్షిణాది వాసులకంటే తక్కువ. అందునా, బాల సాహిత్యం మరీ తక్కువ. 1955 ప్రాంతాన వెలువడిన బాలల బొమ్మల భారతం, భాగవతాలతో మొదలైన ఆధునిక బాల సాహిత్యం నత్తనడకన నడుస్తూ, ఇప్పుడిప్పుడే తప్పటడుగులు వేస్తూ ఎదుగుతున్నది,

పిల్లలకు భాష నేర్పించే క్రమంలో పాఠ్యపుస్తకాలతో పాటు, గేయాలు, కథలు ప్రముఖ పాత్రను పోషిస్తాయి. ప్రవృత్తిగా మొదలైనా, ఇవి తర్వాతి కాలంలో పాఠ్య పుస్తకాలలోని విజ్ఞానాన్ని అవగాహన చేసుకునేందుకు చక్కని ఉపకరణాలుగానే కాకుండా, వారిలో ఆసక్తిని పెంపొందించి, లోకావగాహనకు దోహదం చేస్తాయి.

తెలుగు బాల సాహిత్యానికి పత్తిపాక మోహన్ చిర పరిచిత గురువు. కవి, రచయిత, విమర్శకుడు 'వ్యాఖ్యాన దక్షుడు'గా ప్రస్తుతించబడిన ప్రజ్ఞాశాలి. తెలంగాణ వాణి గర్వంగా తన తనయుడు అని చెప్పుకోదగ్గ యువకవి. పలు పురస్కారాలు సన్మానాలు పొందిన ప్రతిభాశాలి. బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తోన్న బాలబంధు.

పిల్లలకు విజ్ఞానాన్ని బడిపంతులులా నాలుగు గోడల మధ్య నిర్బంధపు విద్యలా కాకుండా ఆటపాటల్లో చదువుని ఒక భాగంగా చేసి నేర్పాలని భావించారు. గోరుముద్దల్లాంటి వెన్నముద్దలు, చందమామను చూపిస్తూ, ఆకుపచ్చని పాటలను ఆలాపించారు. బాల లయలు వీరి ఎనిమిదవ బాల సాహిత్య కుసుమం.

తెలుగు వర్ణమాలక్రమంలో 'ఆ' నుండి 'ఱ' వరకు అక్షర క్రమంలో చిన్న చిన్న మాటలతో పాటలు రాసారు మోహన్.

గోరుముద్దల్లో పౌష్టికాహారము పొదిగి అమ్మ శిశువుకు అందించినట్లు ఈ చిన్ని చిన్ని పాటలలో నీతి, రంగులు, అర్థాలు వివరించారు. బాలశిక్షలా బాలల మనసుల్లో గాఢంగా పాతుకుపోతాయీ పద్యాలు. అమ్మ మొదటి దైవము. ఆవు తల్లివంటిది. తీర్చలేనిది తల్లి ఋణం, ప్రతి ఒక్కరు పనిచేస్తే దేశానిది ప్రగతి పథం' అంటూ నీతి వాక్యాలు చెప్పారు. అరటిపిలక పచ్చన, టమామాలు ఎర్రన, మంచు కొండతెల్లన, మల్లెపూలు తెలుపు, మందారం ఎరుపు అంటూ రంగులను పరిచయం చేసారు. ఇనుడు అంటె సూర్యుడు, ఋషభం అంటే ఎద్దు. అంబ అంటె పార్వతి గడ్డిపరక తృణము, ఘర్మజలం చెమట అంటూ క్రొత్త పదాలను బాలలకు పరిచయం చేసారు.

"ఈత చాప కొందము
నెమలి ఈకఅందము"
"ఒడ్డు మీద చేపపిల్ల
ఒంటిమీద మెరిసె సెల్ల"
'ఓణీ ఎంతో అందము
కాకుపతోడ ఉండుము"
"గంపకింద కోడిపిట్ట
గద్దెమీద పాలపిట్ట" లాంటి పదాల్లోని ప్రాసల వల్ల పిల్లలు హాయిగా పాడుకోవటమే కాదు. వాళ్ళ మనసుల్లో ఆసాంతము నిలిచిపోతాయి 'బాల లయలు'!

మర్రిపల్లి రమేష్ గీసిన రేఖాచిత్రాలు సంకలనానికి సంపూర్ణత చేకూర్చాయి. కంటికి, చెవికి, చిన్ని బుర్రలకు ఆహ్లాదం కలిగించి వారిలో స్థిరంగా నిలిచిపోతాయీ ఈ లయలు!

ప్రతులకు: సిరిసిల్ల చందన
కే/ఆఫ్.301, స్వస్తిక్ రెసిడెన్సీ
సాయిబాబా టెంపుల్ దగ్గర
రాజీవ్‌నగర్ కాలనీ, భూదేవి నగర్
తిరుమలగిరి, సికింద్రాబాద్-500 015
సెల్: 9811239219
9966229548

- కూర చిదంబరం
8639338675

తెలుగంతటి తీయభాష ఇలనెంత వెదుక దొరకదు



అవును, ఇది నిజం. పదిభాషలు తెలిసిన ప్రభువు కూడా 'దేశ భాషలందు తెలుగు లెన్స'! అన్నాడు. ప్రపంచ భాషలన్నింటా ప్రాచీనమైనది. ప్రశస్తమైనది అని కొనియాడబడిన సంస్కృత భాషకు, అనుంగు కూతురై అలరారిన భాష తెలుగు భాష. పలుకులందు తేనె లొలికించు భాష. అమృతభాష.

ఇంతటి గొప్ప భాషయై యుండి కూడా 'మృతభాష'కు దరిదాపుల్లో మన తెలుగు భాష, కూడా చేరబోతోందన్న వార్త, మాతృభాషాభిమానులందరకు దిగులు కలిగించే వార్త.

ఆ ఇట్టి సంకట స్థితి నుండి భాషాభిమానులకు, తెలుగు తెలిసిన వారిని ఊరడించటానికా! అన్నట్లు, విలువ తెలిసి అభిమానించటానికా! అన్నట్లు. అప్పుడప్పుడు తెలుగు ప్రముఖులు తెలుగు గొప్పతనాన్ని చాటి చెప్పుతున్నారు. తెలుగు భాష సొగసులను పరిశోధనాత్మకంగా పరిశీలించి వివరిస్తున్నారు. సాహిత్యాభిమానులకు సాహిత్యాధ్యయనం చేస్తున్న విద్యార్థులకు, కరదీపికల్లాంటి చిరు పొత్తాలను ప్రకటిస్తున్నారు. సాహిత్య ప్రచారంతో సౌమనస్కుల, సామాజికుల, సౌహార్దతను చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు.

శ్రీయుత అల్లంరాజు వెంకటరావుగారు 'సుధామ'గా తెలుగు సాహితీ లోకానికి చిరపరిచితులు. పరిచయం అక్కరలేని సుధామధురం'. తెలుగు లెక్చరర్‌గా ఆకాశవాణి హైదరాబాదులో ప్రొగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా, అకాడమిక్ కౌన్సిలర్‌గా కాలమిస్టుగా కార్టూనిస్టుగా, రచయితగా, తన విశ్వరూప ప్రదర్శనతో ప్రశంసలు అందుకున్న ప్రతిభాశాలి.

తెలుగు భాషలోని తీయదనాన్ని, మనకు ముఖ్యంగా మన యువతకు 'రుచి' చూపటానికై లఘు ప్రసంగాలుగా రేడియోలో ప్రసారం చేసి ఆ వెనుక ఒక ప్రముఖ దినపత్రికలో ప్రచురించబడి ఇప్పుడు ఒక సంకలన రూపంగా మన ముందుకు వచ్చిందీ పదమూడు వ్యాసాల సంకలనం.

తెలుగుకే పరిమితమైన జంటపదాలు, ఒక పదం,నానార్థాలు మాండలికాలు, ఊతపదాలు, ఒక అక్షరం, లక్షల భావాలు, సమయం సాంప్రదాయాలు, కుంభకర్ణుడు (నిద్ర, ఆకలి ముచ్చు) బకాసురుడు (తిండిపోతు) లాంటి రూఢి వాచకాల వైభవం, ఎటునుంచి చదివినా మారని అర్థం (కిటికీ నటన) అటొక అర్థం ఇటొక అర్థం వచ్చే పదాలు (కలప, పలక)ను పాఠకుడు ఉత్సాహంగా ఉల్లాసంగా తిరిగేయ గులుగుతాడు ఈ సంకలనాన్ని.

ప్రచురణ కర్తలు, యువభారతి తమ ముందు మాటలో చెప్పినట్లు తెలుగు భాషలోని సొగసులను వాచవిగా యువతకు పరిచయం చేసి అనురక్తి ఆసక్తి రేకెత్తించే వ్యాసాలివి. 'తరాలు నిలురాత' (ఎటు నుంచి చూసినా ఒకే అర్థం)లివి.

ప్రతులకు:యువ భారతి
తెలంగాణ సారస్వత పరిషత్ భవనములు
తిలక్‌రోడ్, హైదరాబాద్-500001.
సెల్:9849297958

- కూర చిదంబరం
సెల్: 8639335675

నుదిటి రాత...

నడిసంద్రాన కురుస్తుంది వర్షమై
నా కన్నీరు..
ఆశలదీపం ఆరిపోయింది
బ్రతుకును చీకటి చేసింది..
ఆకాంక్షల గువ్వ అనుబంధపు
గూడు విడిచి నన్ను ఒంటరిచేసి వెళ్ళిపోయింది..
అనుబంధం దూరమైన వేళ ఆవేదన
నాకు నేస్తమైంది..
రంగులకలల మంచుతెమ్మెరలు తొలగిపోగా..
ఆప్యాయంగా మదిని శూన్యం ఆవహించింది..
మూడు ముళ్ళు వేసి ఏడడుగులు
నడిచిన బంధం..
నా బొట్టు పువ్వులను దూరం చేసి..
కట్టెలలో కాలిపో

సుగుణ సంపత్తి

నర నడవడికి నవ నాగరికానికి
జాగృతాన్నిచ్చేవి
దశేంద్రియాలు కీలకమే..!
అది జగద్విదితమే...!
మానుష ధర్మానికి
ద్వాదశంశాలే ఊపిరిపట్టుఎప్పటికైనా?
అమ్మనాన్నలదే అంశం..!
పూర్వికుల పరంపరానుగతమే వంశం!
జీవనశైలుల వృత్తిధర్మాలదే కులం!
సత్సంబంధాలళ్ళికలదే గోత్రం....!
అస్థిత్వాన్నిచ్చే వాస్తుల అనుక్రమణికయే గృహం...!
భవ్యం దివ్యం పంచేంద్రియాత్మకం..!
గృహబంధాల జనపదాల
ఇంగితాల వాసమే గ్రామం...!
చదువుసంస్కారాల విశాల భావాల
వివేచనా రూపమే మండలం..!
ధర్మనీతిన్యాయం ఋజువర్తనల
ప్రతిరూపం మన జిల్లా..!
యాసభాష సంస్కృతుల
అస్థిత్వదృష్టిని ఆత్మాభిమానాన్ని రగిలించేదే రాష్ట్రం..!
నిర్దేశిత రాష్ట్రాల రాజకీయార్థిక
సాంఘిక మార్పుల గమనాన్ని పూలదండలోని దారంలా
జాతీయతా భావాన్ని గుండెల్లోనింపి
గౌరవయుక్తిని రగిలించేదే దేశం...!
దశేంద్రియాలుగా సాగెటి గమనాన్ని మథనం చేయిస్తూ
విశ్వంలో విలక్షణంగా
విశ్వశ్రేయ కాంతుల్ని
విరజిమ్మేదే ఏకాదశి సంస్కృతి...!
భూభాగం, ప్రజలు ,వనరుల
వినియోగంతో దేశాన్ని పాలించే
అత్యున్నతాధికారమే ద్వాదశి
దేశ సార్వభౌమాధికారం...!
ఇవే కదా
ప్రతి పౌరునికి ద్వాదశాంశాల శక్తి
కర్తవ్యానికి యుక్తి
ఆరాధనకదే భక్తి
ఆధ్యాత్మిక చింతనకిదే ముక్తి....!
అఖిలాండ భారతంలో
ఆచరించేదే హిందూ ధర్మం... !
ఈ నేలలో జనించి,
సంపదననుభవిస్తూ,
పరాయి ధర్మాన్ని ,మనపై రుద్దే
కుహనా లౌకికమెప్పుడైనా?
కుళ్ళును పెంచి కులాసగుంటది!
జాగ్రత్తసుమా..!
భారతీయ వారసత్వం
సంస్కృతి సంపదను
ప్రశ్నించే ఎవరైనా? ఎంతటి వారైనా?
అపరాధులే..... అవునా!కాదా!....

-డా.పాండాల మహేశ్వర్
9912180054

అనందంగా జీవించు

విశ్వంలో సమస్తం మనకోసమే
విచక్షణ ఉన్నది మనకే
విలువైన వనరులెన్నో
ధరిత్రి తన గర్భంలో దాచుకుని
మనకు సమకూరుస్తున్నది సంతోషంగా
ఎన్నెన్నో అందాలను తన ఎదలో పరచుకున్నది
మనమంతా కొన్నాళ్ళుండి వెళ్ళాల్సిందే
కావునా... మనషుల్లో ఎందుకీ అసమానతలు
చులకనబావనలు
అందరం శ్రమించాలి అవని అందాల కోసం
ప్రకృతి కాపాడే యోధులుగా
కాలుష్యంలేని సస్యశ్యామల పడమి నిర్మించే నిర్మాతలుగా
శాశ్వతమేది కానప్పుడు విద్రవీగేందుకు
మనమిలోకంలో కిరాయివాళ్ళమే ఖాళీ చేసి
విడిచివెళ్ళాల్సిందే మన విడిదిని
కాఠిన్యం నిండిన మనసెందుకు
వీలుంటే సహాయపడే గుణముండాలి
అందరి మనసుల్లో మనిషిగా మెలగాలి
రాజు బీద కలిమి లేములు అనుభవించిన
అందరూ చేరే చోటొక్కటే
లోకంతో వీడుకోలు పలికె వేడుకొక్కటే
గర్వంతో గాంభ్రించిన
చేతగానితనంతో చేతులు మడిచిన
ముదిమి నీ చివరి అంకమని మరువకు
నాకేమని బింకముతో మురవకు
మంచితనం మానవత్వం
మానవసేవే మాధవసేవని మరవక
మనిషి చేసే పనులే శాశ్వతం కడవరకు

-సి. శేఖర్(సియస్సార్),
-9010480557.

కరోనా నేర్పిన క్రమశిక్షణ

ప్రాణాలతో చైనా చెలగాటాలు
వూహాన్ విసిరిన వైరి వైరస్‌లు
స్వేచ్ఛను హరించిన నిబంధనలు
సమానత్వం పాటించిన కోవిడ్‌లు
మహమ్మారి మాయగాలి గత్తరలు
ఆలింగనాలకు ముళ్ళ కంచెలు
ముట్టుకుంటే ప్రాణాలకే ముప్పులు
ముక్కు మూతి చుట్టు గుడ్డలు
దూరాచారాలే నవ్య నియమాలు
సానిటైజర్‌కు అలవాటైన చేతులు
తుమ్ములే ఆర్‌డిఎక్స్ బాంబులు
దగ్గులే దడ పుట్టించే శబ్దాలు
గడప దాటితే భయాందోళనలు
కనుమరుగైన కరచాలనాలు
పోషకాహారం వెంట పరుగులు
నమస్కారాలే సంస్కారాలు
స్మార్ట్ ఫోన్‌లో దూరిన పాఠాలు
ఆన్‌లైన్ బోధనల అగచాట్లు
పనిని మింగిన కరోనా కోరలు
వలసదారుల ఆక్రందనలు
బారులుతీరిన పరీక్షా కేంద్రాలు
జీతాల్లో భారీ వాతల కోతలు
ఉద్యోగాలు ఊడి పోవడాలు
ఉపాధులకు కరోనా సెగలు
జూమ్ యవనికపై సమావేశాలు
ఓంటరైన సంఘజీవులు
ఆ నలుగురు కరువైన చావులు
ఆస్తిపాస్తులే కరిగిన వైద్యాలు
వెలుగు కోసం గూట్లో తన్లాటలు
అగమ్యగోచర రేపటి రోజులు
ఆశలతో మానవాళి ప్రార్థనలు
2020 కరోనా వత్సరానికి వీడ్కోలు
2021 తేవాలి అశేష శుభవార్తలు
లోక కళ్యాణ దీవెనల మాలలు
పరిమలించాలి మానవీయ పుష్పాలు
వర్ధిల్లాలి వసుధైక కుటుంబాలు !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

సామాజిక చైతన్యమే లక్ష్యంగా వేముల కోటయ్య కవిత్వం

సామాజిక చైతన్యమే లక్ష్యముగా తన కలాన్ని సానపడుతూ,సామాజిక బాధ్యతతో రచనలు చేస్తూ ముందుకు సాగుతున్నారు వర్ధమాన కవి, రచయిత శ్రీ వేముల కోటయ్య. నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేట తాలూకా, బలమూర్ మండలం, అనంతవరం గ్రామానికి చెందిన వీరు కొల్లాపూర్ పట్టణంలో నివాసముంటూ, పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా దశాబ్ద కాలం నుండి విధులు నిర్వహిసున్నారు.

వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కోటయ్య ప్రవృత్తిగా సాహిత్యం పట్ల మక్కువను పెంచుకొని రచనలు చేయడం మొదలు పెట్టాడు. అటు పద్యాలను, ఇటు వచన కవితలను వివిధ రూపాలలో అలవోకగా రాస్తూ, పలువురు పండితుల ప్రశంసలను అందుకుంటున్నారు.

నేడు సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాధలు, నిత్య జీవితంలో తనకు ఎదురైన సమస్యలను, అనుభవాలను కవిత్వీకరించి ×"కరోనాపై జయం మనదే," "కవితా సాగరం",× అనే వచన కవితా సంపుటులను, "సగరపుత్ర శతకము" అనే పద్య సంపుటిని ఏక కాలంలో వెలుగులోకి తీసుకురావడం ప్రశంసనీయం.

2020 సంవత్సరంలో ప్రపంచాన్ని పట్టిపీడించింది కరోనా మహమ్మారి. కనిపించని ఈ సూక్ష్మక్రిమి దెబ్బకు లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కోట్లాది మంది దాని భారిన పడి, ఉపశమనం పొందారు. ఈ కరోనా భూతాన్ని ఈ లోకం



నుండి తరిమివేయడానికి తమ వంతు బాధ్యతగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఎందరో కవులు తమ కలాలకు పదునుపెట్టి రచనలు చేశారు. శ్రీ వేముల కోటయ్య కూడా తన బాధ్యతగా ×'లాక్ డౌన్'× కాలంలో ప్రతి రోజు ఒక కవితను రచించి, వాటిని ఒక పుస్తకంగా తీసుకువచ్చారు.

"కరోనాపై జయం మనదే"అనే పేరుతో ఉన్న ఈ వచన కవితా సంపుటిని చదవక ముందే పాఠకులకు,కరోనా వ్యాధిని ఎదుర్కొనే విధంగా కొండంత ధైర్యాన్ని ఇస్తుంది.

"జయం మనదే" అనే కవితలో

"గజరాజును బంధించ
గడ్డి పరకలన్ని ఏకమై
తాడులాగ పేనుకున్నట్లు"
"రావణుని సంహరించ,
రామునికి సహకరించ,
రాయిరప్పలు కలిసి,
రామసేతువై నిలిచినట్లు
"ఫణిరాజును మట్టుపెట్ట,
చీమలన్ని ఏకమై,
ఐక్యంగా నిలిచినట్లు

అని చెబుతూ కరోనాను నియంత్రించుటకు

"మనో ధైర్యమే ఆయుధంగా,
మూడడుగుల దూరమే లక్ష్యంగా,
ప్రవాహమై సాగుదాం.
యుద్ధమై పొరుదాం"

అంటూ ప్రజలలో ధైర్యాన్ని నూరి పోస్తాడు ఈ కవి. అలాగే కరోనా నియంత్రణకు నిరంతరం శ్రమిస్తున్న

డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసుల త్యాగాలను ప్రశంసిస్తూ శ్రీ వేముల కోటయ్య గారు "ఆ నలుగురు" అనే కవితలో

"ఆ నలుగురే సమాజానికి దిక్కులు.
ఆ నలుగురే ప్రపంచ కలల సౌధానికి మూలస్థంభాలు.
ఆ నలుగురే కరోనాపై చేస్తున్న యుద్ధంలో సిపాయిలు.
ఆ నలుగురే పెనుభూతం కమ్మేసిన చీకట్లలో సమిధలు.
ఆ నలుగురే ప్రజల ఆరోగ్య రక్షణకు కవచాలు"

అంటూ వారిపై తన అభిమానాన్ని, విశ్వాసాన్ని ప్రకటించుకున్నాడు.

''మన సంస్కృతి'' అనే కవితలో

"ఉన్న దీపాన్ని ఆర్పుకొని
చీకట్లలో వెలుతురును వెతికినట్లు...."

"అభివృద్ధి మాయలో ప్రకృతిని విచ్ఛిన్నం చేస్తూ,
వివిధ ప్రయోగాలతో వింత పోకడలకు పాల్పడుతూ,
విషాన్ని పూసుకుంటూ,
వింత రోగాలతో ఇబ్బంది పడుతున్నాం
చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు,
నెత్తిమీద మహమ్మారి నాట్యమాడుతుంటే,
వచ్చిన దారి ఆనవాళ్లను గుర్తుచేసుకుంటున్నాము"

అంటూ మన సంస్కృతి, సాంప్రదాయాల విలువలను తన కవిత్వం ద్వారా తెలియ చేస్తున్నాడు కవి.

అలాగే లాక్ డౌన్ కాలంలో చేయడానికి పనిలేక, తినడానికి తిండిలేక, స్వస్థలాలకు వెళ్ళడానికి ప్రయాణ సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న వలస కూలీల వెతలను, వారి ఆకలి కేకలను గురించి కోటయ్య ఈ సంపుటిలో అక్షరీకరించి, తన సానుభూతిని ప్రకటించాడు.

ఈవిధముగా కరోనా కాలములో ప్రజలను చైతన్యవంతులను చేసేవిధంగా ఈ "కరోనాపై జయం మనదే'' అనే వచన సంపుటిలో అర్థవంతమైన, సందేశాత్మకమైన 22 కవితలు ఉన్నాయి.

"హితేన సహితం సాహిత్యం" అనే నానుడిని అనుసరించి శ్రీ వేముల కోటయ్య సమాజానికి హితాన్ని చేకూర్చే విధంగా, సమాజానికి కనువిప్పు కలిగించే విధంగా, సమాజాన్ని మేలుకొలిపే విధంగా, సమాజాన్ని చైతన్యం చేసే విధంగా రాసిన మరో కవితా సంపుటి "కవితా సాగరం".

సమాజంలోని వారందరికీ తను కాయాకష్టం చేసి, తిండిపెడుతున్నరైతన్న కష్టాలను, అతని శ్రమను గురించి చెప్తూ కోటయ్య "మట్టిలో మాణిక్యం" అనే కవితలో

"కోడి కూయంగా లేచి కాడెడ్ల బండి కట్టి,
సేద్యమొక్కటే నాకు దేశసేవ యంటూ,
అమ్మ ఒడినిండా విత్తనాలు జల్లి,
చల్లంగ ఎదగమని తండ్రివలె, దీవిస్థివన్నా"అంటూ

"ఎదిగివచ్చిన పంట ఏపుగా పెరుగంగ,
సంతోషమున నీ మనసు రివ్వున ఎగురంగ,
కనికరించని వాన కనుమరుగవ్వంగ,
ఆశలన్నీ చూడ ఆడియాసలవ్వంగ" అని రైతు బాధలను ఊటంకిస్తూ

"నిన్ను ఆదుకొనగ దాతైన లేడాయే,
దిక్కు తోచని నీవు దిక్కుల పాలై,
కళ్ళ నిండా నీరు, గుండెంత చేరువై,
ప్రాణదాతవు నీవు స్వర్గానికి చేరితివి".

అని రైతుల ఆత్మహత్యలను ప్రస్తావించాడు.

"కల్లోల భారతం" అనే మరో కవితలో

"కామాంధుల హస్తాల్లో,
పసిపిల్లలు, పడతుల ప్రాయాలు
పువ్వులోలె నలుగపట్టే
శిక్షలేమో కరువాయె
రక్షనేమో బరువాయె"

అంటూ స్త్రీలు, పసిపిల్లలపై జరుగుతున్న పాశవిక ఆకృత్యాలను ఎండగడుతాడు కవి.

"లంచాలకు మంచాలు
సాక్ష్యాలు తారుమారు
అవినీతి తిమింగలాల
అడ్డదారి బాగోతాలు
అవినీతి పరులకాయె
ఆదుకునే ఆసనాలు" అని

సమాజంలో విచ్చలవిడిగా సాగుతున్న అవినీతిని ప్రస్తావించాడు కోటయ్య.

"పల్లె తల్లి" అనే కవితలో పల్లెల గొప్పతనాన్ని, పల్లె సంస్కృతిని కళ్ళకు కట్టినట్లుగా ఇలా చెప్పాడు.

"మమకారాలు పంచుతూ
ప్రేమ పూలు పూయిస్తూ
మతములన్నవే లేని
మమతల కోవెల మా పల్లె"అని చెప్తూ..

"ఇల్లు ఇరుగ్గా ఉన్నా
మనసు విశాలం
మెడలేమి లేకున్నా
పసిడి రాసుల గంధం మా పల్లె" అని, పల్లె గొప్పతనాన్ని చెప్తూ..

"ఇటువంటి పల్లెనొదిలి
పట్నమంటు నీవు
పరుగులెన్నో పెట్టి
గతుక గంజి లేక ఏడ్చి ఏడ్చి
ఏమి సాధించావు నీవు
తల్లి లాంటి పల్లెనొదిలి"అని.. పట్నాలకు వలస వెళుతున్న వారికి తన కవిత్వం ద్వారా కనువిప్పు కలిగించాడు.

ఈ కవి తన బాధ్యతగా "రాజీ పడలేక" అనే కవితలో

"సమాజ వీదుల్లో
పేరుకు పోయిన చెడునంత
తుడిపివేయ డస్టర్ చేతబడితి
సూక్తులెన్నో చెప్ప
సుద్దముక్కబడితి
సమాజంలో వెలుగునింప
కలం బడితి" అని చెప్తాడు.

ఈవిధముగా వివిధ సామాజిక అంశాలతో కూడిన సలభై కవితలు ఉన్న ఈ ×కవితా సాగరం×అనే ఈ వచన కవితా సంపుటి లోని కవిత్వం చిక్కని కవిత్వ ధారలతో,చక్కని సందేశాన్ని ఇస్తుంది.

శ్రీ వేముల కోటయ్య వచన కవితలో మొగ్గలు, మణిపూసలు వంటి వినూత్న ప్రక్రియల్లో రచన చేస్తూ, చందోబద్ధమైన పద్యరచనను కొనసాగించడం ఇక్కడ మనం ప్రశంసించవ లసిన విషయం. ఆటవెలది చందస్సులో "సగరపుత్ర శతకము" అనే పుస్తకాన్ని కూడా వెలువరించాడు. "సత్యమిదియె మిత్ర! సగరపుత్ర!" అనే మకుటంతో సాగిన ఈ శతకంలోని 108 పద్యాలు మౌక్తికాలే. అంటే ఇందులోని పద్యాలు వేటికవే స్వతంత్ర భావాన్ని కలిగి ఉన్నాయి. ఇందులో కూడా శ్రీ వేముల కోటయ్య సామాజిక అంశాలనే ప్రస్తావించాడు.

"పురిటి నొప్పులోర్చి పుడమి తల్లిని జేర్చి
జన్మనిచ్చి జనని జగముజూపు
అట్టి మాతకెపుడు నాపదలే రానీకు
సత్యమిదియె మిత్ర! సగరపుత్ర!''అని మాతృమూర్తికి వందనం సమర్పించాడు.

"అంతరిక్షమందు నడుగిడితిననియు
గొప్ప జెప్పు నరుడ! గొప్పయేది?
చిన్న దోమనైన చిదమక పోతివి
సత్యమిదియె మిత్ర! సగరపుత్ర!"అని నేటి కరోనా మహమ్మారిని నియంత్రించుటకు దారి లేని విధానాన్ని ఈ పద్యంలో ఎండగట్టాడు కవి.

"ఆలినెపుడు నీవు నాగంబు జేయకు
భార్యలేని బ్రతుకు భారమగును"అని భార్య గొప్పతనాన్ని, వారి పట్ల భాధ్యతను,

"భాధలెక్కువుండు బాధ్యతగా నున్న
నిందలెక్కువుండు నీతిగలుగ
శిలల దెబ్బలన్ని ఫలవృక్షములకెగా"అనే జీవిత సత్యాన్ని తన పద్యాలలో తెలిపాడు.

"నిందవేయబోకు నిజము తెలియకుండ
మాటయన్న పిదప మార్చలేము
చెడ్డవాని మాట చెరువును మదియంత"అని,

"ఇరుగుపొరుగు వారలిబ్బంది పెట్టినన్
సహన గుణము తోడ సర్దుకొనుము
శాంత గుణము మిన్న! జగమందు పరికింప" అనే నీతి సూత్రాలను కూడా నొక్కి వక్కాణించాడు.

ఇలా శ్రీ కోటయ్య గారి ఈ ×సగర పుత్ర శతకం లో ప్రతి పద్యం ఏదో ఒక నీతిని చెబుతుంది. తల్లి, భార్య, స్త్రీ, దేశం, జలం, కొడుకులు, పాలకులు, కులమతాలు, మంచి, చేదు మొదలైన ఎన్నో అంశాలు ఇందులో ఆటవెలది పద్య రూపములో చెప్పబడ్డాయి.

ఈ విధంగా శ్రీ వేముల కోటయ్య రచించిన ఈ మూడు పుస్తకాలు వైవిధ్య భరితమైన అంశాల మేళవింపుగా, సామాజిక చైతన్యం



కోరే అనర్ఘ రత్నాలుగా, చీకట్లలో వెలుగులను నింపే విజ్ఞాన జ్యోతులుగా, విద్యార్థులను, యువకులను సన్మార్గంలో పెట్టే దారి దీపాలుగా ఉన్నాయనుటలో ఏ మాత్రం అతిశయోక్తి లేనేలేదు.

ప్రతులకు:
వేముల కోటయ్య
కొల్లాపూర్
సెల్: 9441455261
8309704681

-శ్రీ వేదార్థం మధుసూదన శర్మ
9063887585

మా ఊరి ఎర్రమల్లెలు

కొమ్మలు విస్తరించుకు
ఏపుగా పెరిన ఓ చెట్టమ్మ మాఊరు
మా పల్లెతల్లి కడుపులపుట్టిన అన్నదమ్ముళ్ళీ జనం
రెమ్మరెమ్మకూ చిట్టి పిచ్చుకగూళ్ళలా మా ఇళ్ళు

మేధస్సునే పనిముట్లుగ మార్చి
చేతులకే కళ్ళను మొలిపించి
చకచక కదిలే చేతివేళ్ళలో ఆకృతి పొందే అందాలెన్నో
ఆనందాలు పంచే అద్భుతాలు మరెన్నో

ఒకరికొకరు చేయూతవుతూ
ఒకరు చేసిన ఇసిరె మరొకరికి అవసరమవుతూ
చేదోడు వాదోడయ్యే బంధువులయ్యే నా పల్లె
బతుకుచిత్రాలకు రంగులద్దిన కాన్వాసు

పెళ్ళీ పేరంటాలకూ, చావూ బతుకులకు
ఎద్దూ ఎవుసానికి చేసే ప్రతి పనికీ తోడౌతూ
చాలీచాలని బతుకుల్లో తామున్నా
చేతిలోని విద్యకు వన్నెలద్దే చరిత్రకాధారభూతాలే
బతుకుదారుల్లోని ఎర్రమల్లెలు
మా ఊరి చేతివృత్తుల వారు

-రమాదేవి బాలబోయిన
6281216735

నగరంలో "పల్లె"

ఏ పొద్దు చూసినా ఒకటే రద్దీ
ఏ గల్లీకి పోయినా అంతా తొక్కిడే.
నగరానికొచ్చిన"పల్లె "బతుకింతే.
వృత్తి కళ్ళకు గంతలు కట్టి
ఊరి దారికి గోడ కట్టి
కాని పనులు ముందు చేతులు కట్టుకొని,
చెప్పిన మాటవినే పనిముట్టును పదిలి
పట్నం వచ్చిమీట నొక్కితే
తిరిగే యంత్రంగామారి ,
కాసులుకొట్టుకొచ్చే గాలానికి గాలమేసే
పచ్చకాగితల పిచ్చిలో బతుకు
గాలివాటానికి ఎగిరే ఓ చిత్తు కాగితంలా
ఎక్కడికో కొట్టుకుపోతుంది.
చిటికలో గల్లుమనే చిల్లరకు
రుచి మరిగిన ప్రాణాలకు
గడప దాటితే దిగులుగుండంలో
పడి మాడిపోతామనే బతుకు భయం
ఒకనాడు కష్టాన్ని నమ్మిన దేహమే
కపటాన్ని మోహించి అక్కడే మగ్గుతుంది.
ముక్కులు పగలే కంపుతో కాపురం
కుక్కిన ప్రత్తి బూరంలా
కొంపలో సూరీడు ఎప్పొడిచ్చాడో తెలియని కుములుడుకు
నీడ దుప్పటి కప్పిన వాలు పంచలతో...
మాగుదాసన మూగిన మురికికూపంలో
ఈగలతో కలసి
దోమలతో సహజీవనమే జీవితం.
నల్ల మబ్బు కనిపిస్తే చాలు
సందు గుండె గుల్లె.
ముసురు ముప్పు పట్టి
చినుకు చిందేతే
చుట్టూ చీకటి తడే
వీధులన్నీ గర్భందాల్చిన ప్రాజెక్టులే.
ఇళ్లన్నీ నీళ్లలో తేలాడే పడవలే.
వానొస్తే తడవని కళ్ళు లేవు.
తడపని బాధ లేదు.
గుడ్డి పొడి వెలుగులో
పొట్టను ముడుచుకొని
చెమట ఆవిరి చాలక నడిచే
బిక్కుబిక్కు మంటూ బతుకు బండి ఆగి
అంతా ఇరుకుమయం.
వీధి ఇరుకు-ఇల్లు ఇరుకు
పడక ఇరుకు-నిద్ర ఇరుకు
జీతం ఇరుకు-జీవితం ఇరుకు.
దారి పొడుగునా అన్ని ఇరుకులే.
విశాలమైనది దరిద్రమొక్కటే.
విశాలంగా పారేది కన్నీరొకటే.

-చందలూరి నారాయణరావు
9704437247

మనసు గిటారును మీటింది ??

తారలా తళుక్కున మెరిసింది
నా ఎదలో పిడుగు లా సర్రున దిగింది
ప్రేమ వేణువును ఊది
మనసు గిటారును తట్టి లేపింది.
పచ్చి కొమ్మను మెలిపెట్టినట్లు
నా మనసు ను మెలిపెట్టి
నిశ్శబ్ద నా మనసు కదలిలో
అలల పోటులను రేపింది
కోరచూపులతో ఓరగా చూసి
ఇష్క్ బాణంతో గుండెలో గుచ్చింది.
నిరాశల సముద్రంలో
నిట్టూర్పు ల సుడిగుండంలో
దారం తెగిన గాలిపటంలా దరులు వెతుకుతుంటే
నా ఆత్మీయతా నావలోకి చేరి
చుక్కానిగా మారింది
మోడు బారిన తనువుకు
మమతల ఎరువును వేసి
కొత్త ఆశల మొలకలు మొలిపించింది.
మాట మాట కలిపింది
ప్రణయ గీతాలు పాడింది
అడుగు లో అడుగు వేసి
సప్త పదులు నడిచింది
సంతోషాల సాగరం తో
నా ఇంటిని నందనం చేసింది
ఎండిన ఎడారి జీవితాన్ని
ఒయాసిస్సు లా మార్చింది.

-తాటిపాముల రమేష్
7981566031

చలి పులి

అబ్బబ్బో చలి పులి
వణికిస్తున్న బొబ్బిలి
కాళ్ళు, చేతులు వంకరలు
శరీరమంతా గజగజ
ఇళ్ళు నిండిన చలిగాలులు
స్వెటర్, దుప్పట్లు సన్నిహితులు
మూలన చేరిరి పిన్నపెద్దలు
మక్కలు, బబ్బేర్ల పరపరలు
వేడి వంటలతో చకచకలు
పగలు రాత్రిలా మబ్బులు
మంచు వానతో పదనిసలు
చెట్టు పుట్టలు నివరుతో దడదడలు
చలి పులి కౌగిట్లో నివాసాలు
సూర్యకాంతికై తహతహలు
పల్లెలు మంటలతో సరిగమలు
ఎండతోని జనులు తిరిగి హుషారు.

-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

పుస్తక సమీక్షలు

స్ఫూర్తినిచ్చే ఎంకటి కతలు

ఉభయ తెలుగు రాష్ట్రాల బాల సాహితీవేత్తలకు సుపరిచితుడు, బాలసాహిత్య ప్రియులు, బాలల ప్రేమికుడు, ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎందరో విద్యార్థులను రచయితలుగా తీర్చిదిద్దిన గరిపెల్లి అశోక్ తన పదవీ విరమణానంతర జీవితాన్ని కూడా పిల్లలకే అంకితం చేసి బాలసాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. 1977లో నాంది కవితా సంపుటితో రచనలు ప్రారంభించిన గరిపెల్లి అశోక్ తన కలానికి పదును పెట్టి ఉద్యోగ జీవితంలో తనకు ఎదురైన అనుభవాలను రంగరించి "ఎంకటి కతలు" అనే పుస్తకాన్ని మన ముందుకు తీసుకువచ్చారు. ఇటీవలే మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో ప్రచురింపబడిన 'తెలంగాణ బడి పిల్లల



కథలు' సంకలనానికి గరిపెల్లి అశోక్ కన్వీనర్ గా ఉండి పిల్లల దగ్గర నుండి అనేక కథలు సేకరించి ఆ బృహత్తర కార్యక్రమానికి వెన్నుదన్నుగా నిలిచారు. బాల సాహిత్యం మరింత సుసంపన్నం కావాలని ఆశిస్తున్న గరిపెల్లి అశోక్ తాను చూసిన పిల్లల విజయగాథలే ఈ ఎంకటి కతలు అనే పుస్తకం.

రచయితగా గరిపెల్లి అశోక్ సామాజిక బాధ్యతను గుర్తెరిగి నేటి చదువులకు అద్దం పట్టేవిధంగా ఎంకటి కతలు పుస్తకాన్ని రూపొందించారు. గ్రామీణ పాఠశాల పరిమళాన్ని గుభాళించిన ఎంకటి కతలు పుస్తకం చదువుతున్న ప్రతి పాఠకుడికి తన బాల్యపు సంఘటనలు గుర్తుకు వస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్రామీణ విద్యార్థుల బతుకు చిత్రాలను, వారి మనోభావాలను కష్టాలను, కన్నీళ్లను మన కళ్ళ మందు నిలిపారు రచయిత. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వ బడి పిల్లల ప్రతినిధి ఈ ఎంకటి. అతను విద్యార్థి దశలోనే సమాజంలోని మంచి చెడులను ఆకళింపు చేసుకొని భావి తరాలకు ఆదర్శంగా నిలిచాడు. ఇందులోని కథానాయకుడు ఎంకటి ఒక వ్యక్తి కాదు, ఉన్నత భావాలుగల కొందరి వ్యక్తిత్వాల సమాహారంతో సమాజ మార్పును ఆశించే ఒక ప్రభలమైన శక్తి.

ఎంకటి చిన్న ఊరిలో పూరిగుడిసెలో తల్లితో కలిసి ఉంటాడు. తండ్రి బతుకుదెరువు కోసం వలస వెళ్ళాడు. వేసుకోవడానికి సరియైన బట్టలు లేక, తినడానికి తిండికూడా లేని దుర్భర పరిస్థితులలో ఎంకటి జీవితం ఉండేది. చదువుతో పాటు చిన్నాచితక పనులు అనేకం చేసేవాడు. ప్రతిఫలంగా వారు ఇచ్చిన ఆహారాన్ని తీసుకువచ్చి తల్లికి పెట్టి తాను తినేవాడు. ఎంకటి ఆకతాయి పిల్లవాడు కాదు, అల్లరివాడు అంతకంటే కాదు. అన్నింటిలో ముందు కానీ చదువులో మాత్రం వెనుక అయిన అతడికి సంస్కారం మిన్న. గురువును దైవంగా భావిస్తాడు. అర్థం కాని చదువులను ప్రశ్నిస్తాడు. అందరికీ సహాయం చేసే మంచి మనసున్న వాడు ఎంకటి. పెద్దయిన తర్వాత ఏం అవుతావని ప్రశ్నిస్తే మానవత్వం ఉన్న ఓ మనిషి కావాలని ఆకాక్షించాడు. ఎంకటి లాంటి పిల్లలు ప్రతి పాఠశాలలో, ప్రతి ఊరిలో ఉంటారు.

ఈ పుస్తకం పిల్లలతో పాటు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులును, పెద్దలను కూడా ఆకట్టుకునే విధంగా ఉంది. పిల్లల కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకొని ఉపాధ్యాయులు బోధన చేయాలనే విషయాన్ని అంతఃసూత్రంగా తెలియజేశారు. వలస కార్మికుల జీవితాలను పేద ప్రజల పిల్లల జీవిత సంక్షోభాలను వారు ఎదుర్కొంటున్న బాధలను చూపారు. తల్లిదండ్రులు ఆశలు, ఆశయాలను పిల్లల గురించి వారు కనే కలలను హృద్యంగా చూపారు రచయిత గరిపెల్లి అశోక్. ఎంకటి వేసే ప్రతి ప్రశ్న మనలను ఆలోచింప జేస్తుంది. పుట్టినరోజు వేడుకల సందర్భంగా పండ్లు పంచి పెట్టడం, హరితహారం కార్యక్రమానికి వచ్చిన పెద్దలకు మొక్కను బహుమతి ఇవ్వడంలాంటి సృజనాత్మక ఆలోచనలు గల వ్యక్తి ఎంకటి. ఎంకటి మాటలు మనకు జీవిత సత్యాలను బోధిస్తాయి. ఎంకటి వాళ్ళ అమ్మ కథ చదువుతుంటే కన్నీళ్ళు ఆగవు. హృదయం బాధతో బరువెక్కుతుంది.

బాల సాహిత్యానికి సంబంధించి వివిధ సృజనాత్మక కార్యక్రమాలు చేపడుతూ, బాలరచయితలకు ప్రోత్సాహం, సహాయ సహకారాలు అందిస్తూ అనేకమంది విద్యార్థులను భవిష్యత్తులో రచయితలుగా చూడాలని తపించే గరిపెల్లి అశోక్ రచయితగా నేటి కాలానికి అనుగుణంగా "ఎంకటి కతలు" పుస్తకాన్ని తీర్చిదిద్దారు. ఇది బడి పిల్లల విజయాల కతలు. కొత్తగా బాల సాహిత్యం రాస్తున్న వారికి ఎంకటి కతలు స్ఫూర్తిదాయకం. ఒక నూతన ఆలోచనతో విభిన్నమైన వస్తువును ఎంచుకొని పుస్తకంను మలిచిన తీరు అద్భుతం. తన శిష్యులైన ఎంకటి లాంటి ప్రతిభగల పిల్లలు గీసిన చిత్రాలు అందమైన ముఖ చిత్రంగా మరియు పుస్తకంలోపల కూడా ముద్రించబడ్డాయి. పదమూడు కతలు గల ఈ పుస్తకంలో 56 పేజీలు ఉన్నాయి. వెల 80 రూపాయలు.

ప్రతులకు గరిపెల్లి సరోజన, 404,
ఎ ఒ ఖీ రెసిడెన్సి, శ్రీనివాస నగర్,
సిద్దిపేట 502103
చరవాణి.9441701088

-కందుకూరి భాస్కర్
9703487088

కాలాయానము

కాలాన్ని ప్రశ్నించకు
ప్రశ్నించవలసింది నీ ఆత్మను
కాలమెప్పుడూ ప్రామాణికమే
కాలమెప్పుడూ పారదర్శకమే
కాలానికి తెలుసు తన విలువ
నీకే తెలియనిది కాలం విలువ
జీవితం ప్రవాహశీలం
పరు

నాటి సభలు, సమావేశాలు...

డిసెంబర్ 28 నుండి జనవరి 1వరకు

డిసెంబర్ 28 & 29

జ్ఞాపకాలు

డిసెంబర్ 28, 2014న నిజామాబాద్‌లో "ఇందూరు అపురూప అవార్డ్స్-2014" కార్యక్రమంలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు "ఉత్తమ జర్నలిస్టు అవార్డు"ను ప్రదానం చేస్తున్న తొలి సినీ నేపథ్య గాయని శ్రీమతి రావు బాలసరస్వతీదేవి, డా॥ అంపశయ్య నవీన్, ఎలిశెట్టి శంకర్, డా॥అమృతలత, నెల్లుట్ల రమాదేవి.

డిసెంబర్ 29, 2015న రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో 2014-15 సంవత్సరాల రంజని కుందుర్తి అవార్డు కవితల సంకలనం "నేల.. ఒక ఒంటరి వజ్రం" ఆవిష్కరణలో యం.వెంకటరమణ, శ్రీనివాస్, చీకోలు సుందరయ్య, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ఎన్.గోపి, మామిడ్ హరికృష్ణ, ఆచార్య శిభామణి, కొండెపూడి నిర్మల.

డిసెంబర్ 29

జ్ఞాపకాలు

డిసెంబర్ 29, 2015న రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో జరిగిన 2015 "రంజని-కుందుర్తి" అవార్డుల ప్రదానంలో అవార్డు గ్రహితలతో అతిథులు చీకోలు సుందరయ్య, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ఎన్.గోపి, తెలంగాణ భాష, సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ఆచార్య శిభామణి, కొండెపూడి నిర్మల, మట్టిగుంట వెంకటరమణ తదితరులు.

సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

డిసెంబర్ 29

జ్ఞాపకాలు

డిసెంబర్ 29, 2013న సిటీ సెంట్రల్ లైబ్రరీలో యక్కలూరి శ్రీరాములు కవితా సంపుటి "హైదరాబాద్ మా మక్కా, చార్మినార్ మా కాబా, పాత బస్తి మా కర్బలా" ఆవిష్కరణలో కె.బి. లక్ష్మీ, డా॥నాళేశ్వరం శంకరం, ప్రముఖ న్యాయవాది సి.వి.యల్ నరసింహారావు, నెలవంక నెమలీక పత్రిక సంపాదకురాలు దేవి లక్ష్మరాజు, యక్కలూరి శ్రీరాములు, బైస దేవదాసు, థింసా.

సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

డిసెంబర్ 30

జ్ఞాపకాలు

డిసెంబర్ 30, 2018న రవీంద్రభారతిలో సారిపల్లి కొండలరావు ఫౌండేషన్‌వారు నిర్వహించిన "తెలంగాణ జానపద కళల నగదు పురస్కారాల ప్రదానం"లో పురస్కార గ్రహితలతో వంగ శ్రీనివాస్‌గౌడ్, వై.కె.నాగేశ్వరరావు, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి, సారిపల్లి కొండలరావు, డా॥నందిని సిధారెడ్డి, మామిడి హరికృష్ణ తదితరులు.

డిసెంబర్ 30, 2018న శ్రీ లలిత కళావేదికలో తెలుగు భాషా చైతన్య సమితి 6వ వార్షికోత్సవంలో డా॥ ద్వా.నా.శాస్త్రి ప్రాసిన "తెలుగు పలుకుల కొలవరి మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవిగారు)" పుస్తకావిష్కరణలో జయప్రకాశ్, బడేసాబ్, డా॥నాళేశ్వరం శంకరం, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఆవిష్కర్త రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ డా॥ నందిని సిధారెడ్డి, డా॥ ద్వా.నా.శాస్త్రి, కళా జనార్దనమూర్తి, తదితరులు.

డిసెంబర్ 30

జ్ఞాపకాలు



డిసెంబర్ 30, 1985న తన ' చిత్రలేఖ'స్టూడియోలో కవి, చిత్రకారుడు, ఫోటో గ్రాఫర్ అలిశెట్టి ప్రభాకర్‌తో బైస దేవదాసు.

డిసెంబర్ 30, 2001న రాష్ట్ర సమాచారశాఖమంత్రి తమ్మినేని నీతారాంకు అభినందనలు తెలుపుతున్న రాష్ట్ర విన్న, మధ్య, తరహా దినపత్రికల సంఘం ప్రధాన కార్యదర్శి బైస దేవదాసు.

డిసెంబర్ 31

జ్ఞాపకాలు

డిసెంబర్ 31న త్యాగరాయ గానసభలో విశ్వసాహితీ ఆధ్వర్యంలో జరిగిన "తెలుగు జాతి భవిష్యత్తు" సదస్సులో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై సీనియర్ జర్నలిస్టు డా॥జి.యస్. వరదాచారి, డా॥ పోతుకూచి సాంబశివరావు, డా॥ కళా వేంకట దీక్షితులు, డా॥ కేతవరపు రాజ్యశ్రీ.

డిసెంబర్ 31, 2013న త్యాగరాయ గానసభలో విశ్వసాహితి ఆధ్వర్యంలో "తెలుగు జాతి భవిష్యత్తు" సదస్సులో సీనియర్ పాత్రికేయులు డా॥జి.యస్. వరదాచారిని సత్కరిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.వేదికపై పోతుకూచి సాంబశివరావు, డా॥కె.వి.దీక్షితులు, కేతవరపు రాజ్యశ్రీ.

తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులు

నివేదిక రూపొందించిన చాంబర్ ఆఫ్ కామర్స్

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): 'తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతి - ముందుకు సాగే అవకాశాలు' అనే విషయంపై క్షుణ్ణంగా విశ్లేషించి సమగ్ర నివేదికను రూపొందించిన తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్ రూపొందించిన నివేదికను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్‌కు బుధవారం అందజేసింది. మంత్రుల నివాసంలో వినోద్ కుమార్‌తో సమావేశమైన ఎఫ్.టీ.సి.సి.ఐ. అధ్యక్షుడు రమాకాంత్ ఇనాని, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కే. భాస్కర్ రెడ్డి, సీఈవో ఖ్యాతి నరవనే, డిప్యూటీ సీఈఓ టీ.సుజాత నివేదిక అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పంట భూములకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా పలు ప్రాజెక్టులను నిర్మించారు. పుష్కలంగా నీటి లభ్యతతో రాష్ట్రంలో వరి దిగుబడి పెద్ద ఎత్తున రైతుల చేతికి వచ్చింది. దీంతో భారీ స్థాయిలో బియ్యం నిల్వలు పెరిగాయి. ఈ బియ్యాన్ని విదేశీ మార్కెట్‌లో విక్రయించేందుకు ఉన్న అవకాశాలపై క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికను సిద్ధం చేయాలని వినోద్ కుమార్ ఎఫ్.టీ.సి.సి.ఐ. కి సూచించారు. అందులో భాగంగానే ఎఫ్.టీ.సి.సి.ఐ. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించి క్షేత్ర స్థాయి పరిస్థితులను విశ్లేషించి సమగ్ర నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు.

విదేశీ మార్కెట్ బియ్యం విక్రయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ నివేదికను సిద్ధం చేసి అందజేశారు. రాష్ట్రంలో వరి ఎక్కువగా పండించే కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, నల్లగొండ, మెదక్ వంటి జిల్లాల్లో డ్రై పోర్ట్ లను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ వరి కొనుగోళ్లు చేయాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ సూచించింది. తద్వారా రవాణా ఖర్చులను తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొంది. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న నిజామాబాద్ జిల్లాలోని డిచిపల్లి లేదా జానకంపేటలలో ఇన్లాండ్ కంటేనర్ డిపో ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సనత్ నగర్‌లో మాత్రమే ఐ.సి.డీ. ఉందని, ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బియ్యం రవాణా చేయాలంటే రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతాయని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం కొంకోర్ సబ్సిడీని సనత్ నగర్ ఐ.సి.డీ. కి వర్తింపజేయాలని సూచించింది. క్రిమిసంహారక మందుల వినియోగం పట్ల రైతులకు జాగ్రత్తలు చెప్పి వారిని చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అభిప్రాయపడింది. తెలంగాణ రాష్ట్రం వాతావరణ సమశీతోష్ణస్థితి కలిగి ఉండటం కలిసి వచ్చే అంశమని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో రైతులు పండించిన ' తెలంగాణ సోనా ' రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ గా మారిందని కొనియాడింది.

అదుపుతప్పిన బైక్ :ఇద్దరి మృతి

నాగర్‌కర్నూల్,జనవరి13(ఆర్ఎన్ఎ): జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండలం గంట్రావ్‌పల్లిలో పండుగ పూట విషాదం నెలకొంది. స్వగ్రామానికి వస్తూ బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడి ఇద్దరు మృతి చెందారు. గంట్రావ్‌పల్లి గ్రామానికి చెందిన బంధువులైన ఎం వెంకటస్వామి (52), లక్ష్మి (25) హైదరాబాద్‌లో ఉంటున్నారు. సంక్రాంతి పండుగ కావడంతో బైక్‌పై ఇవాళ ఉదయం స్వగ్రామానికి బయల్దేరారు.కల్వకుర్తి మండలం జేపీనగర్ అండర్ బైపాస్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి ÷÷-లఓల్గ÷వర్ గోడను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలై లక్ష్మి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తీవ్రంగా గాయపడ్డ వెంకటస్వామిని కల్వకుర్తి దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో గంట్రావుపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆనందంగా పండుగ జరుపుకునేందుకు స్వగ్రామానికి బయల్దేరిన ఇద్దరు మార్గమధ్యలో మృతిచెందడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

బస్టాండ్లలో తప్పని పడిగాపులు

సొంతూర్లకు వెళ్లాలనుకున్న వారికి భంగపాటు

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లాలన్న ప్రజలకు బస్సులు దొరక్క నానాయాతన పడ్డారు. మంగళ,బుధవారాల్లో కూడా బస్సుల కోసం వేకువ జామునుంచే బస్టాండ్ల వద్దకు వచ్చినా చేరాల్సిన గమ్యానికి బస్సులు దొరక్క ఇబ్బందులు పడ్డారు. తమ స్వగ్రామాలకు తరలివెళ్తున్న ప్రయాణికుల రాకతో జూబ్లీ బస్‌స్టేషన్,ఇమ్లిబన్, దిల్‌సుఖ్ నగర్,ఉప్పల్ బస్టాండ్ పరిసరాలు కిటకిటలాడాయి. నగరవాసులు కుటుంబ సమేతంగా పండుగకు తమ ఊళ్లకు వెళుతుండడంతో సందడి వాతావరణం నెలకొంది. అధికారులు ముందుగా అనుకున్నట్లుగానే రద్దీకి అనుగుణంగా కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ సెక్టార్లలోని వివిధ ప్రాంతాలకు రోజువారి సర్వీసులతోపాటు అదనపు బస్సులను ఏర్పాటు చేసినా అవి ప్రయాణికులకు సరిపోవడం లేదు. విజయవాడ వైపు ప్రత్యేక బస్సులు నడిపారు. కర్నూలు రూట్లో కూడా బస్సులు నడిపారు.సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీతో ఎంజీబీఎస్, సీబీఎస్‌లు కిటకిటలాడుడాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రయాణికుల సౌలభ్యం కోసం ఆర్టీసీ రెగ్యులర్ బస్సులతో పాటు యాభై శాతం అదనపు ఛార్జీలతో ప్రత్యేక బస్సు సర్వీసుల్ని ఏర్పాటు చేసింది. అన్ని బస్సులు ఎంజీబీఎస్ నుంచే నడపడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండటంతో ఆర్టీసీ అధికారులు గత కొన్నేళ్లుగా ఎంజీబీఎస్‌తో పాటు జేబీఎస్, నగర శివారు ప్రాంతాలైన దిల్‌సుఖ్‌నగర్, ఎల్.బి.నగర్, ఉప్పల్, ఈసీఐఎల్, ఆరాంఘర్, మెహిదీపట్నంలతో పాటు ఆర్టీసీ అధీకృత ఏజెంట్లకు కేటాయించిన ప్రాంతాల వద్ద నుంచి బస్సులు ఏర్పాటు చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

పండగరద్దీని పట్టించుకోని రైల్వే శాఖ

కరెంట్ బుకింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): పండుగ రద్దీని రైల్వే శాఖ ఏమాత్రం పట్టించుకోలేదు. రెగ్యులర్ రైళ్లు నడపకపోవడం, స్పెషల్ రైళ్లలో జనరల్ బోగీలు తీసివేయడం, ప్యాసింజరు రైళ్ల స్థానంలో స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపటం, బాలీచాలని ఫెస్టివల్ స్పెషల్ రైళ్లలో మూడు, నాలుగు రెట్లు తత్కాల్ చార్జీలు వసూలు చేయటం వంటి చర్యలతో పేద, మధ్యతరగతి వర్గాలు రైళ్లలో ప్రయాణించ లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధానంగా కోల్‌కతా, ఒడిశా వైపు వెళ్లే వలస కార్మికులు రైళ్లు లేక ఇబ్బందులు పడ్డారు. సంక్రాంతి ప్రయాణాలతో మంగళవారం కూడా రహదారులపై రద్దీ నెలకొంది. నగరవాసులు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు తరలి వెళ్లారు. విజయవాడ, విశాఖ, కాకినాడ, ఏలూరు, తిరుపతి, కడప తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో భారీగా రద్దీ కనిపించింది. మరోవైపు తెలంగాణలోని వివిధ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులతో జూబ్లీ బస్‌స్టేషన్, ఉప్పల్, ఎల్‌బీ నగర్ తదితర ప్రాంతాలు పోటెత్తాయి. వివిధ మార్గాల్లో బస్సులు కిక్కిరిసి బయలుదేరాయి. ఇక రైళ్లలో జనరల్ బోగీల్లో అప్పటికప్పుడు టికెట్ తీసుకొనే సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెయిటింగ్ లిస్టులో ఉన్న వారు టికెట్‌లను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. గోదావరి, విశాఖ, ఇంటర్‌సిటీ, సర్సాపూర్, మచిలీపట్నం తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వెయిటింగ్ లిస్టు 350 దాటిపోయింది. చాలా రైళ్లలో 'నోరూమ్'దర్శనమివ్వడంతో చివరి నిమిషంవరకు ఎదురు చూసిన వాళ్లు గత్యంతరం లేక ప్రైవేట్ బస్సులను ఆశ్రయించవల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో సాధారణ చార్జీలపైన 50 శాతం అదనంగా, ప్రైవేట్ ట్రావెల్స్‌లో రెట్టింపు చార్జీలు వసూలు చేశాయి. కొన్ని సంస్థలు రెండు రెట్లు పెంచాయి. రోవైపు సొంత వాహనాల్లో సైతం భారీ ఎత్తున తరలి వెళ్లారు. హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లేవారు ఎక్కువ శాతం సొంత కార్లు, క్యాబ్‌లను ఆశ్రయించారు. సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి సుమారు 15 లక్షల మంది నగర వాసులు సొంతూళ్లకు తరలి వెళ్లినట్లు అంచనా.

14-01-2021 గురువారం,
సంక్రాంతి ఉదయం 11 గంటలకు

యజ్ఞం చేద్దాం
మనల్ని మనం రక్షించుకుందాం

పుస్తకావిష్కరణ
****
స్వామీ బ్రహ్మానంద సరస్వతి
కరకమలములచే
****
స్థలం : బ్రాహ్మ మహా విద్యాలయం,
పాత రాజంపేట, కామారెడ్డి.

రచన-సంపాదకులు :
బైస హరిదాస్ యోగాచార్య
4:50 PM

కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదం

-ఎదురెదురుగా రెండు బస్సులు ఢీ: పలువురికి గాయాలు

వరంగల్,జనవరి13(ఆర్ఎన్ఎ): కరీంనగర్- వరంగల్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ వద్ద ఉన్న ఈ జాతీయ రహదారిపై రెండు ఆర్టీసీ బస్సులు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సుమారు 24మందికి తీవ్ర గాయాలయ్యాయి. 12 మందిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా.. ఇద్దరు డ్రైవర్ల పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. సంఘటన వివరాలు తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.



భాగ్యలక్ష్మి ఆలయం వద్ద భోగిమంటలు

-వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,జనవరి13(ఆర్ఎన్ఎ): గతానికి భిన్నంగా చార్మినార్ దగ్గర నిర్వహించిన భోగి వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఉండాలని.. భాగ్యలక్ష్మి అమ్మవారికి కవిత ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా జాగృతి ఆధ్వర్యంలో భోగి మంటల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. గత ఏడాదంతా కరోనాతో ఇబ్బందులు పడ్డామని.. ఆ చెడు అంతా భోగి మంటల్లో కాలిపోవాలని అభిలషించారు. ప్రజలు కరోనా మహమ్మారి నుంచి విముక్తి పొందాలని ఆకాంక్షించారు. సంక్రాంతి సిరిసంపదలు ఇచ్చే పండుగ అన్నారు. అందరి జీవితాల్లో సిరిసంపదలు సమృద్ధిగా రావాలని కవిత పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది నుంచి ప్రపంచాన్ని వెంటాడుతున్న కరోనా మహమ్మారి పీడ ఈ భోగి మంటల్లో కాలిపోవాలని కోరుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి ప్లలెలో భోగి మంటల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకుంటామని చెప్పారు. జీవితంలో చెడును పారద్రోలి, మంచిని కోరుకునే గొప్ప సాంప్రదాయం మనదన్నారు. ఖమ్మం నగరంలో భోగిమంటల కార్యక్రమం వేడుకగా జరిగింది. ఇందులో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ భార్య వసంత లక్ష్మి హాజరయ్యారు.

తప్పిపోయిన ఇద్దరు విద్యార్థినుల ఆచూకీ లభ్యం

కరీంనగర్,జనవరి13(ఆర్ఎన్ఎ): జిల్లాలో అదృశ్యమైన ఇద్దరు విద్యార్థినిల ఆచూకీ లభ్యమైంది. జమ్మికుంట పోలీసులు 24 గంటల్లోనే విద్యార్థినిల ఆచూకీ కనుగొన్నారు.

మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ మండలం కొత్త కోట వద్ద విద్యార్థినిల ఆచూకిని పోలీసులు గుర్తించారు. మహబూబ్ నగర్ జిల్లా పోలీసులు ఇద్దరు మైనర్ అక్కా, చె÷-లలెల్లను స్థానిక పోలీసులకు అప్పగించారు. జమ్మికు ంట మండలం వావిలాల గ్రామానికి చెం దిన సామ క్రిష్ణ శ్రీ(15), సామ వైష్ణవి (14) ఇంటి నుంచి పరార య్యారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వీరి ఆచూకిని పోలీసులు కొనుగొ విద్యార్థినిల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.

డిసెంబర్ 31

జ్ఞాపకాలు

డిసెంబర్ 31,1985లో నిజామాబాద్‌లో 'కేకలు' వారపత్రిక దశాబ్ది ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న ప్రముఖ కవి, జర్నలిస్టు, దేవిప్రియ. సభలో పాల్గొన్న శాసనసభ్యులు ఎ. బాలిరెడ్డి, బైస రామదాసు, ఎ.యస్. పోశెట్టి, బైస దేవదాసు, జర్నలిస్టు నాయకుడు పూర్ణచంద్రరావు నాళేశ్వరం శంకరం, ఆరెట్టి తదితరులు.



జనవరి 1

జ్ఞాపకాలు

జనవరి 1, 2017న నేటినిజం దినపత్రిక 2017 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర బి.సి. కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు. చిత్రంలో ఆజంఖాన్, అశోక్, కమీషన్ సభ్యులు ఆంజనేయులు, డా॥ వకుళాభరణం కృష్ణమోహన్, జూలూరి గౌరీశంకర్, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, శ్రీమతి బైస వీణాదాసు, నస్రీన్‌ఖాన్.

జనవరి 1, 2018 నేటినిజం దినపత్రిక 2018-క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి. చిత్రంలో పెద్దూరి వెంకటదాసు, దైవజ్ఞశర్మ, బైస దేవదాసు, శ్రీమతి బైస వీణాదాసు.

జనవరి 1

జ్ఞాపకాలు

జనవరి 1, 2019 నేటినిజం దినపత్రిక 2019 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ. చిత్రంలో నస్రీన్‌ఖాన్, శ్రీమతి బైస వీణాదాసు, బైస దేవదాసు, బైస సూరజ్, ఆజంఖాన్, ఏ.దామోదర్

జనవరి 1, 2020 నేటినిజం దినపత్రిక 2020 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డి. చిత్రంలో డా॥ఎనుగు నరసింహారెడ్డి, పరమాత్మ, కందుకూరి శ్రీరాములు, బైస దేవదాసు, శ్రీమతి బైస వీణాదాసు, శ్రీమతి మౌనిక, చి॥చిన్నయానంద్, బైస సూరజ్, దాస్యం సేనాధిపతి, డా॥నాళేశ్వరం శంకరం.

జనవరి 1

జ్ఞాపకాలు

జనవరి 1, 2008న నేటినిజం క్యాలెండర్ ఆవిష్కరణలో బైస సూరజ్, కె.రంగసాయి, బైస దేవదాసు, రాష్ట్ర సమాచార శాఖ కమీషనర్ సి. పార్థసారథి, పిరాట్ల వెంకటేశ్వర్లు, మురళి

జనవరి 1, 2018న ఒక సమావేశంలో వడ్డేపల్లి కృష్ణ, తెలంగాణ రాష్ట్ర బి.సి.కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు, బైస దేవదాసు, శ్రీమతి బైస వీణాదాసు, శ్రీమతి శ్యామలా రాములు,శ్రీమతి మణి.

జనవరి 1

జ్ఞాపకాలు

జనవరి 1, 2015 నేటినిజం దినపత్రిక 2015 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారి, బైస దేవదాసు, పెద్దూరి వెంకటదాసు, వనం రాజేశ్ తదితరులు.

జనవరి 1, 2016న నేటినిజం దినపత్రిక 2016 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ కమీషనర్ నవీన్ మిఠల్. వేదికపై రియాజ్, పి. దయానంద్, యూసుఫ్‌బాబు, బైస దేవదాసు, వనం రాజేశ్.